


నవంబర్, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 10 పేజీలు: 64 వెల: రూ. 20/-

## బడుగుల బాంధవుడు

### ఎస్. ఆర్. శంకరన్



# దీపావళి కథల పోటీ
## (గ్రామీణ కథలు, హాస్య కథలు)

సాహిత్య ప్రక్రియల్లో కథ స్థానం కథదే. అయితే, రాను రాను హృదయాన్ని తాకే మంచి కథలు కరువయిపోతున్నాయి. అందువల్ల మంచి కథకి పట్టం కట్టాలని 'స్థానిక పాలన' పత్రిక నిర్ణయించింది.

ఈ దీపావళి సందర్భంగా గ్రామీణ కథలు, హాస్య కథలు అనే రెండు విభాగాల్లో పోటీ నిర్వహిస్తున్నాం. గ్రామీణ నేపథ్యం ఉండి, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే కథలు ఒక విభాగంలోను, హాస్య కథలను మరొక విభాగంలోను పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

### బహుమతుల వివరాలు

రెండు విభాగాలకు విడివిడిగా ఈ కింద పేర్కొన్న బహుమతులుంటాయి.

| | |
|---|---|
| **ఉత్తమ గ్రామీణ కథ** | **రూ. 15,000** |
| **ఉత్తమ హాస్య కథ** | **రూ. 15,000** |
| **ద్వితీయ ఉత్తమ గ్రామీణ కథ** | **రూ. 10,000** |
| **ద్వితీయ ఉత్తమ హాస్య కథ** | **రూ. 10,000** |
| **తృతీయ ఉత్తమ గ్రామీణ కథ** | **రూ. 8,000** |
| **తృతీమ ఉత్తమ హాస్య కథ** | **రూ. 8,000** |
| **ప్రతి విభాగంలో మూడు కన్సోలేషన్ బహుమతులు (ఒక్కొక్క కథకి)** | **రూ. 5,000** |
| **సాధారణ ప్రచురణకు ఎంపికైన గ్రామీణ, హాస్య కథలకు** | **రూ. 2,000** |

### గ్రామీణ, హాస్య కథల పోటీకి కథలు పంపే రచయిత(త్రు)లు ఈ కింది సూచనలను గమనించాలి:

☆ కథలు కింద పేర్కొన్న చిరునామాకు డిసెంబర్ 1వ తేదీ లోగా అందే విధంగా పంపాలి.

☆ ఒక్కొక్కరు ఎన్ని కథలయినా పంపవచ్చు ☆ రెండు విభాగాల పోటీలలోను పాల్గొనవచ్చు.

☆ కథ రాతప్రతి మీద కథ పేరు మాత్రమే ఉండాలి. రచయిత పేరు కథకి జతపరిచే హామీ పత్రంలో వుంటే చాలు.

☆ కథ నిడివి చేతి రాతలో A4 సైజు కాగితాల్లో 6 పేజీలు మించకూడదు. సైజుకు మించిన కథలను పరిశీలించటం సాధ్యపడదు.

☆ పేజీకి ఒక పక్క మాత్రమే, దస్తూరీ అర్థమయ్యే విధంగా, స్పష్టంగా రాయాలి.

☆ సామాజిక అంశాలతో పాటు అన్ని అంశాలపై కథలు పంపవచ్చు. అశ్లీలత, అసభ్యత, కులమతాలను రెచ్చగొట్టే ధోరణులు, రాజకీయాలు, వ్యక్తిగత దూషణ, వెకిలితనం లేకుండా ఉండే కథలు పంపాలి.

☆ పోటీకి పంపే కథలు తెలుగు సంస్కృతికి దగ్గరగా ఉండాలి. అరువు తెచ్చుకున్న కథాంశాలు, విదేశీ సంస్కృతీ కథలో ప్రతిఫలించకూడదు. అనుకరణ పాత్రలతో కూడిన కథాంశాలకు దూరంగా ఉండాలి.

☆ ఎంపిక కాని కథలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. ఎంపికకాని పక్షంలో తమ కథలను తిప్పి పంపాలని కోరుకునేవారు అందుకు అవసరమైన స్టాంపులు అంటించిన కవర్లను కూడా తప్పక జత చేయాలి.

☆ న్యాయనిర్ణేతల కమిటీ మాత్రమే బహుమతి పొందే కథలను నిర్ణయిస్తుంది.

☆ ఎంపికైన కథలు 'స్థానిక పాలన' పత్రికలో ప్రచురితమవుతాయి.

☆ ఫలితాలను జనవరి 2011 'స్థానిక పాలన' పత్రికలో చూడవచ్చు.


చిరునామా:
**ఎడిటర్, 'స్థానిక పాలన'**
ఎ.ఎం.ఆర్. అపార్డ్, రాజేంద్రనగర్,
హైదరాబాద్-500 030. ఆంధ్రప్రదేశ్, ఇండియా.
ఫోన్: 040-24018656, ఫ్యాక్స్: 040-24017005
E-mail: phanikumar@ap.gov.in

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 10

నవంబర్, 2010

చీఫ్ ఎడిటర్
**డా॥ ఫణి కుమార్**

ఎడిటర్
**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)
**జి. గంగాధర్**
**టి. కృష్ణ**
**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**
**ఎమ్.ఎ. కుమార రాజా**
**బ్రిగేడియర్ డి.వి. రావు**
**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**
**డాక్టర్ పి. రఘునాథరెడ్డి**
**డాక్టర్ లీలా ప్రసాద్**
**సి. వెంకటేశ్వర రావ్**
**హెచ్. కూర్మారావు**
**డాక్టర్ కె. లక్ష్మీపతి**
**ఎమ్. విజయలక్ష్మి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ
ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail ID: phanikumar@ap.gov.in
phaniapard@gmail.com

# విషయ సూచిక

సంపాదకీయం ..... 2
దివ్వెలకేళి ... దీపావళి..... 3
వార్తల్లో 'అపార్డ్' ..... 5
బడుగుల బాంధవుడు ..... 7
20.9.2010 నాటి మంత్రివర్గ నిర్ణయాలు..... 9
సామాజిక దార్శనికుడు మాహాత్మా జ్యోతిరావు పూలే ..... 10
మహనీయుల చతురోక్తులు ..... 12
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవాభివృద్ధి సమస్యలు, సవాళ్ళు ..... 13
మానవతా ప్రబోధకుడు బసవేశ్వరుడు ..... 16
మల్లికార్జున పండితారాధ్యుడు (తెలుగు సాహిత్య చరిత్ర)..... 18
ఆరోగ్యానికి మాతా శిశు-అనుబంధ పోషకాహారం..... 22
'నిత్యాన్నదాత' డొక్కా సీతమ్మ ..... 24
దిద్దుబాటు (కథ)..... 25
చీడపీడలకు సస్యరక్షణ చర్యలు (వ్యవ'సాయం') ..... 27
ఆ మహనీయుల త్యాగఫలమే 'ఈదుల్ అజ్‌హా'..... 30
భారతావని భవిష్యత్తు బాలలే..... 32
పంచాయితీరాజ్ సంస్థలలో స్ఫూర్తిని నింపిన గ్రామ సభల సంవత్సరం ..... 34
ఒకనాడు ప్యాక్షన్ గ్రామం-నేడు నిర్మల్ గ్రామం..... 38
మనిషికీ మనిషికీ మధ్య (కథ)..... 40
వెల్‌డన్ ఇండియా ..... 43
పరమ పావనం కార్తీకమాసం..... 46
మానవ హక్కుల రక్షణ దిశగా గ్రామాల్లో న్యాయ పంచాయితీలు ..... 48
శ్రీరమణ పేరడీలు ..... 51
కలపేతర అటవీ సంపద ద్వారా గిరిజనుల జీవనోపాధులు..... 55
పరిష్కారం (కథ) ..... 57
అమెరికా పేదలకు ఆసరాగా 'గ్రామీణ్ అమెరికా'..... 60
ప్రపంచ ఆవాస దినోత్సవం 2010..... 63

నవంబర్, 2010

# సంపాదకీయం..

## మహానుభావునికి నివాళి

బడుగుల బాంధవుడు, దళితుల ఆశాకిరణం, గిరిజనులకు ప్రియతముడు, అలుపెరుగని మానవ హక్కుల యోధుడు అయిన మాజీ ఐ.ఎ.ఎస్. అధికారి శ్రీ ఎస్.ఆర్. శంకరన్ మరణించడం రాష్ట్రానికే కాదు దేశానికే తీరని లోటు.

మహాసౌమ్యుడు, వినయశీలి, మహోన్నత మానవతావాది అయిన శంకరన్‌గారు తన ఆశయాలు, లక్ష్యాలు, అవగాహన, కార్యశీలతలతోపాటు, మహాబలమైన వ్యక్తిత్వాన్ని కూడా ప్రదర్శించారు. అంకితభావంతో త్రికరణశుద్ధిగా పనిచేసిన అతికొద్దిమంది ఉన్నతస్థాయి అధికారుల్లో ఆయన అగ్రభాగాన నిలుస్తారు.

శంకరన్‌గారు సామాన్యుల కోసం, పేదల కోసం, పడిన తపన, చేసిన కృషి అసాధారణమైనవి. అందువల్లనే ఆయన వీరికేకాక, దేశవ్యాప్తంగా సంక్షేమవాదులకు, పౌర హక్కుల కార్యకర్తలకు, ప్రజాస్వామ్యవాదులకు ఇంతగా గౌరవనీయుడు, ప్రేమపాత్రుడు అయ్యారు.

ఆయన నిబద్ధతతోపాటు, అవగాహన కూడా అంత స్పష్టమైనది కనుకనే ఐక్యరాజ్యసమితి, సుప్రీంకోర్టు వంటి సంస్థలు శంకరన్‌గారిని పేద వర్గాలకు సంబంధించిన పలు కార్యక్రమాలు, పథకాలు, సర్వేలు వంటి వాటికి అధికారిగానో, సలహాదారుగానో నియమించుకున్నాయి.

ప్రముఖ ప్రజాస్వామిక వాది, పీడిత ప్రజల ఉద్యమ పక్షపాతి అయిన శంకరన్‌గారు విద్యార్థిదశ నుంచే జాతీయ, ప్రజాస్వామిక భావాలు కలిగి ఉండేవారు. ఐ.ఎ.ఎస్. అధికారిగా నియమితులైన తొలి రోజుల్లోనే ఆనాటి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీ యుగంధర్‌తో కలిసి శ్రీకాకుళం గిరిజనోద్యమ సమస్యలపై, నాటి ఎస్సీ, ఎస్టీ కమిషన్ జాతీయ ఛైర్మన్‌గా ఉన్న బి.డి. శర్మ తదితరులతో జరిపిన చర్చల ఫలితంగా 1/70 చట్టం రూపుదాల్చిందని అంటుంటారు.

పేదలు, దళితులు, ఆదివాసీల పట్ల అపారమైన ప్రేమతో నిరంతరం తపనపడే శంకరన్‌గారు అస్సాం, త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శిగా పనిచేసినప్పుడు గిరిజనులు, గిరిజనేతరుల ఐక్యతకు ఎంతగానో కృషి చేశారు. ఆహార హక్కుపై సుప్రీంకోర్టు నియమించిన సంఘానికి శంకరన్‌గారు కమీషనర్‌గా ఉన్నారు. గిరిజన హక్కులపై ప్రభుత్వం నియమించిన కమిటీలో ముఖ్యుడిగా కీలక సిఫార్సులు చేశారు. సఫాయి కర్మచారి ఉద్యమానికి తోడ్పడ్డారు. నక్సల్స్‌తో మన రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో కీలకపాత్ర పోషించిన శంకరన్‌గారు రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధికి ఐటిడిఏల ఏర్పాటు వెనుక కీలకపాత్ర కూడా పోషించారు.

ప్రభుత్వంలో నిబద్ధతతో పనిచేస్తే ప్రజలకు ఎంత సేవ చేయవచ్చో శంకరన్‌గారు నిరూపించారు. పనిచేసిన ప్రతిచోటా సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ప్రజలకు, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు, ఎస్.సి., ఎస్.టి. ప్రజలకు మరువలేని సేవలను అందించిన శంకరన్ గారిని దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరు.


శంకరన్‌గారి గురించి రాయాలంటే పుస్తకాలే సరిపోవు. ఇక ఈ చిన్న సంపాదకీయంలో ఎంత రాసినా, ఆయన గొప్పతనంలో వందోవంతు కూడా వివరించలేము. ఆ మహానుభావుడికిదే మా వినమ్రపూరిత నివాళి.

# దివ్వెలకేళి... దీపావళి



*ఇదమంధతమః కృత్స్నం జాయేత భువనత్రయం యది*

ప్రాచీన భారతీయ వాఙ్మయానికి 'జ్యోతిర్మయం వాఙ్మయం' అని ప్రసిద్ధి. వాగ్రూపంలో వెలసిన వేద వేదాంగ పురాణాది విజ్ఞానాన్నంతటినీ ఒక జ్యోతితో పోల్చారు. సర్వ తమస్సునూ ధ్వంసం చేసే జ్యోతి స్వరూపమే జ్ఞానం. అందుకే భః జ్ఞానం రత ఆసక్తి 'భారత' అన్నారు. ప్రాణమూ జ్యోతి స్వరూపమే. వీటన్నింటికీ ప్రతీక దీపం. అందుకే దీపారాధన మన పూజా విధానంలో ప్రధానమైన విధి. తెలిసి చేసినా, బుద్ధి పూర్వకంగా చేసినా, బుద్ధిహీనంగా చేసినా దీపారాధన చేస్తే చాలు. దాని ఫలితం దానికి వచ్చితీరుతుంది. అదీ దీపారాధనలో ఉన్న రహస్యం. అందుకే దీపాన్ని...




*'దీప జ్యోతిః పరబ్రహ్మ దీపస్సర్వ తమోపహః*
*దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీపం నమోస్తుతే...'*

దీపమే పరబ్రహ్మ స్వరూపం. దీపమే సకల పాపాలు అనే చీకట్లను హరింపజేసే వెలుగు. దీపం వల్ల దేన్నైనా సాధించవచ్చు. అటువంటి సంధ్యా దీపానికి నమస్కారం చేయాలని నమ్మకం. ఈ నమ్మకాన్నే సంప్రదాయం కింద మలచి ఏర్పాటు చేసిన పర్వదినం దీపావళి.

'దీపావళి' అంటే వరుసగా పేర్చిన దీపాలన్నమాట. ఇలా అందరూ పేర్చిన దీపాలను చూసే తారాలోకం మొత్తం భూమిపై వాలిందా అనిపిస్తుంది. ఇది మానవ మనోవికాసానికీ, ఐకమత్యానికీ, జ్ఞాన తృష్ణకీ ప్రతీక. తమ సుఖసంతోషాలను ఆనందంగా పంచుకొనే వేడుక. ఇది మానవుడు పుట్టిన నాటినుంచీ ఉంది. యుగయుగాలుగా ఉంది. తరతరాలుగా ఉంది. చెడుపై మంచి గెలిచినప్పుడల్లా దీపావళి వెలుగే. లోకకంటకులైన నరకాసురుడూ, రావణుడూ, బలిచక్రవర్తి మొదలైన రాక్షసులు సంహరింపబడిన ప్రతి సందర్భంలోనూ దీపావళి జరిగింది. విక్రమార్కుడూ, అశోకుడూ మొదలైన రాజులు పట్టాభిషిక్తులైన సందర్భాలలోనూ, విజయాలు సాధించిన సంబరాల్లోనూ దీపావళి వెలుగై ఉంది.

తప్పు చేసిన వాడు కన్న కొడుకైనా సరే... క్షమించేది లేదన్న సత్యాన్ని, భారతీయుల లోక కళ్యాణకాంక్షనీ నిరూపిస్తూ నరకాసురుణ్ణి సంహరించిన సత్యభామ (నరకాసురుడు భూ దేవి కుమారుడు. ఆ భూ దేవి అవతారమే సత్యభామ) మన జాతికి ఆదర్శ స్త్రీ. నరకాసురుణ్ణి తమో గుణానికి ప్రతీకంగా చెప్తారు. ప్రతి వ్యక్తిలోనూ ఒక 'నరకుడు' ఉంటాడు. వాణ్ణి ఎవరికి వారే సంహరించుకోవాలి. ఇదే దీపావళి ఇచ్చే సందేశం.

దీపావళి రోజున ఉత్తర భారత స్త్రీలు, పురుషులు లక్ష్మీపూజ చేస్తారు. ముఖ్యంగా వ్యాపారస్తులకు ఈ దీపావళి మరీ ముఖ్యమైనది. వారికి దీపావళే సంవత్సరాదితో సమానం. జరిగిన సంవత్సర లాభనష్టాలను లక్ష్మీ దేవికి నివేదించుకొని, పాత పద్దు పుస్తకాలన్నీ తీసివేసి, కొత్త పుస్తకాలతో







ప్రారంభిస్తారు. ఇకనైనా చల్లగా చూడమని లక్ష్మీదేవిని వేడుకుంటారు. చల్లని చూపుల శుభలక్ష్మి కటాక్షం కోసం ఎన్నెన్నో పూజలు చేస్తారు. 'దీపావళి' కళకు ప్రతీక. లక్ష్మీదేవీ కళకు ప్రతీక. చక్కగా దీపాలతో కళకళలాడే ఇంటిలోకి సర్వసంపదలనూ కురిపించేందుకు సిద్ధంగా లక్ష్మీదేవి 'నరకచతుర్ధశి' నాడు నీటిలోనూ, తైలంలోనూ ఆవహించి ఉంటుంది. అందుకే తెల్లవారుజామునే తలస్నానం చేయాలనీ, ఆనాడే నూతన వస్త్రాలు ధరించాలనే సంప్రదాయం ఏర్పాటు చేశారు.

పిల్లలకు అత్యంత ప్రీతి పాత్రమైన పండుగ దీపావళే. ఈ రోజు అమావాస్య చీకటిలో మిరుమిట్లు గొలిపే కాంతులతో కాల్చే 'బాణాసంచా' అందరినీ ఆకర్షిస్తుంది. వీటిని తయారు చేయటంలో పాల్గొనే పిల్లలూ కార్యకౌశలాల్ని పొందుతారు.

'శివకాశి' లో కొన్ని కుటుంబాలను ఈ 'బాణాసంచా తయారీ' నిల బెడుతోంది. ముఖ్యంగా పిల్లల ఆనందకారకమే ఈ పండుగ. పిల్లల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరియటంతో పాటు ధైర్యసాహసాలను కూడా ఈ పండుగ నేర్పుతుంది.



## అఖండ జ్యోతి



తారలన్నీ ఏకమై మూకుమ్మడిగా
పుడమితల్లి పాదాలకు సిరిమువ్వలై
పలకరించే పోయగం...
హృదయం చిప్పల్లి ఆనందం తారాజువ్వలా
నింగికేగసే వేళ
లోకం ఒక వెలుగు పూదండై అలరాతుంది.
టపటపల మోతల్లోంచి
ఉలిక్కిపడ్డ చీకటి వెలుగు పై చెంగును
ముఖానికి అడ్డుపెట్టుకుంటుంది.
ఏ తమస్సు నిత్యం వేధించిందో
ఏ దానవత్వం అనునిత్యం వేదనల్ని గుచ్చి గుచ్చి
బాధించిందో దాని కిక్కడితో
చివరి ఊరేగింపు
సంప్రదాయం చేతుల్లో దీపమై వెలిగిన భక్తి
ఎప్పుడూ వెలుగుతూనే ఉంటుంది.
ఎన్ని చీకట్లు కమ్ముకున్నా
ఎంతమంది నరకాసురులు ముట్టడించినా
'దీపజ్యోతిః పరబ్రహ్మ'
నిత్యమై, సత్యమై గుండె గూటిలో అనంతమై
అఖండంగా వెలుగుతూనే ఉంటుంది.

\- అద్దంకి శ్రీనివాస్

వివిధ మతాల వారూ వివిధ ప్రాంతాల వారూ దీపావళిని జరుపుకొంటారు. నరకచతుర్ధశి అంటే నరకాసురుడు హతుడైన రోజు. ఈ రోజే అజ్ఞానమనే తమస్సును రూపుమాపుకొని వీరులు విజయం వైపు, సాధకులు సత్యజ్ఞానం వైపు బయలు దేరారు. తమ ప్రయాణాన్ని జ్యోతిర్మయం కావించుకొన్నారు. అందుకే తమో గుణానికి ప్రతీకగా నిలిచే నరకాసురుణ్ణి కాగితాలతో కానీ, గడ్డితో కానీ చేసి ఊరేగించి చివరికి ఊరి వెలుపల తగలబెట్టి స్నానం చేసి తిరిగివస్తారు. ఇప్పటి నుంచీ 'పాపం' పీడ విరగడ అయ్యిందన్నదానికి ఇదే గుర్తు. అందువల్ల అందరిలోనూ దీపావళి ఉంది. దీపావళి రోజున శక్తి స్వరూపిణి అయిన కాళీమాతను ఆరాధించటం, ఐశ్వర్యప్రదాయిని అయిన లక్ష్మీదేవిని ఆరాధించటం ఆచారంగా వస్తోంది.



దేశ విదేశాలలోనూ ఈ దీపావళి పర్వదినం జరుపుకొంటున్నారు. శ్రీలంక, బర్మా, ఇండోనేషియా వంటి దేశస్థుల ఆచారాలలో దీపోత్సవ నిర్వహణ ఒక భాగం. ఉత్తర భారతదేశంలో 'దీపావళి' వ్యాపారవేత్తలకు తొలిపండుగ. మనం ఉగాది పండుగకు చేసినట్లుగా జాతకాలు చెప్పించుకొని వినటం, పంచాంగ శ్రవణం చేయటం దీపావళి రోజున చేస్తారు. ఆనాటి జాతకాలను బట్టీ, లక్ష్మీ అనుగ్రహాన్ని అంచనా వేసుకొంటూ మళ్ళీ దీపావళి వరకూ జాగ్రత్తగా వ్యాపారం చేసుకుంటారు. కొత్త వ్యాపారాలు ప్రారంభించటం, క్రొత్త దుస్తులతో ఉద్యోగులను గౌరవించటం చేస్తారు. ధన ధాన్యాదులను దానం చేస్తూ విశాల హృదయాన్ని చాటుకుంటారు.

పౌరాణిక ప్రాశస్త్యం, ఆధ్యాత్మిక హితబోధ మొదలైన పరమార్థాలతో పాటు, లౌకిక జీవనానికి పనికి వచ్చే వ్యక్తిత్వవికాసం, సామాజిక ప్రయోజనాలకు దోహదకారి అయిన దీపావళి పర్వదినాన్ని జరుపుకోవటం ముక్తిప్రదమూ, ఆనందదాయకమూ కూడా. అనేకంగా ఒత్తిళ్ళకు లోనై సతమతమవుతున్న ప్రస్తుత సమాజానికి పెదవిపై చిక్కగా వెలిగే నవ్వుల దీపమే దీపావళి.

\- డా॥ యస్.ఏ.టి. రాజ్యలక్ష్మి

# జిల్లాస్థాయిలోనే శిక్షణా కేంద్రాల ఆవశ్యకత

**వార్తల్లో 'అపార్డ్'**

**రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయితీరాజ్ శాఖలలో పనిచేస్తున్న సిబ్బంది, పంచాయితీరాజ్ ప్రజాప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలకు జిల్లా స్థాయిలోనే శిక్షణ అందజేయడానికి పూర్తి స్థాయి శిక్షణా కేంద్రాలని స్థాపించవల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు.**

ది. 24-09-2010 న జరిగిన అపార్డు పాలక వర్గ సమావేశంలో పాల్గొన్న ముఖ్య కార్యదర్శి శ్రీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పెరుగుతున్న శిక్షణావసరాల దృష్ట్యా, జిల్లాకొక విస్తరణ శిక్షణా కేంద్రాన్ని స్థాపించి ప్రజా ప్రతినిధులకు, సిబ్బందికి రెసిడెన్షియల్ శిక్షణ అందచేసినప్పుడే శిక్షణ ఉద్దేశ్యం నెరవేరుతుందని ఆయన అన్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అపార్డు, 5 ప్రాంతీయ విస్తరణా శిక్షణా కేంద్రాల భూముల సమగ్ర వినియోగానికి మాస్టర్ ప్రణాళికలను రూపొందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. 1954లో ఓరియంటేషన్ శిక్షణా సంస్థగా ప్రారంభమైన అపార్డు, దిన దిన ప్రవర్థమానమవుతూ నేడు 14 సెంటర్లతో సుమారు రెండు లక్షల అరవై వేల మంది ప్రజాప్రతినిధులకు, 50,000 పై బడి గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ సిబ్బందికి శిక్షణ అందచేసే స్థాయికి చేరిందని అపార్డు కమీషనరు ఫణికుమార్ పాలకవర్గ సభ్యులకు వివరించారు. సమావేశంలో పాల్గొన్న పంచాయితీ రాజ్ కమీషనర్ శ్రీమతి పూనం మాలకొండయ్య మాట్లాడుతూ, ప్రజాప్రతినిధుల సామర్థ్యాల శిక్షణాంశాలు ఖరారు చేసే సమయంలో ఆడిట్ అభ్యంతరాలు రాకుండా కార్యక్రమాలను ఎలా అమలు చేయాలి అన్న విషయాలు బోధించినట్లయితే పథక నిర్వహణ సజావుగా జరిగి, చక్కని ఫలితాలు అందుకోవటానికి అవకాశం ఉంటుందని అన్నారు.

## అపార్డు పాలక వర్గ సమావేశం

పాలక వర్గ సభ్యులు ప్రొ.కె. హనుమంతరావు, ఎన్.ఐ.ఆర్.డి. మాట్లాడుతూ, దేశంలో మంచి ప్రతిభ కనబరుస్తున్న గ్రామీణాభివృద్ధి సంస్థలలో అపార్డు ముందు వరసలో ఉందని, అయితే లక్షలాది మందికి శిక్షణ అందచేస్తున్న సమయంలో శిక్షణ నాణ్యత దెబ్బతినకుండా తగు జాగ్రత్త వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు ఆర్థిక శాఖ ప్రభుత్వ అదనపు కార్యదర్శి శ్రీ వై. రామకృష్ణ, ఎన్.ఐ.సి. సీనియర్ టెక్నికల్ డైరెక్టర్ టి. హనుమంతరావు, స్రవంతి అసోసియేషన్ ఫర్ రూరల్ & ట్రైబల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీ జి. సాయికుమార్, అపార్డులోని వివిధ కేంద్రాల అధిపతులు, జాయింట్ డైరెక్టర్ శ్రీ కృష్ణ మోహన్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీ కుమార్ రాజా పాల్గొన్నారు.



అపార్డు పాలకవర్గ సమావేశంలో
గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం

వార్తల్లో 'అపార్డ్'

# బిఆర్‌జిఎఫ్ అమలుపై 'అపార్డ్' లో సమీక్ష

**పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుధీర్‌కృష్ణ ది. 30.09.2010న అపార్డును సందర్శించారు. రాష్ట్రంలో బి.ఆర్.జి.ఎఫ్. కార్యక్రమం అమలు తీరుని పంచాయితీ రాజ్ కమీషనర్ శ్రీమతి పూనం మాలకొండయ్యతో సమీక్షించారు.**

సామర్థ్యాల పెంపుదల కార్యక్రమ అమలు తీరును అపార్డు కమీషనరు శ్రీ ఫణికుమార్‌తో చర్చించారు. గ్రామ స్థాయి ప్రణాళికల రూపకల్పనకు జిల్లా ప్రణాళికా కమిటీలను పటిష్ట పరచాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జిల్లా ప్రణాళికా అధికారి, జిల్లా టౌన్ మరియు కంట్రీ ప్లానింగు అధికారులను డి.పి.సి.ల పరిధిలోకి తీసుకొని రావాలన్నారు. కొత్తగా మరిన్ని జిల్లాలను బి.ఆర్.జి.ఎఫ్ జిల్లాలుగా ప్రకటించే అంశం ప్లానింగు కమీషను పరిధిలోని దన్నారు. సంవత్సరంలో కనీసం ఒక శిక్షణనైనా ప్రజాప్రతినిధులకు అందచేయాలని ఆయన సూచించారు. సామర్థ్యాల పెంపుదల కార్యక్రమం అమలులో ఆంధ్రప్రదేశ్ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శ ప్రాయంగా ఉందని అన్నారు. అపార్డు రూపొందించిన 13వ ఆర్థిక సంఘం - సందేహాలు సమాధానాలు పుస్తకం బాగుంది అని ప్రశంసించారు. పంచాయితీ రాజ్ హెల్ప్ లైన్ ఏర్పాటు ఒక మంచి కార్యక్రమం అని, ఇది ఏవిధంగా ఏర్పాటు చెయ్యాలో మిగిలిన రాష్ట్రాలకు కూడా తెలియచెయ్యాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో అపార్డు కన్సల్టెంట్‌లు శ్రీ సి. వెంకటేశ్వరరావు, శ్రీ శ్రీపతిరావు, అపార్డు జాయింట్ డైరెక్టర్ డా. కృష్ణమోహనరావు, బి.ఆర్.జి.ఎఫ్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ కన్సల్టెంట్ రిటైర్డు ఐ.ఎ.ఎస్. అధికారి శ్రీ డి. రామకృష్ణ పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీమతి పూనం మాలకొండయ్య, అపార్డు కమిషనర్ శ్రీ ఫణికుమార్‌లతో చర్చిస్తున్న కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుధీర్‌కృష్ణ

**యస్.ఆర్. శంకరన్ గారు గుర్తేడు కిడ్నాప్ వీణా శత్రుఘ్న ఇంట్లో కలవాలని కబురు పంపారు. అక్కడ కిడ్నాప్ గురించి చాలా వివరంగా - చిన్న చిన్న సంఘటనలతో సహా చెప్పారు. అప్పుడు ఒక వేళ తనకు ఏమైనా జరిగి ఉంటే బాలగోపాల్ తన మీద నివాళి వ్యాసం వ్రాసేవాడా? అని నన్నడిగారు. ఆ ప్రశ్నకు అప్పటికి నా దగ్గర సమాధానం లేదు. బాలగోపాల్ మీదైనా, శంకరన్ మీదైనా నివాళి వ్యాసాలు వ్రాయవలసిన అవసరం ఏర్పడడం వ్యక్తిగతంగా ఒక విషాదమే!**

అయితే అరుదైన వ్యక్తుల గురించి, అమానవీయంగా మారుతున్న సమాజంలో ముఖ్యంగా పార్లమెంటరీ రాజకీయ సంస్కృతి, విలువలు భ్రష్టుపడిపోతున్న సందర్భంలో మన మధ్యే ఏ సుఖాలు కోరకుండా అర్థవంతమైన జీవితాన్ని, ఒక రకంగా మానసికంగా ఒక పరిపక్వ జీవితాన్ని గడిపిన వారి గురించి మాట్లాడుకోకుండా ఉండటం ఎలా? అది ఆ మరణించిన వ్యక్తుల అవసరం కాదు, మనని మనం మనుషులుగా నిలుపుకోవడానికి చాలా అవసరం. శంకరన్ గారి జీవిత విశేషాలు కొన్ని మీడియాలో ప్రచురించారు. కాని ఆయన సున్నితమైన మానవీయ మనస్తత్వాన్ని అరుదైన ఆచరణను గురించి మరింత విస్తృతంగా, లోతుగా చర్చ జరపడం ఇప్పటి దిగజారుతున్న సమాజ అవసరం.



శంకరన్ గారితో పరిచయమేర్పడిన తర్వాత, ఆయన సర్వీసులో ఉన్నప్పుడు తరుచుగా కలవలేదు. అలా కలిస్తే చాలా గొప్ప అనుభవంగా ఉండేది. శంకరన్ పదవీ విరమణ తర్వాత పౌరస్పందన వేదికలో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం లభించింది. ఆ విధంగా గంటల తరబడి, రోజుల తరబడి ఆయనతో పనిచేసే క్రమంలో ఆయన సున్నితమైన మనస్సు, అతి సున్నితమైన ఆచరణను గమనించే అవకాశం నాకు వచ్చింది. అది ఒక మరవరాని, మానవీయ అనుభవం.

తత్వవేత్త రూసో మనిషి సంఘజీవి కావడంతో తన సహజ ప్రవృత్తిని కోల్పోయాడని, అతని సహజ ప్రవృత్తి మీద మానరాని గాయం ఏర్పడిందని ఒక వ్యాఖ్యానం చేశాడు. అందువలనే మనిషి సహజ ప్రవృత్తికి, అతని సామాజిక బాహ్య వర్తనకి ఇక పూడ్చలేని అంతరం ఏర్పడి మనుషుల ప్రవర్తనంటే అసహజంగా మారిపోయిందని అంటాడు.

ఇది చాలవరకు వాస్తవమైనా, ఎందుకో శంకరన్ లాంటి వాళ్ల ఈ వైరుధ్యంలో చిక్కుకోలేదేమో? మనిషి తన సహజత్వాన్ని కాపాడుకొనడానికి అవకాశాలున్నాయని, మళ్లీ మానవాళి తన సహజమైన రీతిలో జీవించే ఒక భవిష్యత్ సమాజం సుసాధ్యమే అన్న ఒక విశ్వాసాన్ని కలిగించారని అనిపిస్తుంది. ఆయనతో ఎన్నో గంటలు గడిపినా, ఎన్ని చర్చలు చేసినా ఆయన మాట్లాడేప్పుడు కాని, ఒక పనిచేసేప్పుడు కాని జాగ్రత్తలు తీసుకున్నట్లు కాని, ఆలోచనలను సెన్సార్ చేసుకుంటున్నట్లు కాని ఎక్కడ అనిపించేది కాదు. ప్రతి అంశానికి చాలా సహజంగా స్పందించేవాడు. ప్రతి స్పందనలో మానవీయ పరిమళ ముండేది. మనిషి మంచితనమ్మీద ప్రగాఢ విశ్వాసముండేది. ఎక్కడ ఏ మంచి జరిగినా తనకే ఆ మంచి జరిగిందని ఆనందపడేవాడు. ఎక్కడైనా ఏ చెడు జరిగినా చాలా సహజంగా బాధ పడేవాడు. ఆ బాధను మాటల్లో ఎక్కువ చెప్పేవాడు కాదు కాని, ఆయన ముఖకవళికలో కనిపించేది. ఆ విషయాన్ని కొనసాగిస్తే, ఒక తాత్విక ధోరణిలో స్పందించేవాడు.

ఆయన ప్రవర్తనలో అట్టడుగు వర్గాల పట్ల ఉండే 'కన్సర్న్' చాలా చాలా బలంగా, అదొక వ్యక్తిగత బాధగా తోచేది. నిరంతరం ఆ వర్గాల సమస్యల గురించి, వాటికి పరిష్కారాల గురించి, భిన్న కోణాల నుంచి ఆలోచించే వారు. ఈ మనస్తత్వం నేను చాలా సందర్భాల్లో

# బడుగుల బాంధవుడు





గమనించాను. కాని రెండు మూడు సంఘటనలు కొంత ఆశ్చర్యాన్ని కలిగించాయి.

మాటల సందర్భంలో ఒకసారి తాను ప్రభుత్వాధికారిగా గ్రామాలకు వెళ్ళి పేద కుటుంబాలను, పూటకు గడవని నిస్సహాయులైన కుటుంబాలను కలిసినప్పుడు వాళ్ల ఆకలితో ఉన్నారని తన స్వంత డబ్బులు ఇస్తూ, ఈ డబ్బులు ఏదో ఒక 'పేదల సంస్థ' తన దగ్గర పెట్టిందని, పేదల కుటుంబాలకు ఇవ్వవలసిందిగా తనకు ఆ బాధ్యత ఇచ్చారని చెప్పేవారట. అం అంతేకాక డబ్బులు ఇచ్చినట్టు ఒక తెల్లకాగితం మీద వేలి ముద్ర వేయించుకునే వాడట. అలా ఎందుకు చేశాడంటే ఆ కుటుంబానికి చేసిన చిన్న సహాయం తాను చేశానని తెలిస్తే జీవితమంతా శంకరన్‌గారు మాకు సహాయం చేశారు, అనే కృతజ్ఞతా భావం మిగులుతుందని, జీవితంలో బరువుని మోస్తున్న ఆ పేద వాళ్ళకు ఆ జ్ఞాపకం మరొక అదనపు భారమేనని అనుకున్నాడట!

ఈ అవగాహన వలన త్రిపురలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసే కాలంలో ప్రతి సబ్ కలెక్టర్ దగ్గర కొంత ఫండ్ పెట్టేలా, ఎవరైనా తమకు ఆ రోజు తిండి దొరకలేదనో, ఆకలితో ఉన్నామనో వస్తే ఏ నిబంధనల ప్రమేయం లేకుండా సబ్ కలెక్టర్ వారికి ధన సహాయం చేసేలా ఒక పద్ధతి పెట్టాడు. ఇది నేను త్రిపురలో మానవహక్కుల పరిశీలనకు వెళ్ళినపుడు మా విద్యార్థి నాగరాజ్ తన ఇంటి ముందు నిలబడిన ఒక మనిషికి డబ్బులిస్తూ, ఈ వెసులుబాటు శంకరన్ గారి హయాంలో కల్పించబడిందని చెప్పాడు. ఎదుటి మనిషి ఆకలిని ఇంత సున్నితంగా, లోతుగా ఆలోచించడం ఆయనకున్న మానవీయతా ముద్ర దృక్కోణానికి ఒక బలమైన ఉదాహరణ.

ఒకసారి ఇద్దరం కలిసి హైదరాబాద్‌లో ప్రయాణం చేస్తున్నప్పుడు ఒకటి రెండు స్థలాలను చూపించి, ఇక్కడ భోజనం 8లేదా 10 రూపాయలకే దొరుకుతుంది అని అన్నాడు. ఈ చవక భోజన ఇళ్ళ గురించి ఈయన ఎందుకింత సమాచారం సేకరించాడు అని ఆలోచిస్తే అది మాలో చాలా తక్కువ ఆదాయాలు ఉండే వాళ్ళకు పట్టణంలో తిండి ఎక్కడెక్కడ దొరుకుతుందనిన పనికట్టుకుని సమాచారం సేకరించారని పించింది.

మేం శాంతి చర్చల సందర్భంలో శ్రీశైలంలో కొంత ఆగవలసి వచ్చింది. ఎలాగు అక్కడ ఉన్నాం కదా అని గుడిలోకి వెళ్ళాం. గుళ్ళో మాకొరకు ప్రత్యేక పూజ చేశారు. బయటికి వచ్చిన తర్వాత మేం కొంత హాస్యంగానే మీకు కుటుంబం లేదు, పిల్లలు లేరు మీరు దేవుణ్ణి ఏం కోరుకున్నారు? అని అడిగితే 'నాకేముంటుంది! మా దళితులకు మరిన్ని అవకాశాలు రావాలని, వాళ్ళ జీవితాలు బాగుపడాలని కోరుకొనడం తప్ప' అన్నప్పుడు నాకు ఆశ్చర్యం వేసింది. అడివికి వెళ్ళినా, దేవాలయానికి వెళ్ళినా, పట్టణంలో తిరుగుతున్నా ఇంట్లో కూర్చుని మాట్లాడుకుంటున్నా ఆయన ధ్యాసంతా పేద వాళ్ళ మీదే. ఈ విషయాల మీద ప్రభుత్వాధికారులు సరిగా స్పందించడం లేదని వాపోయేవారు.

ఒక సందర్భంలో పంజగుట్ట ప్రాంతంలో ఎలక్ట్రిసిటీ చాలా సేపు పోయింది. మా ఇంట్లో చాలా దోమల గొడవ ప్రారంభమయింది. తోచక శంకరన్ గారికి ఫోన్ చేశాను. సార్ దోమలు చాలా ఉన్నాయి. మీరు ఎలా ఉన్నారని అడిగితే, నన్ను దోమలు కుట్టవు మీకు తెలుసా అన్నారు. నేను అది ఎలా సాధ్యం అంటే దోమలకు నేనంటే కొంచెం ఇష్టం లేదు. మూడున్నర దశాబ్దాల పాటు ఐఏఎస్‌లో పనిచేసిన మనిషిని కుట్టినా ఏం కాదు, వాళ్ళకు ఏం స్పందన ఉండదని దోమలకు కూడా తెలిసిపోయిందని సున్నితంగా, కొంచెం సెటైరికల్‌గా అన్నారు. శంకరన్‌గారు తనకు నచ్చని అంశాలను చాలా విట్టీగా చెప్పేవారు. మా మీద అలాంటి విట్టీ కామెంట్స్ చేసి నవ్వించే వారు.

అందరు మనుషులు సంతోషంగా జీవించాలని మనసారా కోరుకున్న మనిషి తన చావుతో అందరిచేత కళ్ళ నీళ్ళు పెట్టించాడు. ఒకరి మనసును బాధ పెట్టకూడదని సహజంగా నమ్మి ఆచరించిన మనిషి శంకరన్. ఆయనను తన జ్ఞాపకాలు, అనుభవాలు వ్రాయవలసిందిగా చాలా సందర్భాల్లో చాలా మంది మిత్రులు కోరారు. అక్టోబర్ 6న సాయంత్రం ఏడుగంటలకు ఆయనను కలుసుకున్నాను. ఒక గంటకంటే ఎక్కువ కూచుని చాలా విషయాల మీద మాట్లాడుకున్నాం. ఆరోజు ఒక తెల్లటి చొక్కా (ఆయన మనసులాంటిదే) వేసుకుని నా ముందు కూచున్నారు. ఆ సందర్భంలో అరుణారాయ్ మీద, వరంగల్ జాయింట్ కలెక్టర్ కరుణ గారి మీద అవసరాన్ని బట్టి మాట్లాడవలసి వచ్చింది. ఆయనకు చాలా ప్రీతి పాత్రమైన వారు చాలా మంది ఉన్నారు కాని ఆ రోజు వాళ్ళెంత మంచి వాళ్ళో అని ఆ ఇరువురి గురించి చెప్పాడు. వరంగల్‌కు వచ్చి, బాలగోపాల్ మీద 'పర్‌స్పెక్టివ్స్' ప్రచురించిన 'రాజ్యం - సంక్షేమం - బాలగోపాల్ ప్రసంగాలు' ని ఆవిష్కరించాలని ఆయనకు కోరాను. బాలగోపాల్ వ్రాసిన రచనలు 11,12 సంపుటాల దాకా ఉన్నాయ్ అని అంటే 'అమ్మ అంత వ్రాశాడా!' అన్నారు. దానికి జవాబుగా మీకు కూడా చాలా సంపన్నమైన అనుభవం ఉంది, మీరు సమాజంతో పంచుకోవలసిన అనుభవాలూ ఉన్నాయి. మీరు చెప్పే అభిప్రాయాలని, అనుభవాలని సమాజం గౌరవ పూర్వకంగా చదువుతుంది అని అంటే నవ్వి ఊరుకున్నారు. చివరికి మనకు జ్ఞాపకాలను మాత్రమే వదిలి వెళ్ళారు. ఆయనతో అనుభవాలు, ఆయన జీవితం సమాజం మీద వీచిన ఒక పరిమళమైన తూర్పుదిక్కుగా గాలిలా అనిపిస్తుంది.

**- జి. హరగోపాల్**

*('ఆంధ్రజ్యోతి' సౌజన్యంతో)*

# 20.9.2010 నాటి మంత్రివర్గ నిర్ణయాలు

సెప్టెంబర్ 20 ఉదయం 11-30 కు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. మంత్రివర్గం తీసుకున్న పలు నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీమతి (డా॥) వై. గీతారెడ్డి విలేకరులకు తెలిపారు.

మంత్రివర్గ నిర్ణయాల్లో కొన్ని ముఖ్యమైనవి.

### గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ - క్రీమిలేయర్

- వెనుకబడిన తరగతులకు చెందిన పౌరులు, వారి అంతర్గత వర్గీకరణతో సంబంధం లేకుండా క్రీమిలేయర్ వర్గంగా పరిగణించిన వారికి జిహెచ్‌యమ్‌సి ఎన్నికల్లో పోటీ చేసేందుకు రిజర్వేషన్ కల్పించే మునిసిపల్ చట్ట సవరణకు ఆమోదం.
- జిహెచ్‌యమ్‌సి 1955 చట్టంలోని కొన్ని విభాగాల ప్రకారం వెనుకబడిన తరగతుల్లోని క్రీమిలేయర్ పౌరులకు పోటీ చేసే రిజర్వేషన్ అర్హత లేదు.
- అందువల్ల ఈ మినహాయింపుతో 2009లో ఆర్డినెన్స్ జారీ చేసినప్పటికీ, శాసనసభలో బిల్లు పెట్టడానికి వీలవలేదు. అత్యవసర దృష్ట్యా తిరిగి ఈ సవరణతో ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రతిపాదించారు.

### శాసనసభ్యులకు కొత్త వసతి

- హైదరాబాద్ ఆదర్శనగర్ కొత్త శాసనసభ్యుల క్వార్టర్స్, హైదర్‌గూడ ఓల్డ్ యమ్.ఎల్.ఎ క్వార్టర్స్ వద్ద రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో 220 ఫ్లాట్ల నిర్మాణ ప్రతిపాదనల ఆమోదం.
- మొదటి దశలో నిర్మించే 110 క్వార్టర్స్ నిర్మాణం కోసం 2010-11 బడ్జెట్‌లో రూ. 10 కోట్ల అడ్మినిస్ట్రేటివ్ ............కు 16.07.2010న ఇచ్చిన జి.వో. .......................

### ఆరోగ్యశ్రీ పై మంత్రుల బృందం సిఫారసులు

- రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంతో లింక్ అయివున్న తెల్లరేషన్ కార్డుల పద్ధతిని అధ్యయనం చేసిన మంత్రుల బృందం సిఫారసుల ఆమోదం.
- లీకేజిని తగ్గించి, ప్రజల సంతృప్తిని పెంచడానికి ఒక కార్య విధానాన్ని సూచించడానికి మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు.
- ఈ బృందంలో - రోడ్లు, భవనాలు, సివిల్ సప్లై, రూరల్ డెవలప్‌మెంట్, ఆరోగ్యశ్రీ, పంచాయతీరాజ్ మంత్రులు సభ్యులు.
- సుదీర్ఘంగా, విస్తృతంగా అధ్యయనం చేసి, మంత్రుల బృందం చేసిన సిఫార్సుల్లో ముఖ్యమైనవి కొన్ని -
- ఆరోగ్యశ్రీ పథకాన్ని బిపిఎల్ కుటుంబాలకు మాత్రమే పరిమితం చేయాలి. ఎపిఎల్ కుటుంబాలకు వర్తింపు చేయరాదు.
- ఆరోగ్యశ్రీ కోసం సివిల్ ...................... చేసిన, స్వచ్ఛమయిన డేటాను అనుసరించాలి.
- ఆరోగ్యశ్రీ జాబితా నుంచి బోగస్ కార్డ్స్ / పేర్లు తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. అర్హులైన లబ్దిదారులకు ప్రయోజనాలు తిరస్కరించకుండా తనిఖీలు చేయాలి.
- యుఐడి నెంబరుతో స్మార్ట్ కార్డ్స్ త్వరలో జారీ చేస్తున్నందున, ప్రస్తుత ఆరోగ్యశ్రీ కార్డులతోనే పథకాన్ని అమలు చేయాలి.
- ఆరోగ్యశ్రీ కోసం తెలుపు కార్డు దారు ఆసుపత్రికి వస్తే, వివరాలు డేటాబేస్‌లో లేనట్టయితే కలెక్టర్ సర్టిఫికెట్‌తో చికిత్స తప్పకుండా అందించాలి.

### మావోయిస్టులపై నిషేధం పొడిగింపు

- సిపిఐ (.......), దాని ఆరు ఐక్య సంస్థలపై 16-8-2010 నుంచి మరో సంవత్సరం కాలానికి నిషేధం పొడిగించే ప్రతిపాదన ఆమోదం.

### నిషేధించిన సంస్థలు

1) సిపిఐ (.............)

### ఆరు ఐక్య సంస్థలు

1) రాడికల్ యూత్ ............ 2) 3) రాడికల్ విద్యార్థుల యూనియన్ 4) సింగరేణి కార్మిక సమైక్య 5) విప్లవ కార్మిక సమైక్య 6) ఆల్‌ఇండియా ......................... విద్యార్థుల ఫెడరేషన్

### ఖనిజాలు - జరిమానా

- అక్రమ మైనింగ్ లేదా అక్రమ రవాణా ఖనిజాలకు జరిమానాని 'ఒకసారి నుంచి ఐదు సార్లు', '2సార్లు నుంచి పది సార్లు' విధించే 1966 పద్ధతులలోని పాత పద్ధతికి .............. చేసి, అమలు చేయాలన్న ప్రతిపాదనలు ఆమోదం.
- తగ్గించిన జరిమానా విధానం వల్ల ఆశించిన ఫలితాలు రాలేదని ఇటీవల సి.యమ్. గారు నిర్వహించిన సమీక్ష సమావేశంలో తేలింది.
- అక్రమ మైనింగ్, అక్రమ రవాణా అరికట్ట లేకపోవడం వల్ల జరిమానా విధింపులో పాత పద్ధతిని పునరుద్ధరించాలని నిర్ణయించారు.
- ఈ మేరకు ఎపియమ్‌యమ్‌సి రూల్స్, 1966కు కొన్ని సవరణలు చేస్తారు.

### ఉద్యోగాలు - ఆమోదం


- ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డులో ఆరు కొత్త ఉద్యోగాలు, తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆయుర్వేదిక్ కళాశాలలో 35 బోధనా ఉద్యోగాలు, గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏడు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థలో 32, గ్రామీణ నీటి సరఫరా శాఖలో 149 ఇంజనీరింగ్ ఉద్యోగ నియామక ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదించింది.

### భూముల కేటాయింపులు

- విశాఖపట్నం తీర రక్షణ దళానికి రుషికొండ గ్రామంలో ఎకరా కోటి వంతున రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు ఆమోదం.
- కర్నూలు జిల్లా ఆస్పత్రి మండల కేంద్రంలో టి.టి.డి. కళ్యాణ మండపం నిర్మాణానికి ఎకరా రూ. 20 వేల వంతున 98 సెంట్ల భూమి కేటాయింపు ఆమోదం.
- తూర్పు గోదావరి జిల్లా అంబాజీపేట వ్యవసాయ పరపతి సంఘానికి ఐదు సెంట్ల భూమి కేటాయింపు ఆమోదం.

*- అదపాక సత్యారావు*

# సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే



**భారత దేశ చరిత్రలో 19వ శతాబ్దంలో పలు సామాజిక సమస్యలపై దండెత్తి పోరాడి దళితుల, మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పులకు దోహదపడిన సామాజిక ఉద్యమకారుడు జ్యోతీరావు పూలే (1827-1890).**


పుట్టింది మాలి సామాజిక వర్గంలోనే అయినా, పూలు అమ్మే కుటుంబంలోనే అయినా మొక్కవోని ధైర్యంతో సమాజంలోని పలు అంతరాలపై పోరాడి విజయం సాధించటమే గాక 'మహాత్మా' బిరుదుకు సార్ధకత తెచ్చిన పూలే, ఎన్నోగ్రంథాలు రచించాడు, సంస్థలు స్థాపించాడు, ఉద్యమాలు నిర్వహించాడు.

### బాల్యం - విద్యాభ్యాసం

తల్లిదండ్రులు జ్యోతి అనే పేరు పెట్టారు. జ్యోతి అంటే వెలుగు. బహుశా తల్లిదండ్రుల చైతన్యపూరిత ఆలోచనా విధానమే ఆ పేరు పెట్టటానికి కారణం అయి ఉంటుంది. పేరుకు తగ్గట్టే 'జ్యోతి రావు' చిన్న తనం నుండే చురుకైనవాడు. ఆత్మ గౌరవం పునాదిగా ఎదిగాడు. తరగతిలోని పిల్లల కంటే చాలా ముందుగా ఉండేవాడు. ఆచారం ప్రకారం 13 సంవత్సరాల వయస్సుకే 8 ఏళ్ళ సావిత్రి బాయితో పెళ్ళి జరిపించారు. పెళ్ళి తర్వాత మళ్లీ విద్యాభ్యాసాన్ని ఆంగ్ల పాఠశాలలో కొనసాగించాడు. నిరంతరం గ్రంథ పఠనం, అధ్యయనం, జ్యోతిరావు దినచర్యలైనాయి.

### స్త్రీలకు విద్యా బోధన

ఒక మిత్రుని వివాహ ఊరేగింపులో కొందరు సనాతన బ్రాహ్మణుల ద్వారా జరిగిన అవమానాన్ని జీర్ణించుకోలేక నిరంతరం సామాజికాంతరాలపై ఆలోచించే వాడు పూలే. అనేక ధార్మిక గ్రంథాలను అధ్యయనం చేశాడు. సంత్ తుకారాం, జ్ఞానేశ్వర్, మార్టిన్ లూథార్ కింగ్, భగవాన్ బుద్ధ, బసవ, మహావీరుడు మొదలైన వారి బోధనల అధ్యయనం తర్వాత, పాశ్చాత్య మేధావుల ఆలోచనలను, సామాజిక దృక్పథాన్ని అవగాహన చేసుకునే అవకాశం కలిగింది. విద్య అనేది మేధస్సును పెంచే ద్వారమని గుర్తించాడు. అజ్ఞానం వల్ల, స్వార్థం వల్ల కొందరు మొత్తం సమాజాన్ని, స్త్రీలను విద్యకు దూరంగా ఉంచారని గుర్తించాడు. తరతరాలుగా అక్షర జ్ఞానానికి దూరం చేయబడ్డ స్త్రీలకు బడిని ప్రారంభించాడు. భారత దేశంలో కేవలం బాలికల కోసమే స్థాపించబడిన మొదటి పాఠశాల అది, ఆ గౌరవం కేవలం పూలే






దంపతులకే దక్కింది.

ఆ పాఠశాలలో బోధించటానికి ఉపాధ్యాయులు కరువైనారు. అందువల్ల సావిత్రి బాయికి చదువు చెప్పించి, ఆమెనే ఉపాధ్యాయురాలుగా నియమించాడు. ఆ విధంగా ప్రథమ భారత మహిళా టీచర్‌గా సావిత్రి పూలేను చెప్పుకోవాలి. దళితలకు తమ మంచినీటి బావిలో నీళ్ళు తీసుకువెళ్ళే అవకాశం కలిగించారు. 1848లో జగన్నాథ్ సదాశివజీ, బల్లాడ గోవిదడే మొదలైన బ్రాహ్మణ మిత్రుల సాయంతో బుధవార్ పేటలో శూద్రులకు పాఠశాల ప్రారంభించాడు. 1851లో దాన్ని పూర్తి స్థాయి విద్యా సంస్థగా స్థాపించారు. ఆయన సేవలకు గానూ 1852లో బోర్డ్ ఆఫ్ లండన్ డైరెక్టర్స్ సత్కరించారు. హంటర్ మిషన్ భారత దేశంలో పర్యటిస్తున్న సమయంలో విద్యా సంబంధిత అంశాలపై అధ్యయనం చేయటానికి జ్యోతిరావు పత్రికల్లో వ్రాసిన వ్యాసాలు ఉపకరించాయి. తత్ఫలితంగా 1880లో 10 సంవత్సరాల వయస్సు పిల్లలందరికీ ఉచిత విద్యను ప్రకటించారు.

లార్డ్ రిప్పన్ స్త్రీ సమస్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని బాల్య వివాహాలు, వితంతు సమస్యలపై ప్రత్యక్షంగా వివరించాడు పూలే. కార్మిక సమస్యలపై బ్రిటిష్ ప్రభుత్వానికి అర్జీలు సమర్పించాడు. వ్యవసాయంపై శాస్త్రీయ పద్ధతులపై శిక్షణ ఇచ్చాడు. 200 ఎకరాల భూమి లీజుకు తీసుకుని అధునాతన పద్ధతుల్ని అవలంబించి పండించాడు. రైతు సమస్యలపై బహిరంగ సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వానికి రిపోర్టులు పంపాడు.

## పురపాలక సంస్థ కౌన్సిలర్

మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్న కాలంలో బడ్జెట్ ప్రపోజల్స్ చదివి అందులోని ప్రాధాన్యాంశాలను, మార్పులను సూచించేవాడు. మద్యం మత్తు పదార్థాలు ప్రజల్ని తెలిసి హీనులుగా మార్చుతాయని చెప్పాడు. కుటుంబాలను విచ్ఛిన్నం చేసే అటువంటి దురలవాట్లను మానుకోవాలని పిలుపునిచ్చాడు. కవిగా, రచయితగా పూలే ఎన్నో సందేశాత్మక పాటలు, గేయాలు, గ్రంథాలు, వ్యాసాలు రాశాడు. వాటిలో ''సేద్యగాని చెర్నాకోల' 'గులాంగిరి', 'తృతీయరత్న' (నాటిక) మొదలైనవి ఎంతో ప్రాముఖ్యాన్ని పొందాయి.

## సత్యశోధక్ సమాజ్ - పూలే దార్శనికత

సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించి, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, మానవీయ సంబంధాలను, కుంటి, గుడ్డి వికలాంగుల సేవా, శూద్ర పిల్లల విద్యాభివృద్ధికై పాఠశాలలు, స్కాలర్‌షిప్పులు ఇవ్వటం ద్వారా వారి అభివృద్ధికి కృషి చేయటం ప్రారంభించారు. బరోడారాజు సాయంతో విద్యా సంస్థల్ని పరిపుష్టం చేశాడు. 1888లో విక్టోరియా రాణి పుత్రుడు భారతదేశాన్ని సందర్శించినప్పుడు జరిగిన సభకు గ్రామీణ వేషంలో హాజరైన పూలే, ఆంగ్లంలో అనర్గళంగా ఉపన్యసించి ''అయ్యా నేను ఈ వేషంలో ఎందుకు వచ్చానంటే మా గ్రామీణ రైతులు ఎలా ఉంటారో మీకు తెలియచెప్పటానికే, వారికి తిండి లేదు, కట్టుకునేందుకు బట్టలేదు, మీరు ఇంగ్లాండ్ వెళ్ళి మీ అమ్మగారికి మా పరిస్థితులు వివరించండి, మమ్ములని కాపాడమనండి, ఈ సభలో ఉన్న వారిని చూచి అదే భారత దేశం అనుకోకండి. వీళ్ళు పేదల, రైతుల ప్రతినిధులు కారు, నిజమైన దేశం గ్రామాల్లో ఉంది, అక్కడ చూడండి అని చెప్పాడు. పూలే లోని దార్శనికతకు 'మహాత్మ' అనే బిరుదును మహరాజ్ శాయజీరావు సమక్షంలో తేది17-5-1888లో ఇచ్చారు.

## ముగింపు

జ్యోతీరావు పూలే మహా రాష్ట్రలోని సామాజిక అంతరాలపైనే కాకుండా వ్యవసాయం, కార్మికులు, పారిశ్రామిక కార్మికుల సమస్యలపైనా మహిళాభ్యుదయంపైనా, అస్పృశ్యులకూ, మహిళా విద్యాభివృద్ధికీ కృషి చేశారు. ప్రజలలో బహుళ ప్రచారంలో ఉన్న గేయాల్ని, ప్రక్రియల్ని తీసుకుని చేసిన రచనల ద్వారా భావ విప్లవం తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. చరిత్రను కొత్త కోణం నుండి పరిశీలించి వాఖ్యానించాడు. పెళ్ళి మొదలైన శుభకార్యాలకు, కర్మకాండలకు వ్యయం, అట్టహాసం లేకుండా శ్రామిక సంస్కృతిని ప్రతిబింబించే ప్రక్రియల్ని ప్రవేశ పెట్టటం వంటివి ఎంతో ముందు చూపుతో చేపట్టిన చర్యలు. సమాజం కోసం జీవించి, సమాజం కోసమే సర్వస్వాన్ని ధారపోసిన మహాత్మా జ్యోతిరావు పూలే తన 63వ ఏట 1890 నవంబర్ 26న మహా పరినిర్వాణం చెందాడు.

*- అలవాల గవర్రాజు*

ఫ్యాకల్టీ, ఇ.టి.సి., రాజేంద్రనగర్

# మహనీయుల చతురోక్తులు

*- పోలాప్రగడ సత్యనారాయణమూర్తి*

## భమిడిపాటి వారి తఢాఖా

**శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు గారు, ఎంత నవ్విస్తూ వుండేవారో, అంత సీరియస్‌గా వుండేవారు, ఆయన మాటలు వింటే నవ్వు వచ్చేది. కాని ఆయనంటే అందరికీ గౌరవం, భయం వుండేవి.**

ఓ మారు ఏమైందంటే -

మేం కాలేజీ విద్యార్థులుగా వున్నప్పుడు ఆచారం ప్రకారం భమిడిపాటి వారి కొత్త నాటకం తీసుకుని ప్రాక్టీసు ప్రారంభించాం. రాత్రి రిహార్సల్స్ చూడ్డానికి పది పదిహేనుమంది విద్యార్థులు వచ్చి కూర్చునేవారు. కాని వాళ్ళ దగ్గర లైటు వుండేది కాదు. ఉన్న ఒక్క బల్బూ మినుకూ మినుకూ మంటూ రిహార్సల్స్ జరిగే స్టేజీ మీదే వుండేది. రిహార్సల్స్ జరుగుతున్నాయి. నేను ప్రామ్‌టింగ్ చెబుతున్నాను. ఉన్నట్టుండి చూస్తూన్న జనం వెనక నుండి 'ఆగండి' అని గొంతు వినిపించింది. చూస్తే, కామేశ్వరరావు మేష్టారు! మఫ్లర్ తలకి చుట్టుకుని రిహార్సల్స్ చూడ్డానికి వచ్చినట్టున్నారు.

''యఁాక్టరు అన్నదేమిటి?'' అని అడిగారు.

"రా రా నా శక్తి చూపిస్తా" అన్నాడు యాక్టరు. "ఒరేయ్ పోలా ప్రగడ! స్క్రిప్ట్‌లో ఏవుందో చదువు" అన్నారు.

"రా రా నా తడాఖా చూపిస్తా" అని ఉంది. అది చదివి, "తడాఖాకి బదులు శక్తి అన్నాడండి. ఇందులో ఏంపోయింది?" అన్నాను.

వెంటనే ఆయన కోపంగా ''ఏం పోయిందా? నాటకంలో పట్టుపోయింది. బలం పోయింది. రక్తి పోయింది. అన్నింటికంటే రచయిత మీద గౌరవం పోయింది'' అన్నారు. అంతే - ఆ తర్వాత ఆయన నాటకం ఎప్పుడు వేసినా ఒక్క పొల్లుపోతే ఒట్టు. అక్షరం తేడా రానివ్వలేదు మేం. ☆

## అర్ధవంతమైన అచ్చుతప్పు

**ఓ మారు, మధునాపంతుల వారికి, ఆయన వ్రాసిన 'ఆంధ్ర పురాణం' కారణంగా కోలంకలో భారీ ఎత్తున సన్మానం జరిగింది. ఆ సభకి భమిడిపాటి వారు హాజరు కావలసిందే- కాని ఆయన షష్టిపూర్తి ఉత్సవం దగ్గర్లో వుండడం వల్ల ఆయన రారు అని ముందే రూఢి అయిపోయింది.**

జమ్మలమడక, వేదులవంటి హేమాహేమీల ఉపన్యాసాలు అయిపోయాయి. సభకు అధ్యక్షత వహించిన శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు గారు తమ మలి పలుకుల్లో "భమిడిపాటివారు కూడా వస్తే బాగుండి వుండేది" అన్నారు.

సభ్యుల వెనకాల జనం మధ్య నుంచుని భమిడిపాటి వారు "నేను వచ్చాను" అన్నారు. సభ సంభ్రమాశ్చర్యాలతో నిండిపోయింది. వేదిక మీదకి రమ్మనీ, ఏదైనా మాట్లాడమనీ అంతా వత్తిడి చేశారు. బెట్టుగా వేదిక మీదకి వచ్చి సీరియస్‌గా ముఖం పెట్టి "అందరూ అద్భుతంగా మాట్లాడారు. అయితే, ఆహ్వానపత్రంలో అచ్చుతప్పు పడింది. అంతా దిద్దుకోండి. ఆయన ఇంటిపేరు 'మధునాపంతు' కాదు 'మధు నా వంతు, ఇదీ విషయం- శలవు" అని కూర్చున్నారు. సభా ప్రాంగణం చప్పట్లతో మారు మ్రోగిపోయింది.

## శయ్యా వై యాత్యం

**దశాబ్దం క్రితం షష్టిపూర్తి చేసుకొని రచనా వ్యాసంగం కొనసాగిస్తూ రాజమండ్రిలో తను అపురూపంగా 'ఆరామ కామేశ్వరి' అని నామకరణం చేసుకొన్న స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న కళాప్రపూర్ణ శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి బుద్ధి నైశిత్యం, భావనా పటిమ, ఆవంతైనా జంకలేదు కాని, శరీర ధారుఢ్యం మాత్రం సన్నగిల్లింది. మరీ అవసరం అయితే తప్ప, ఎక్కువ కాలం మంచం మీద కాలక్షేపం చేస్తున్నారు - కూర్చున్నా, పడుకున్నా.**

1992 జూన్ 4వ తేదీన ఒకమారు ఆయన్ని చూసి వద్దామని వెళ్ళాను. కబుర్లలో ఎందరో ఆధునిక కవుల ప్రస్తావన వచ్చింది. ఫలానావారి పద లాలిత్యం బాగుంటుందంటే, ఫలనా కవి చమత్కృతి అందంగా వుంటుంది. వీరి భావ గాంభీర్యం మెచ్చుకోదగ్గది. అయితే, వారి మాటల పొందిక ముచ్చటైంది - ఇలా సాగింది మా సంభాషణ.

తర్వాత శైలి, శయ్య గురించి మాట్లాడుతూ, "శాస్త్రి గారూ! శబ్దార్థాల్ని సమతూకంలో నడుపుతూ కవిత్వంలో మీరు అనుసరించే శయ్య మాత్రం, ఎంతో మృదువుగా వుంటుందండి" అన్నాను.

ఆయన వెంటనే నవ్వి, "ఆ శయ్య మాట ఎలా వున్నా, ఇప్పుడీ శయ్య మాత్రం నాకు మృదువుగా లేదు. గంటల తరబడి పడుకునే సరికి" అన్నారు తను పడుకున్న మంచాన్నీ, పరుపునీ చూపిస్తూ. ☆

## ఏ పన్నూ లేని సాహితీ సంపన్నులు

**ఆంధ్ర పురాణాది ఎన్నో ఉత్తమ కావ్యాల్ని రచించి, ఆంధ్ర పత్రికని నిర్వహించి, సాహిత్య గౌతమి, తరుణ సాహితి వంటి సాహిత్య సంస్థలకి సారథ్యం వహించి సమకాలీన కవీశ్వరులలో, ముఖ్యంగా పండిత కవుల్లో లబ్ధ ప్రతిష్ఠులైన కళా ప్రపూర్ణ శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారిని ఒకసారి రాజమండ్రిలో ఆయన స్వగృహంలో కలుసుకోవడం తటస్థించింది.**

గౌతమీ విద్యా పీఠానికి అతి సమీపంలోని ఆయన ఇల్లు వున్న వీధికి, రాజమండ్రి పురపాలక సంఘం వారు, ఆయన పట్ల తమకు గల గౌరవ మర్యాదలకీ సూచకంగా, 'మధునాపంతుల సత్య నారాయణశాస్త్రి వీధి' అని పెద్ద ఎనామిల్ బోర్డు వేసి నామకరణం చేశారు.

"బాగుందండీ. ఈ వీధికి మీ పేరు పెట్టారు" అన్నా. దానికి ఆయన ఒక చిరునవ్వు మాత్రం నవ్వి ఊరుకున్నారు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది. నాకు కొన్ని దశాబ్దాల క్రితం సంగతి. అప్పుడు ఆస్థాన కవి, కవి సార్వభౌమ శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు మెయిన్ రోడ్డుమీద ఉల్లితోట వీధి మొదట్లో వుండేవారు. అప్పటి పురపాలక సంఘం వారు ఆ వీధికి ఆయన పేరు పెడతానంటే, "వద్దయ్యా! పేరెందుకు? దండగ. తీసేస్తే నా యింటికి పన్ను తీసేయండి. అప్పుడు లోకమంతా 'కృష్ణమూర్తి శాస్త్రిగారికి ఒక్క పన్నూ లేదు' అని అర్థవంతంగా చెప్పుకుంటారు" అంటూ తన నోట్లోని కట్టుడు పళ్ళు తీసేసి, ఒక్క పన్నూ లేని తన బోసి నోటితో పకపకా నవ్వారు.

☆

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవాభివృద్ధి సమస్యలు, సవాళ్ళు

ఏదైన ఒక దేశం కాని, రాష్ట్రం కాని, ప్రాంతం కాని అభివృద్ధి చెందినదా లేదా అనే విషయాన్ని తెల్సుకోవటానికి కొలమానంగా కొన్ని అభివృద్ధి సూచీలను ఉపయోగిస్తారు. నిజానికి అభివృద్ధిని సూచించే కొలమాన సూచీ ఏవైతే బాగుంటుంది అనే అంశంపై చాలా చర్చ జరిగింది. అనాగరిక సమాజం నుండి నాగరిక సమాజానికి ఎదిగే క్రమంలో మానవుడి జీవన విధానంలో (వేషభాషల్లో, ఉత్పత్తి ప్రక్రియలో, ఆర్థిక వనరులు సమకూర్చుకోవటంలో) చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. పురాతన కాలం నాటి నాగరిక మానవుడితో పోల్చి చూస్తే నేటి నాగరిక మానవుడి జీవన విధానం ఇంకెంతో మెరుగైనది. దీనిని అభివృద్ధి ప్రక్రియగా వర్ణిస్తారు ఆర్థిక, సామాజిక శాస్త్రవేత్తలు.



## మానవాభివృద్ధి

ఈ అభివృద్ధి ప్రక్రియలో వచ్చిన మార్పులలో ముఖ్యమైనవి: ఆధునికీకరణ, నగరీకరణ, పారిశ్రామికీకరణ, మెరుగైన ఉత్పత్తి పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, విద్యావకాశాలు, వ్యాపార రంగాలవృద్ధి, రవాణా సౌకర్యాలు, రాజకీయ వ్యవస్థలలో మార్పులు (ప్రజాస్వామ్య వ్యవస్థ, సంక్షేమ ప్రభుత్వాల ఏర్పాటు) మొదలైనవి. కానీ ఇక్కడ మనం గమనించవలసినది ఏమంటే, ఈ అభివృద్ధి ప్రక్రియ అన్ని మానవ సమాజాలలో ఒకేరకంగా లేదు. ఈ అభివృద్ధి ప్రక్రియ, అభివృద్ధి స్థాయి వివిధ మానవ సంఘాలలో, సమూహాలలో, సమాజాలలో, అలాగే వివిధ రాజ్యాలలో, ఆర్థిక వ్యవస్థలలో వివిధ రకాలుగా వుంటూ వస్తున్నది. మొదట, రెండవ ప్రపంచ యుద్ధాల మధ్య కాలం వరకు అందరు అంగీకరించదగిన ఒక పక్కా కొలమానం అభివృద్ధిని కొలిచేందుకు ఉత్పన్నం అవలేదు.

కాని పైన చెప్పిన అభివృద్ధి ప్రక్రియలోని అంశాలలోని మార్పుల ఆధారంగా అభివృద్ధిని సూచాయగా సూచించేవారు. ఈ రెండు ప్రపంచ యుద్ధాల వలన ఆర్థిక, సామాజిక రాజకీయ వ్యవస్థలలో పెను మార్పులు సంభవించాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ పేరెన్నికగన్న ఆర్థికవేత్తలు కలసి అభివృద్ధిని కొలిచేందుకు ఒక ఆర్థిక కొలమానాన్ని సూచించారు. అదే తలసరి ఆదాయం (Per Capita Income - PCI), దానిలోని వృద్ధి (Growth) లేదా పెరుగుదల శాతం. ఒకే దేశ/రాష్ట్ర తలసరి ఆదాయం అనేది ఆ దేశంలో/రాష్ట్రంలో ఒక సంవత్సర కాలంలో తయారైన వస్తుసేవల (Good and Services) విలువను (Value) ఆ దేశ/రాష్ట్ర మొత్తం జనాభాతో భాగించగా తెలుస్తుంది. ప్రపంచంలోని వివిధ దేశాల/ప్రాంతాల (Regions) అభివృద్ధిని కొలవటం కాని, ఒక దేశ/ప్రాంత అభివృద్ధిని ఇంకొక దేశ/ప్రాంత అభివృద్ధితో పోల్చి చూచేటప్పుడు, ప్రతి దేశం యొక్క తలసరి ఆదాయాన్ని ఆ దేశ కరెన్సీ (Currency)కి డాలర్ (Dollar)కి ఉన్న మారకపు విలువ (Exchange Value) ఆధారంగా, ప్రతి దేశ తలసరి ఆదాయాన్ని డాలర్‌లోకి మార్చి చూస్తారు. దీనికి ఉన్న అనుబంధ ప్రమేయం ఏమంటే, ఒక దేశ తలసరి ఆదాయంలోని పెరుగుదల ఆ దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచుతుంది. ఈ కొనుగోలు శక్తిలోని పెరుగుదల ద్వారా ఆ దేశ ప్రజల సంక్షేమం మెరుగుపడుతుంది. అభివృద్ధి ప్రధాన ఉద్దేశ్యం ప్రజా సంక్షేమం, కాబట్టి, ఈ తలసరి ఆదాయం అనేది అభివృద్ధికి కొలమానం అనేది ఆర్థికవేత్తల అభిప్రాయం. ఈ కొలమానం 1980వ దశకం వరకు ప్రాచుర్యంలో ఉంది.

కానీ రెండవ ప్రపంచ యుద్ధం నుండి 1980వ దశకం (1980) వరకు ఆర్థిక సామాజిక శాస్త్రాలలో జరిగిన అధ్యయనాల ఫలితాలు, విశ్లేషణా పద్ధతులలో వచ్చిన మార్పులు, తలసరి ఆదాయం అనేది

ఒక ఆర్థికపరమైన కొలమానం, ఇది ప్రజల సంక్షేమాన్ని పూర్తి స్థాయిలో సూచించలేదు అనే విషయాన్ని వెలుగులోకి తీసుకొని వచ్చాయి. ఎందుకంటే ఆదాయ అసమానతల కారణంగా పెరిగిన దేశ / రాష్ట్ర తలసరి ఆదాయం ఆ దేశం/రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగినట్లు సూచించలేదు. ఒక దేశ/రాష్ట్ర తలసరి ఆదాయం పెరిగినా కాని ఆ దేశం/రాష్ట్రంలోని కొంతమంది ప్రజల ఆదాయాలు తగ్గే అవకాశం ఉంది కాబట్టి ఈ కొంతమంది ప్రజల సంక్షేమం నిజానికి తగ్గినట్లే. అలాగే తలసరి ఆదాయాలు పెరుగుతున్న దేశాల / రాష్ట్రాలలో కనీస అవసరాలు సమకూర్చుకోలేనటు వంటి కొంతమంది పేద ప్రజలు కూడ ఉన్నారు. అలాంటప్పుడు ఇది అభివృద్ధి అని చెప్పలేము అనేది ఒక అభిప్రాయం. ఇలా ఆదాయ పంపిణీలో అసమానతలు, పేదరికం మరియు నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం లాంటివి కలిసి జీవిత భద్రత లేకపోవడం, ఇలాంటి అంశాలు ఆర్థిక, సామాజిక వేత్తలను తలసరి ఆదాయానికి బదులుగా మానవాభివృద్ధిని అభివృద్ధికి కొలమానంగా సూచించే విధంగా చేసాయి.

మానవాభివృద్ధిని ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ మాటలలో చెప్పాలంటే, ప్రతి మనిషి ఎలాంటి జీవితాన్ని సాగించాలని కోరుకుంటాడో అలాంటి జీవితాన్ని కొనసాగించటానికి కావలసిన శక్తియుక్తులను వారు సముపార్జించుకొనటమే మానవాభివృద్ధి. ఇదే నిజమైన అభివృద్ధి. మానవాభివృద్ధి అనేది అభివృద్ధిని సూచించేటప్పుడు, ఆదాయంతో పాటు, పేదరికం, అక్షరాస్యత, విద్య, ఆహార, ఉద్యోగ, ఆరోగ్య భద్రతలు. అంతేకాక, వీటన్నింటిలోని అసమానతలను పరిగణనలోనికి తీసుకుంటుంది. ఈ అంశాలు ప్రతి మనిషి తన కోరుకునే జీవితాన్ని కొనసాగించటానికి కావలసిన శక్తియుక్తులను వారు సముపార్జించుకొనటానికి తోడ్పడతాయి.

## మానవాభివృద్ధి నివేదికలు

మానవాభివృద్ధిని అభివృద్ధికి కొలమానంగా సూచిన్నా మానవాభివృద్ధి నివేదికలు వెలువడ్డాయి. అయితే, మొట్టమొదటిసారిగా అంతర్జాతీయ స్థాయిలో ఒక మానవాభివృద్ధి నివేదికను ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP) తయారుచేసి 1990లో వెల్లడించింది. దీనికి ఆద్యుడు ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమంలో పనిచేసిన ప్రముఖ ఆర్థికవేత్త మహబూబ్ ఉల్ హక్. ఆ తరువాత అంటే 1990 నుండి మొదలు ఇప్పటివరకు ప్రతి సంవత్సరం ఒక వార్షిక మానవాభివృద్ధి నివేదికను ఈ సంస్థ విడుదల చేస్తూ వస్తుంది. ఈ మానవాభివృద్ధి నివేదికలో అభివృద్ధికి కొలమానంగా ఒక సంకలన (Composite Index) మానవాభివృద్ధి సూచీని తయారుచేసి ప్రచురించింది.

నిజానికి మానవాభివృద్ధి అనేది ఒక సంక్లిష్టమైన అభివృద్ధి సూచి. కాని ఈ ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం మానవాభివృద్ధిలోని అంశాలకి సంబంధించిన సంక్లిష్టతను తగ్గిస్తూ, మానవాభివృద్ధికి సంభవించిన మూడు ప్రధాన అంశాలను పరిగణనలోనికి తీసుకుంది. అవి వనరుల మీద అధిపత్యం (Command over Resources), జ్ఞాన సముపార్జన (Knowledge), ఆరోగ్యం, ముఖ్యంగా జీవన ప్రమాణ కాలం (Longevity). వీటిలో వనుల మీద ఆధిపత్యం అనే అంశం ఆదాయాన్ని, తద్వారా కొనుగోలు శక్తిని సూచిస్తుంది. జ్ఞాన సముపార్జనకు సంబంధించి, అక్షరాస్యత, విద్యావకాశాలు లేదా విద్యా స్థాయి ముఖ్యమైన అంశాలు.

అలాగే ఆరోగ్యానికి సంబంధించి మానవుని సగటు ఆయుః ప్రమాణకాలం, (శిశు) మరణాల రేటు (Mortality Rate), చిన్న పిల్లల్లో పౌష్టికాహార లోపం (Malnutrition), రోగరహిత (Disease free) మరియు అంగవైకల్యరహిత (Disability free) జీవితం ముఖ్యమైనవి. అయితే ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం యొక్క మానవాభివృద్ధి నివేదికలోని సంకలన మానవాభివృద్ధి సూచీ నిర్మాణం కొరకు మానవాభివృద్ధికి సంబంధించిన మూడు ప్రధాన అంశాల నుండి తలసరి ఆదాయం (Per Capita Income), అక్షరాస్యత మరియు విద్యాసంస్థలలో నమోదైన విద్యార్థుల శాతం (Literacy and Enrolment), అలాగే పురిటి బిడ్డల సగటు ఆయుః ప్రమాణ కాలం (Expected Life at Birth) లాంటి సూచికల (Indicators) విలువలను (Values) వినియోగించారు. ఈ సూచికలకు సంబంధించిన సమాచారాన్ని, వాటి విలువలను ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం తన సభ్య దేశాలన్నిటి నుండి తెప్పించుకొని ఆ దేశాలన్నింటికీ సంకలన మానవాభివృద్ధి సూచీని తయారుచేస్తుంది. ఈ మానవాభివృద్ధి సూచీ ప్రకారం ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలలో భారతదేశం





పోల్చిచూస్తే 1990వ దశకంలో రాష్ట్ర మానవాభివృద్ధి సూచీ పెరిగినది. అయితే మిగతా రాష్ట్రాలతో ముఖ్యంగా 15 పెద్ద రాష్ట్రాలతో పోల్చి చూస్తే మన రాష్ట్ర మానవాభివృద్ధి సూచీ పురోగతి తక్కువగా వుంది. ఈ 15 పెద్ద రాష్ట్రాల మానవాభివృద్ధి సూచీని బట్టి చూస్తే (ఎక్కువ నుంచి తక్కువ సూచీ క్రమంలో), ఆంధ్రప్రదేశ్ 1981 లోనూ, 1991లోనూ 9వ స్థానంలో ఉండగా, 2001లో 10వ స్థానానికి దిగజారింది. ఇంకొక రకంగా చెప్పాలంటే, మానవాభివృద్ధిలో బాగా వెనుకబడి వున్న నాలుగు రాష్ట్రాల గ్రూపులో భాగం అయిన రాజస్థాన్ రాష్ట్రం కంటే ఆంధ్రప్రదేశ్ 2001లో వెనుకబడినట్లు కనబడుతుంది. మన సహచర దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడులతో పోల్చి చూస్తే మానవాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ చాలా వెనుకబడి వున్నది.

## ఆంధ్రప్రదేశ్ మానవాభివృద్ధి నివేదిక

ముందుగా చెప్పిన విధంగా ఈ నివేదికలో మానవాభివృద్ధికి సంబంధించిన అంశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పనితీరు, పురోగతి, సమస్యలు మరియు సవాళ్ళపై అధ్యయనం చేసి, విశ్లేషణ చేయటం జరిగింది. అలాగే, ఈ నివేదికలో రాష్ట్రంలోనే 23 జిల్లాలకు మానవాభివృద్ధి సూచీలను తయారుచేసి, సూచీల ప్రకారం జిల్లా పనితీరును అధ్యయనం చేయటం జరిగింది.

*- మోత్కూరి వెంకటనారాయణ*
ఎన్.సి.ఆర్.ఐ, హైదరాబాద్

ఇప్పటివరకు 120 లేదా ఆపైన స్థానాన్ని సంపాదించినది. ఇది మానవాభివృద్ధి సూచీలో భారతదేశ వెనుకబాటుతనాన్ని సూచిస్తుంది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం మానవాభివృద్ధి నివేదికలో మానవాభివృద్ధి సూచితో పాటు మానవాభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధ్యయన విశ్లేషణ కూడ వుంటుంది.

ఇలా అభివృద్ధి ప్రక్రియలో మానవాభివృద్ధి ప్రాముఖ్యత పెరగడంతో ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం ప్రతి దేశాన్ని ఆ దేశానికి సంబంధించి జాతీయ స్థాయిలో మానవభివృద్ధి నివేదికలను తయారు చేయమని ప్రోత్సహిస్తుంది. ఈ జాతీయ మానవాభివృద్ధి నివేదికలలో దేశంలోని వివిధ రాష్ట్రాల లేదా ప్రాంతాలకు సంబంధించిన మానవాభివృద్ధి సూచీతో పాటు మానవాభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధ్యయన విశ్లేషణ ఉంటుంది.

## భారతదేశ జాతీయ మానవాభివృద్ధి నివేదిక : ఆంధ్రప్రదేశ్ పనితీరు

ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి సూచిలో వచ్చిన మార్పులను గమనించి, భారత ప్రణాళికా సంఘం వారు, భారతదేశానికి సంబంధించిన మానవాభివృద్ధి నివేదికను 2002లో ప్రచురించారు. ఈ నివేదికలో, దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత మానవాభివృద్ధి సూచీలను తయారు చేసి, సూచీల ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పనితీరును అధ్యయనం చేయటం జరిగినది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విషయానికి వస్తే, భారతదేశ జాతీయ మానవాభివృద్ధి నివేదిక ప్రకారం మన రాష్ట్రంలో మానవాభివృద్ధికి సంబంధించి పురోగతి వున్నది. 1980వ దశకంతో



# మానవతా ప్రబోధకుడు
## బసవేశ్వరుడు

*'దయలేని ధర్మమ దెట్టి దయ్యా ?*
*దయయే వలయు సకల ప్రాణులకును*
*దయమే ధర్మపు మూలమయ్యా*
*కూడల సంగయ్య అటుగాని దొల్లడయ్యా'*

అంటూ అన్ని మతాలూ దయాగుణాన్ని బోధించాలని చాటి చెప్పిన వాడు బసవేశ్వరుడు.



బసవేశ్వరుడు కర్ణాటక రాష్ట్రమందలి బిజాపుర జిల్లా ఇంగళేశ్వర బాగేవాడిలో, మాదలాంబిక, మాదరస అన్న బ్రాహ్మణ దంపతుల సంతానంగా 1132లో జన్మించాడు. కృష్ణా, మలప్రభ నదుల సంగమ స్థానమందున కూడల సంగమేశ్వర క్షేత్రంలో విద్యాభ్యాసం సాగింది. సకల శాస్త్రపారంగడుడైన, జాతవేదస్వామి అతని గురువు.

బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన బసవన్న సోదరి అయిన నాగమ్మ ఇంట పెరిగాడు. నాగమ్మ శివభక్తుడైన చెన్న బసవేశ్వరుని తల్లి.

బసవేశ్వరుడు ప్రజ్ఞాపాటవాలను గ్రహించిన కళ్యాణ సంస్థానాధిపతి బిజ్జలుడు అతనిని ప్రధాన మంత్రిగా నియమించాడు.

బసవన్నలో తీవ్రమైన భక్తిభావన, సంస్కారణాభిలాషలు బాగా పెరిగాయి. భక్తి బండారి బసవేశ్వరుడు. బ్రాహ్మణుడు మొదలు అంత్యజుల వరకు శివభక్తులైన వారందరూ సమానులేనన్నాడు. సత్కార్యాలు చేసి పరమశివుని కృపకు పాత్రులు కాగలరన్నాడు. కూడల సంగయ్యన శరణరేకులజరు, కూడల సంగమేశ్వరుని భక్తులే కులీను అన్నాడు.

బసవన్న బిజ్జలుని బండారిగా మాత్రమే కాక తనకిష్టదైవమైన పరమశివుని బండారిగాను వుండేవాడు. కులాల మధ్య హెచ్చుతగ్గులు తొలగించాలని, భక్తి ప్రధానమైన 'అనుభవ మంటప' అన్న సంస్థను స్థాపించాడు. అన్ని కులాల వారిని అందులో చేర్చుకున్నాడు. "పరవని తెయను మహాదేవియెంబె" అంటూ స్త్రీల పట్ల గౌరవంతో అనుభవ మంటపంలో చేర్చుకొన్నాడు.

అగ్రవర్ణానికి చెందిన మధువయ్య కూడా అనుభవ మంటపంలో సభ్యుడైనాడు. తన కుమార్తెను అంత్యజుడైన హరళయ్య కుమారునకిచ్చి వివాహం జరిపించాడు.

అన్ని వృత్తుల వారికి అనుభవ మంటపంలో ప్రవేశం కల్పించాడు. సంప్రదాయవాదులు బసవేశ్వరుని ద్వేషింపసాగినారు. బిజ్జలునికి బసవన్న పద్ధతులు నచ్చలేదు. అమాత్య పదవిని వదలుకొని కూడల సంగమేశ్వరం చేరాడు.

మానవ స్వభావాన్ని దేశ స్థితిగతులను లోతుగా పరిశీలించిన బసవన్న 'కాయకటె కైలాస' - పనియే దైవమన్నాడు. ప్రతి వ్యక్తి కష్టపడి పనిచేయాలని ఉద్బోధించాడు.

సోక్రటీస్, కన్‌ఫ్యూషియస్, క్రీస్తు, బుద్ధ భగవానుడు మొదలగు మహాత్ములు చాటిన పరమ సత్యాన్నే మానవాళికి మరల వినిపింప చేసిన వీరశైవోద్ధారకుడు బసవేశ్వరుడు. సార్వజనీనాలు, సార్వకాలికలైన సత్యాలను వచనాలలో చెప్పించాడు. బసవన్న స్వయంగా సంగీతజ్ఞుడు. అతని అనుయాయులైన అల్లమాప్రభు, వీరయోగిని అక్క మహాదేవి గార్లు కూడా వేలాది వచనాలు రాశారు.

బసవేశ్వరుడు కన్నడం వాడైనను తెలుగు వారి మన్ననలందుకొన్నాడు. బసవేశ్వరుని చరిత్రను తెలుగులో పాలకుర్తి సోమనాథకవి 'బసవ పురాణము'గా రచించాడు.

దాదాపు 8 వందల సంవత్సరాలకు పూర్వమే బసవేశ్వరుడు ప్రతిపాదించిన పారమార్థిక ధార్మిక నైతిక, సాంఘిక ధర్మాలు, ఈనాటికీ శరణ్యమై వున్నాయి. ఆ మహాపురుషుని బోధనలే, గాంధీజీ జీవితంలో ప్రతిధ్వనించాయి.

బసవన వచనాలలోని కొన్నింటిని చదువయనవి -

# ఉగ్రవాదం

**ఉ**గ్రవాదం ఉగ్రరూపం
ఉసురుపోసే ఉపకారికైనన్
ముష్కరుల మా'రణ' కాండ
సంఘాత మ'రణం' సజ్జనసైతం

లయమాయె తాజ్ హోటల్ హోయలు
లష్కరే ముష్కరుల చేత
లుప్తమాయె లుంబినీ గోకుళ్‌చాట్‌లు
ఆల్‌ఖైదా తెరిగాపరి చేత

తొలుత పెంచి తుదుక త్రుంచె
నిన్న నెయ్యం నేడు కయ్యం
అకార్యకారి అమెరికా శౌరి
నిన్ను కరిచే నింగి నాగై

అగ్ర రాజ్యం ఉగ్రనేత్రం
రిపుసేనలు రూపుమాప
తోమహాక్‌లు తెచ్చె తంట
తాలిబాన్ తెంపరింట

హన్సారైనా హమాసైనా
ఆల్ ఉమైనా ఆల్‌ఖైదైనా
గోముఖవ్యాఘ్రులె నరహంతకులంతా
తుడిచి పెట్టవలె తెరిగాపరులంతా

యూధుదుమ్ముతో క్రైస్తవ దురద
వ్యాధి పట్టిలె హిందూవాదం
లాడెన్ బీహాద్ లింకా సాగవు
రోజువాయెలే అతివాద రోగికి


మేర మీరి మేలమాడిన
మొగ్గలీడులు మొగ్గతోన్
మంబర చేయుమూ మొగ్గరమున
ముష్కర మొన మేదినిపైన

*– కె. హేమసుందరరావు*

*'రాతినాగుల జూచిన బాలనిడుయందురు*
*జాతినాగుల జూడ జంపుడందురయ్యా*
*తినెది జంగమురాగ నడువుడందురు*
*తినని లింగమునకు భోజన మిడు మందురయ్యా*
*కూడల సంగని భక్తుల జూచి ఉదాసన సేయంగ*
*రాతిని దాకు పెంటికయై పడెదరయ్యా'*

★ ★ ★ ★ ★

'**చి**త్తశుద్ధి లేని శివపూజలేలయ్యా' అన్న వేమనకు స్ఫూర్తినిచ్చిన మహనీయుడు బసవేశ్వరుడు.



"ఎంతకాలం రాయిలో నీళ్ళలో నానినా ఏమిటి లాభం! అదేమైనా మెత్తబడేనా?

ఎంతకాలం నేను నిన్ను కొలిచినా ఏమిటి లాభం! చిత్తం చపల మైనపుడు

దాచిన నిధికి కాపలా కాసే పిశాచం బతుకైంది నాది! కూడల సంగమదేవా" అంటూ వాపోయాడు.

మనం మాట్లాడే మాటలు నిత్యసత్యాలుగా వుండాలంటాడు.

'పాపపుణ్యాలనేటువంటివి మీ చేతులో వున్నవి?
అయ్యా అంటే స్వర్గం, ఒరే అంటే నరకం కూడల సంగమదేవా'

మర్త్య లోకమనేటివంటిది! ఆకర్తాదుని కర్మశాల! ఇక్కడ చెల్లేవాడు అక్కడా చెల్లుతాడు! ఇక్కడి చెల్లనివారు అక్కడా చెల్లరు - కూడల సంగమదేవా".

బసవన 4,64,000 వచనాలు రాశాడంటారు. కాని విఖ్యాత పరిశోధకుల పరిశ్రమల వలన దాదాపు వేయి పదములే లభించటం శోచనీయం.

బసవన్న నిగర్వి. తన భావాలను స్పష్టంగా, సరళమైన భాషలో చెప్పాడు. సర్వమానవ సేవయే పరమాదర్శంగా భక్తిమతాన్ని ప్రచారమొనర్చిన బసవేశ్వరుడు క్రీ.శ. 1168లో కప్పడి సంగమ క్షేత్రంలో శివైకమొందాడు.

*– జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

# మల్లికార్జున పండితారాధ్యుడు

**లోకంలో ఎన్నో మతాలున్నాయి. వాటిలో శైవం, వైష్ణవం, జైనం ప్రధానంగా కనిపిస్తున్నాయి. ముఖానికి, పొట్టకి, చేతులకు విభూతి పూసుకొని కనబడిన వ్యక్తిని శైవుడు అంటాం. అదేవిధంగా, నిలువు పట్టీలు దిద్దుకుంటే ఆ వ్యక్తిని వైష్ణవుడు అంటాం. అద్వైతం, విశిష్టాద్వైతం అనే పేర్లతో రెండు మతాలు లోకంలో విశేష ప్రచారం పొందాయి. ఈ రెండింటిలోను ఏది గొప్ప? అని ప్రశ్నించుకుంటే ఎవరికి వారే గొప్ప. శివుడు తప్ప మరొక దేవుడు లేడని, మరో దేవుడి పేరు ఉచ్ఛరించమనేవారు వీరశైవులయ్యారు. అదే పద్ధతిలో వీర వైష్ణవం కూడా ఆవిర్భవించింది. వీరశైవాన్ని ప్రచారం చేస్తూ కవిత్వం వ్రాసిన కవులు కొందరున్నారు. వారిలో మల్లికార్జున పండితారాధ్యుడొకడు.**

ఈయన క్రీ.శ. 1140లో వానస భీమయ్య గారికి జన్మించాడు. వీరిది సనాతన బ్రాహ్మణ కుటుంబం. మల్లికార్జునుడు, జన్మతః శివభక్తుడు. తండ్రి అయిన భీమయ్య దాక్షారామంలో భీమేశ్వర స్వామి దేవాలయంలో అర్చకుడు. మల్లికార్జునుడు కూడా తండ్రిగారితో కలిసి భీమేశ్వర దేవుణ్ణి అర్చించేవాడు. క్రమేపీ ఈయనలో శివభక్తి అధికంకాసాగింది. శివుడొక్కడే దేవుడు అనే స్థితికి వచ్చాడు.

ఈ కుటుంబం నివసిస్తున్న దాక్షారామానికి సమీపంలో కోటిపల్లి అనే ఊరుంది. ఆ గ్రామంలో నివసిస్తూ శిష్యులకు వేదం, శాస్త్రాలు బోధిస్తున్న అవాంతరయ్య అనే పండితుని దగ్గర మల్లికార్జునుడు విద్యనభ్యసించాడు. మల్లికార్జునుని భక్తి శ్రద్ధలకు, శివభక్తికి మెచ్చుకొని అవాంతరయ్య ఈయనకు శివదీక్షనిచ్చాడు. దానితో గురువు దగ్గర అభ్యసించిన విద్య, శివదీక్ష ఏకమై, మల్లికార్జునడు శైవం తప్ప మరో మతం లేదని, శివుడొక్కడే దేవుడని అందరకు బోధించాడు.

సాధారణ శివభక్తుడైన మల్లికార్జునుడు దాక్షారామ భీమేశ్వరుని సేవిస్తూ, తరిస్తూ, వీరశైవుడయ్యాడు. అంతే ఒంటినిండా విభూతి రేఖలు. నుదుటి మీద, శిరస్సు మీద భుజాలకు, పొట్టమీద త్రిపుండ్రాలు దిద్దుకొన్నాడు. ఆ వేషాన్ని చూసి ఆనాటి బ్రాహ్మణులే మల్లికార్జునుని వేళాకోళం చేసేవారు. ఇది వైదికమతానికి విరుద్ధంగా ఉందని, పద్ధతి మార్చుకోమని సలహా యిచ్చేవారు. దానితో మరింతగా రెచ్చిపోయి, మెడలోను, జబ్బలకి, మణికట్టుకి, శిఖకి రుద్రాక్ష మాలలు ధరించి తనను వెక్కిరిస్తూ వేళాకోళం చేసిన వారికి అపర రుద్రుడుగా దర్శనమిచ్చేవాడు.

బాగా చదువుకొన్న కారణంగా మల్లికార్జునుని పండిత బిరుదుతో ప్రజలు గౌరవించారు. 'శివుడొక్కడే ఆరాధ్యుడు' అని ప్రచారం చేసిన కారణంగా, ఈ పండితుడు, పండితారాధ్యుడయ్యాడు, మొత్తం మీద మల్లికార్జున పండితారాధ్యుడయ్యాడు. కాని ప్రజలు ఈయనను 'పండితయ్య' అని పిలిచేవారు.

''పండితయ్యా! నీవు వేదశాస్త్రాలు చదువుకొన్నావు. పురాణాలు ఔపోశనపట్టావు. ఒంటినిండా ఈ విభూతిరేకలేమిటి? పిల్లలు చూస్తే జడుసుకొనేలా ఈ రుద్రాక్షలేమిటి? నిరంతర శివాభిషేకాలేమిటి? నీవు కూడా మాలాగా ఉండొచ్చు కదా! మధ్యలో గురుపాదుకల్ని పూజించి, అభిషేకం చేసి పాదోదకం త్రాగడం దేనికి?'' అని అడిగేవారు.

దానికి, పండితయ్య విభూతి రహస్యాన్ని, వారికి వివరించాడు. గురువును పూజించాలని, ఆయన పాదోదకం త్రాగాలని, అది సమస్త పాపాలను హరిస్తుందని, శరీరంలోని సమస్త రోగాలను తొలగించే దివ్యౌషధమని వివరించాడు. దేవాలయంలో ఇచ్చే విభూతిని ఒంటినిండా పులుముకుంటే మనస్సు పరిశుద్ధమౌతుందని, తప్పుడు పనులు చేసే అవకాశముండదని వివరంగా చెప్పాడు. తానెన్నుకొన్నది వీరశైవం అన్నాడు. ఇన్ని విషయాలు ఇంత వివరంగా చెబితే విన్నవాళ్ళు అవాక్కయ్యారు. ఆయన పాండిత్యానికి, శివభక్తికి ఆశ్చర్యపోయారు! ఆనందపడ్డారు. కొందరాయనకు శిష్యులై అనుసరించారు.

పండితయ్య శివుణ్ణి ఎంత భక్తితో ఆరాధించే వాడో అవసరాలను గుర్తించి ఆదుకొనేవాడు. వారికి తగిన సేవలు చేసేవాడు. శివభక్తిలో తన్మయుడయ్యేవాడు. ఈ విధంగా పండితయ్య చెప్పే శివకథలు విని, పరవశించిన వారిలో వెల్లగుండ మహాదేవయ్య ఒకడు. ఈయన కూడా నిరంతరం శివపూజలు చేసేవాడు. పంచాక్షరీ మంత్రాన్ని పంచప్రాణాల కన్నా మిన్నగా భావించి జపించేవాడు. తాను పూజించే శివయ్య సన్నిధిలోనే నిద్రించేవాడు. ఉదయం లేస్తూనే శివదర్శనం చేసుకొనేవాడు. ఒకనాడు మహాదేవయ్య నిద్రలో శివపూజ సామగ్రిని కాలితో తన్నాడు. ఈ అపచారం నిద్రదే కాని, మహాదేవయ్యది కాదు. అయినా మహదేవుని పూజా సామగ్రిని తన్నిన పాపానికి ప్రాయశ్చిత్తంగా భక్తుడైన మహదేవయ్య తన రెండు కాళ్ళను నరికేసుకొన్నాడు.

మహదేవయ్య చేసిన పని పండితయ్యకు తెలిసింది. పరుగు పరుగున ఆయన యింటికి వచ్చాడు. శివాలయంలో శివునికి దీపారాధన చేసిన నూనెతో ఆయన కాళ్ళను దగ్గరగా అతికించి, ఆ కాళ్ళకు రాశాడు. మహదేవయ్యకు పరిచర్యలు చేశాడు. ఆయన శివభక్తి మహిమో, శివుని అనుగ్రహమో తేలీదుగాని, మహాదేవయ్య కాళ్ళు అతుక్కున్నాయి. ఆయన తిరిగి అందరి లాగా లేచి నడువసాగాడు. ఇది చూచి ప్రజలంతా ఆనందించారు. ఇదంతా పండితయ్య మహిమే అని లోకులు వేనోళ్ళ ప్రశంసించారు. దీనితో మల్లికార్జున పండితారాధ్యుని కీర్తి దశదిశలా వ్యాపించింది. అందరూ ఆయనను కొనియాడేవారే.

వీరశైవ మతాన్ని ఒక్క మల్లికార్జున పండితారాధ్యుడేకాదు, ఇతర దేశీయులు, ఇతర ప్రాంతాల వారు కూడా ఆచరించేవారు, వీరశైవుల్ని, బ్రాహ్మణులు, వైష్ణవులు, జైనులు, బౌద్ధులు మొదలైన వారు ద్వేషించడం, దూషించడం వంటివి కూడా జరుగుతూ ఉండేది.

ఆ సమీపంలోనే పోరండ్ల అనే గ్రామం ఉంది. అది బ్రాహ్మణ అగ్రహారం. ఆ ఊళ్ళో సూరసానమ్మ అనే పూర్వసువాసిని ఉండేది. ఈమె వితంతువైనప్పటికీ వీరశైవ మతాన్ని అవలంబించింది. అందరికి శివుని గాథలు చెబుతూ, శైవాన్ని ప్రచారం చెయ్యడం మొదలు పెట్టింది. కులం

మొదలైన సామాజిక వ్యవస్థను పట్టించుకొనేది కాదు. మానవుడిలో శివుణ్ని చూడాలిగాని, కులాన్ని కాదని వాదిస్తుంది. పంచములకు కూడా పంచాక్షరీ మంత్ర దీక్ష నిచ్చి ఆదరిస్తుంది. వారిలో శివభక్తిని రేకెత్తిస్తుంది.

సూరసానమ్మ ఈ విధంగా చేస్తే అగ్రహారంలోని బ్రాహ్మణులు ఊరుకుంటారా? ఆమె మీద విరుచుకు పడ్డారు. నీవు చేస్తున్నది దైవద్రోహమని నిందించారు. అల్లరి పెట్టారు. బ్రాహ్మణులు ఎంత అరచినా, గగ్గోలు చేసినా సూరసానమ్మ వాళ్ళనందరినీ ధైర్యంగా ఎదుర్కొంది. శివమహిమను ఎలుగెత్తి చాటింది. వారిని తన మాటలతో శాంతపరచింది. ఆమెను అల్లరి చేసిన వాళ్ళంతా మారుమాట మాట్లడలేక, సిగ్గుతో తలదించుకొని వెళ్ళిపోయారు.

సూరసానమ్మకి మల్లికార్జున పండితారాధ్యుని గురించి తెలిసింది. ఆయనను చూడాలనిపించింది. బెలిదేవి వేమనారాధ్యుడనే మరొక భక్తుని వెంట బెట్టుకొని బయలు దేరింది. సూరసానమ్మ వెళ్ళే సమయానికి పండితయ్య శివపూజలో ఉన్నాడు. ఈమె రాక తెలుసుకొన్న పండితయ్య శివపూజ పూర్తి చెయ్యకుండానే బయటకు వచ్చాడు. పూజ పరిపూర్తి కాకుండానే బయటకు వచ్చిన పండితయ్యను చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యపడ్డారు. శివపూజకన్న, శివభక్తులే గొప్పవారని, వారి దర్శనం శివదర్శనంతో సమానమని పండితయ్య చెప్పాడు. ఈ విషయం విని సూరసానమ్మ, వేమనారాధ్యుడు 'ఔరా!' అంటూ ముక్కు మీద వ్రేలు వేసుకున్నారు. ఈయన శివభక్తి బండారు బసవన్న శివభక్తి కన్న గొప్పగా ఉందని వివరించారు.

బండారు బసవన్నది కన్నడదేశం. ఆ దేశాన్ని బిజ్జలుడనే రాజు పాలిస్తున్నాడు. ఈయన దగ్గర బసవన్న కోశాధికారిగా ఉన్నాడు. బసవన్న శివభక్తులను ఆదరించాడు. వారికి అధికంగా ధనం సమకూర్చేవాడు. శైవులు కాని వారిని దారుణంగా హింసించేవాడు. ఇతర మతాలకు చెందినవారు, బసవడు పెట్టే బాధలకు తట్టుకోలేక చింతించేవారు. ఈ విషయాలన్నింటిని సూరసానమ్మ పండితయ్యకు చెప్పింది. బసవన్న దగ్గర 'శివసాయితం' అనే ఖడ్గం ఉంది. దాన్ని చేత బూని బసవన్న వీరోచితంగా వీరశైవాన్ని ప్రచారం చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశమంతా వీరశైవాన్ని ప్రచారం చెయ్యాలని పండితయ్య భావించాడు.

ఆ కాలంలో చందవోలు రాజధానిగా పరిపాలిస్తున్న రాజు బౌద్ధమతావలంబి. రాజగురువు పేరు బౌద్ధ పదపదాచార్యుడు. ఆయనను ఓడించి వీరశైవ మతాన్ని వృద్ధి చెయ్యాలని మల్లికార్జున పండితునకు తోచింది. వెంటనే శిష్యులతో బయలుదేరాడు. మహారాజ సభలో బౌద్ధగురువుకి, మల్లికార్జున పండితునకు వాదోపవాదాలు జరిగాయి. ఆ వాదనలో బౌద్ధులతో పాటు ఇతర మతాల వాళ్ళు ఓడిపోయారు.

మల్లికార్జునుడు విజయగర్వంతో రెచ్చిపోయి, శివుణ్ని మించిన దేవుడు లేడు, శివదూషణ చేసిన వాడి తల మీద తంతానన్నాడు. ఈ రకంగా పండితయ్య తిట్టాడు. ఆ తిట్లు తింటూ నోరు మూసుకుని ఊరుకోడానికి బౌద్ధగురువు చేతకాని వాడా! ఆయన కూడా ఓడిపోయిన కోపంతో నోటికొచ్చినట్లు దుర్భాషలాడాడు.

పండితయ్యను దూషించాడన్న కోపంతో, రేమయ్య, దేవయ్య అనే పండిత శిష్యులు బౌద్ధ గురువు పొట్ట చీల్చి పేగులు బయటకు లాగారు. ఆయన తల తెగ్గొట్టి కడుపులో కుక్కేశారు. ఈ సంగతి రాజుకి తెలిసింది దీనికి ప్రతిగా పండితయ్య కళ్ళల్లో రాజు జిల్లేడు పాలు పోయించాడు. కళ్ళు పీకించాడు.

దానికి కోపించిన పండితయ్య "నువ్వు సర్వనాశనమై పోతావు" అని రాజును శపించాడు. రాజు మరణించే వరకు తనకు కళ్ళు అనుగ్రహించ వద్దని శివుణ్ని ప్రార్థించాడు.

*పశుపతి మీ భక్తి పరులు,*
*'శాపాదపి శరాదపి', యనంగ*
*వెను ద్రోహి ద్రుంచు నంతకు,*
*కన్నులిచ్చు నీభక్తులాన'....* (పండితారాధ్య చరిత్ర)

అంటూ శివుని మీద ప్రమాణం చేశాడు. తరువాత, శిష్యులతో కలసి అమరావతి వచ్చాడు.

"మనం వెలనాటి నుండి వచ్చాం. అక్కడి రాజు మనల్ని అవమానించాడు. అతడు తప్పక మరణిస్తాడు. శివుడు మనకు కన్నులిస్తాడు" అంటూ ఉండగానే-

*'అంతలోననె ఫణిహారి యాద్రోహి*
*నంతకు ప్రోలికి ననిపియే తెంచి*
*నలి భక్త తతికి విన్నప మాచరింప'*

చందవోలు రాజు మరణించడం, పండితారాధ్యునకు పోయిన కన్నులు తిరిగి రావడం జరిగాయి. తనకు కళ్ళు రాగానే రాజు చనిపోయాడని గ్రహించిన పండితయ్య ఎంతో సంతోషించాడు.

తనను కలుసుకోమని బండారు బసవయ్య పండితయ్యను ఆహ్వానించాడు. పండితయ్య ముందుగా చోడ రాజ్యానికి వెళ్ళాడు. ఆ రాజ్యంలోని చాలామంది పండితయ్య ఉపదేశాలు విని ఆయనకు శిష్యులయ్యారు. ఆయన చుట్టూ తిరుగసాగారు. బసవన్నను కలుసుకోక పూర్వమే బసవన్న చనిపోయాడు. దానితో నిరాశతో కూడిన మల్లికార్జునుడు శ్రీశైలం వెళ్ళాడు.

బసవన్న తన జీవిత కాలంలో ఎందరినో ప్రభావితుల్ని చేశాడు. శైవులుగా మార్చాడు. దీనికొక ఉద్యమాన్నే చేపట్టాడు. ఉద్యమాలలో నుండి కవులు పుట్టారు. కొందరు కవులు ఉద్యమాల కోసం పుట్టారు. బసవన్న వచన సాహిత్యం సృష్టించాడు. దానిని అనుభవసాహిత్యం అంటారు. ఈ తరహా కవిత్వం ప్రజాకవిత్వమై ప్రజల నాలుకల మీద శాశ్వతంగా నిలిచిపోయింది.

బసవన్న జన్మతః బ్రాహ్మణుడు. ఇతడు బ్రాహ్మణ ధర్మాల ను నిరసించాడు. ప్రజల మధ్య కులం అడ్డుగోడ కాకూడదన్నాడు. భూమి మీద పుట్టిన యావన్మంది జనులు శివాంశ సంభూతులే... అటువంటి వారి మధ్య కులం ఏమిటి? హెచ్చు తగ్గులు, పట్టింపులు లేని నవసమాజావిష్కరణ కోసం నిరంతరం కృషి చేశాడు. యజ్ఞ యాగాలను నిరసించాడు. యజ్ఞాలలో జంతు బలి పనికిరాదన్నాడు. వర్ణాశ్రమాచారాలు ఈతని దృష్టిలో పనికిరానివి.. ఏడాదికోసారి చనిపోయిన వారికి తద్దినాలు పెట్టడం, ఆలయాలకు, మఠాలకు దానధర్మాలు చెయ్యడం, పురిటిమైల, చనిపోయిన తర్వాత పట్టే మైల ఈతని దృష్టిలో పనికిరావు. పైగా దోషాలు కూడా. పాప పుణ్యాలు లేవు. పునర్జన్మలేదు. వెన్న కరిగి నెయ్యి ఔతుంది. అంతేగాని తిరిగి వెన్నగా

మారదు. అదే విధంగా చనిపోయినవాడు శివైక్యం చెందుతాడు. తిరిగి జన్మించడు. ఇతడు దగ్గరుండి కులాంతర వివాహాలు చేయించాడు. దానికి ఆ కాలంలోని బ్రాహ్మణులు ఎదురు తిరిగారు అయినా బసవన్న నిర్భయంగా వారికెదురు నిలిచాడు.

ఈ మొదలైన విషయాలతో మల్లికార్జున పండితారాధ్యుడు ప్రభావితుడయ్యాడు. దానితో 'శివతత్వసారం' అనే గ్రంథం రచించాడు. ఇది శతకం. శతకం అంటే నూరు పద్యాలుంటాయి. ప్రతి పద్యానికి మకుటం ఉంటుంది. కాని ఆయన శతకంలో 489 కంద పద్యాలు ఉన్నాయి. వీటితో ఒకే రకమైన మకుటం లేదు. 489 పద్యాలకు 'అంబా రమణా! కపర్దీ, చంద్రాభరణా!. మహేశా, పరమానందా, సర్వజ్ఞా! హరా!' అంటూ మొత్తం 28 మకుటాలున్నాయి.

పండితారాధ్య చరిత్రలో పాల్కురికి సోమనాథ కవి కూడా దీనిని శతకమనియే చెప్పాడు. తెలుగు వాఙ్మయములో శివతత్వసారం మొట్టమొదటి శతకం. ఆ తరువాత వచ్చిన కవులు శతకమునకు కొన్ని నియమాలు ఏర్పాటు చేశారు.

మల్లికార్జున పండితారాధ్యులు -

*'అరుదుగ పురాణములలో*
*పరవడి మును నెప్పియున్న భంగి 'గణాడం*
*బరవిభవము' వర్ణించితి*
*ధరణీధరవంద్య! నా యథాశక్తి శివా!'*

"పురాణాలలో పూర్వ కవులు చెప్పిన మాదిరిగా గణాల ఆడంబరం ప్రదర్శిస్తూ కవిత్వం చెప్పాను" అన్నాడు.

సోమనాథుని పండితారాధ్య చరిత్రలో మల్లికార్జున పండితారాధ్యుని రచనలను పేర్కొనడం జరిగింది. ఆ ప్రకారంగా చూస్తే, పండితారాధ్యుల వారి రచనల సంఖ్య 44 అని తెలుస్తుంది.

మల్లికార్జున పండితుడు తన రచనలో ఒక శ్లోకంలో తప్పు వ్రాశాడని కొందరు విమర్శకులాక్షేపించారు. అపుడాయన ఆ శ్లోకాన్ని తన శిష్యుల చేత కాశీ పండితులకు నిజనిర్ధారణ కోసం పంపించాడు. వారణాసిలోనున్న గౌళభట్టారకుడు అనే పండితుడా శ్లోకాన్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. ఆ తరువాత ఆ శ్లోకంలోని 'యత్సంవిత్తు' అనే నాలుగు అక్షరాలు ఆధారంగా చేసుకొని నాలుగు వేల శ్లోకాలు రచించి, తిరిగి పంచినాడు. దానితో, దుర్విమర్శక శిఖామణులు సిగ్గుతో తలవంచుకొని, మారు మాటాడక వెళ్ళి పోయారు. ఈ ఒక్క పదం మల్లికార్జున పండితారాధ్యునికి గొప్పతనాన్ని తెలియజేస్తోంది.

మల్లికార్జున పండితారాధ్యుని శివతత్వసారం నుండి ఎన్నో విషయాలు గ్రహించవచ్చు. ఈయన 'వీరమహేశ్వరాచార మార్గానుసారియై' కేవలం భక్తి మార్గాన్ని నెలకొల్పడానికే శివతత్వసారం అనే గ్రంథాన్ని రచించాడు. శివభక్తులు ఏ విధంగా ఉండాలో ఆ గ్రంథంలో వివరించాడు. ఇది మనుస్మృతి, పరాశరస్మృతి వంటి స్మృతిగ్రంథం, అయితే పండితారాధ్య కవి శివతత్వసారంలో ప్రతిపాదించిన విషయాలు ప్రతి ఒక్కరు తెలుసు కోవాలసిందే. అవి ఈ విధంగా ఉన్నాయి.

- ప్రజలు శివభక్తులను చూసి వారి జాతికులం, గోత్రం మొదలైనవి అడగకూడదు.
- శివభక్తి తత్పరులు అనారోగ్యానికి గురైనా ఆర్థిక ఇబ్బందులకు చిక్కి బాధపడుతున్నా లేక మరేదయినా భయానికి లోనైనా వారి దగ్గరకు వెళ్ళి సేవలు చెయ్యాలి. అన్ని విధాల ఆదుకోవాలి. వారడుగకుండానే ఉపకారం చెయ్యాలి.
- బురదలో పుట్టిన పద్మం శివపూజకు అర్హమైనట్టే, నీచకులంలో పుట్టినా శివభక్తుడు పూజనీయుడే. అతడిని హీనంగా చూడకూడదు.
- శివభక్తుడైన నీచకులస్థుడు గొప్పవాడైనప్పుడు, ఉన్నత వంశంలో జన్మించిన శివభక్తుడు మిక్కిలి గొప్పవాడు. అంటే బంగారానికి పరిమళం అబ్బినట్లే.
- బ్రాహ్మణుడు ఎటువంటి ప్రవర్తన కలవాడైనా, అతడు చంపదగిన వాడు కాదు. అదేవిధంగా శివదీక్ష పరుడు ఏ కులంలో జన్మించినా అతడు వధార్హుడు కాదు.
- భర్త శివభక్తుడు కాకపోతే, భార్య అతనికి నచ్చజెప్పి శివదీక్ష ఇప్పించాలి. ఒకవేళ భర్త శివదీక్షను నిరాకరిస్తే, భార్య అతనిని విడిచిపెట్టి, ఇంటినుండి బయటకు వచ్చెయ్యాలి.
- శివభక్తురాలైన భార్య, భర్త చెప్పినట్లుగా నడచుకోవలసిన పనిలేదు .భర్త తన యిష్టం వచ్చినట్లున్నప్పుడు, శివభక్తిగల భార్యకు దుర్గతి పట్టదు. ఆమెను శివుడాదుకొంటాడు.
- శివభక్తి లేనివారు వయసులో ఎంతపెద్ద వారైనా, ధనంలో ఎంత గొప్పవారైనా, శివభక్తులు వారికి పాధాభివందనం చెయ్యవలసిన పని లేదు. ఒకవేళ వీళ్ళు శివభక్తులు కదా! అని ఆ పెద్దలు నమస్కరిస్తే, వారి నమస్కారాలను శివభక్తులు స్వీకరించకూడదు.
- ఎప్పుడైనా ధనం అవసరం వస్తే శివభక్తులు కాని వారి దగ్గర ఋణం చెయ్యకూడదు. వాళ్ళకు ఋణం ఇవ్వకూడదు. వారిని చూడకూడదు. అసలు పలుకరించకూడదు.
- శివభక్తేతరులతో కలిసి నిద్రించరాదు. కలిసి ఏక పంక్తిలో భుజించరాదు, ఒకే ఆసనం మీద కూర్చోకూడదు. వారితో స్నేహం చెయ్యకూడదు.
- శివనింద చేసేవారు మహాపాపాత్ములు, వారిని క్షమించకూడదు. నిర్దాక్షిణ్యంగా చంపేయాలి. శివనిందచేసే గ్రంథాలను ముందు వెనకలాలోచించకుండగా తగులబెట్టాలి. ఆ గ్రంథ రచయితలను, ఆ గ్రంథాలను, పాఠం చెప్పేవారిని దారుణంగా సంహరించాలి.
- ఒకవేళ శివభక్తుడు పాపం చేశాడనుకుందాం. అది పాపం కాదు.
- శివభక్తులలో దుర్గుణాలను, పాపాలను వెదకి చూపేవాడు చండాలునితో సమానం.

తన మత ప్రచారం కోసం మల్లికార్జున పండితుడు ద్వేషంతో ఇతరులను గురించి చాలా చెడ్డగా చెప్పాడు. ఎన్నో పవిత్ర గ్రంథాల ను తగులబెట్టించాడు. ఇది అతని జీవితానికి మాయని మచ్చ. తీరని కళంకం. ఇది ఆవేశ పూరితంగా చేసిన దుష్కార్యం. ఆనాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల కారణంగా పండితయ్య ఈ దుర్మార్గానికి పూనుకొన్నాడని భావించవలసి వస్తోంది. చదువుకొన్న విద్వాంసులు, పండితులు, జ్ఞానులు అయిన వారు, విద్యావిహీనులను చేరదియ్యాలి. వారికి మంచిచెడు బోధించాలి. సమాజానికుపయోగపడేటట్లు వారి మనసుల్ని మార్చాలి. శ్రేయోమార్గానికి పూలదారులు పరచాలి. అంతేకాని, ఇటువంటి వినాశకర విధానాలకు శ్రీకారం చుట్టకూడదు.

పండితయ్య ప్రచారం చేసిన వీరశైవం ఆ కాలంలో కొందరికి ఆనంద దాయకం కావచ్చు. తలలు తెగగొట్టుకుంటే తిరిగి అతుక్కుంటాయట. చేతులు నరుక్కుంటే చెట్టుకొమ్మలు మాదిరి తిరిగి చిగురిస్తాయట. ఊడ బెరుక్కున్న కళ్ళు మళ్ళీ వస్తాయట. ఎందుకీ ఆత్మబలులు? ఇప్పటికి తలలు నరుక్కొంటున్నట్లున్న శిల్పాలు చూపరులకు ఆ ప్రాంతంలో దర్శనమిస్తాయి.




పండితయ్య వ్రాసిన గ్రంథంలో శైవులు కాని వారిని హింసించడం, శిక్షించడం వంటి విషయాలు కనబడతాయి.

*మారారి ద్రోహునింటికి*
*పేరంటము వచ్చి తనుచు బెలుచును గోసెన్*
*వై రమున నదితి ముక్కును*
*భారతి నాసికయును వీరభద్రుడు రుద్రీ!*

దక్షాధ్వరధ్వంసం సందర్భంలో వీరభద్రుడు అదితి, సరస్వతుల ముక్కులు కోశాడట! వినడానికి చదువుకోడానికి హాస్యరసోస్ఫరకంగా ఉన్న పద్యమిది.

*స్వాహాపతి భామినియగు*
*స్వాహాంగన ముక్కు, ఎడమ చనుమొనయు తగన్*
*సాహసము తోడ చిదిమిన*
*బాహు బలంబొప్పె వీరభద్రునకు శివా!*

అగ్నిహోత్రుని భార్య స్వాహాదేవి. వీరభద్రుడు, దక్షునియాగాన్ని ధ్వంసం చేస్తూ స్వాహాదేవి ముక్కును, ఆమె ఎడమ పార్శ్వపు చనుమొన తన బాహుబలం ప్రదర్శించి చిదిమాడట.

సమాజంలో సమానత్వాన్ని సాధించడానికి, మానవత్వాన్ని ఎలుగెత్తి చాటడానికి ఎందరో బ్రాహ్మణులు ముందుకొచ్చారు. ఆహితాగ్నుల మనుకొన్న వారిని ఎదిరించారు.

విజయవాడలో శ్రీపతి పండితుడు ఒక మాల వాని యింట్లో భోజనం చేశాడు. మిగిలిన బ్రాహ్మణులు ఆయనకు త్రాగడానికి నీళ్ళు పుట్టకుండా చేశారు. శ్రీపతి పండితుడు వారింట్లో వంటకు నిప్పుపుట్టకుండా చేశాడు. ఎవరి ప్రతిభ వారిది.

మల్లికార్జున పండితులు వేదాలు, శాస్త్రాలు, వ్యాకరణం మొదలైనవి అభ్యసించాడు. ఈయన శివభక్తుడు. శివుడికి పశుపతి అనే పేరు కూడా ఉంది. ఆ కారణంగా కొందరు వ్యాకరణం ఆధారంగా పండితయ్యను వెక్కించారు. పశుపతి అన్నదానికి పశువులు పతులుగా కలవాడు అని విపరీతార్థం చెప్పారు.

*పతి రుద్రుడు పశువులకని*
*శ్రుతి చెప్పుచు నునికి జేసి రుద్రుడు పతి త*
*క్కితరులు పశువులు పొమ్మని*
*మతిలో నేరిగితి శ్రుతి ప్రమాణమున శివా!*

పశుపతి అంటే పశువులకు (ప్రాణులకు లేదా జీవులకు) పతి నాథుడు - ఇది షష్ఠీతత్పురుష సమాసం. బహువ్రీహి సమాసం కాదు - అని వివరించాడు.

సంస్కృత పదాలను కూడా కందపద్యంలో ఇమిడ్చి చెప్పగల నేర్పు పండితారాధ్యులకుంది.


*'వసుమతి చిత్రము, జితచి*
*త్త సంభవా! "న కర్మణా న తపసాన జపైః*
*న సమాధిభి" రవ్యయ! నీ*
*యసదృశ భక్తికిని బ్రియుడ వగు దీశానా!'*

'ఓ ఈశ్వరా! నీవు జిత చిత్త సంభవుడవు. అంటే మన్మథుని జయించిన వాడవు. కర్మచేతకాని, తపస్సు చేతకాని, జపము చేత కాని సరి సమానం కాని భక్తికి మాత్రం నీవు వశం కాగలవాడవు ' అని చెప్పిన పై పద్యంలో సంస్కృత పదాలను కంద పద్యంలో పొదగడం సాధారణ కవులకు సాధ్యం కాదు. ఈ రకమైన కవితా విన్యాసాన్ని పాల్కురికి సోమనాథుడు, అల్లసాని పెద్దన కూడా తమ రచనలలోకి స్వాగతించారు. ఈయన చిన్న చిన్న తెలుగు పదాలనే కాక సుదీర్ఘ సంస్కృత సమాసాల ను కూడా ఛందోబద్ధంగా తన రచనలో నిముడ్చుకొన్నాడు. ఆ విధంగా కవితా సరస్వతికి అనేక సువర్ణ మాలికలు సమర్పించాడు.

ఈయన తన రచనలో ప్రయోగించిన కొన్ని పదాలు త్వరగా అర్థం చేసుకోవడం కష్టం. మనం, ఏనాడైనా అనే అర్థంలో ఎన్నడైనా అంటాం. ఏనాడు- ఎన్నడు. ఇదే పద్ధతిలో ఆనాడు అనేదాన్ని 'అన్నడు' అని పండితయ్య ప్రయోగించడం ఆ వచనామృతానికి దారి తీస్తుంది.

చిత్ర విచిత్ర పదప్రయోగం, ఛందోబద్ధంగా కవిత్వం చెప్పడం సాధారణమైన విషయం కాదు. మల్లికార్జున పండితారాధ్యుని కవిత్వం శివభక్తి ప్రచార ప్రధానమైనది. అనంతర కవులకు అనుసరణమైనది. తెలుగు సాహితీ ప్రపంచంలో అపురూపమైన మణిపూస. దాచుకుందాం. చదువుకుందాం. భక్తి రసామృతాన్ని దోసిళ్ళతో జుర్రుకుందాం.!

*- వారణాసి వేంకటేశ్వర శాస్త్రి*



# ఆరోగ్యానికి మాతా శిశు – అనుబంధ పోషకాహారం

మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. అయితే శరీరానికి కావల్సిన ఆహారం సమపాళ్ళలో అందితేనే మంచి ఆరోగ్యంతో జీవనం కొనసాగించటానికి అవకాశం ఉంటుంది. బలంగా ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నది మనందరికీ తెల్సినప్పటికీ కానీ శరీరానికి పుష్టి కలిగించే ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో సరియైన అవగాహన లేకపోవటంతో మనదేశంలో పోషకాహార లోపంతో బాధపడే ప్రజల శాతం సుమారు 40 శాతం ఉన్నది. అంతర్జాతీయ ఆహార విధానంపై ఇంటర్నేషనల్ ఐ.పి.ఆర్. సంస్థ జరిపిన పరిశోధనల ప్రకారం, మన దేశంలో పోషకాహారం లోపంతో బాధపడే ప్రజలు ఎక్కువ శాతం ఉండటం వల్ల 'ప్రపంచ ఆకలిసూచిక' ఫలితాలలో సబ్ సహారా ఆఫ్రికా దేశాలకన్నా హీనమయిన స్థితిలో ఉన్నట్లు అర్థం అవుతోంది.



మనదేశంలో గర్భిణీ స్త్రీలు, బాలింతల ఆహార విషయంలో, శరీరపోషణ విషయంలో జాగ్రత్త వహించవలసిన అవసరాన్ని ఈ నివేదిక నొక్కి చెప్తోంది.

ఎందుకంటే గర్భిణీస్త్రీలకు, బాలింతలకు ఈ సమయంలో అదనపు పోషకాహారం అవసరం అవుతుంది. సరియైన పాళ్లలో ఈ పదార్థాలు లభించకపోతే, తల్లులకు రక్తహీనత, పిల్లల కంటిచూపు దెబ్బతినటం వంటి అనర్థాలు కలుగుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లలలోని కుపోషణ వల్ల శారీరక, మానసిక పెరుగుదల మందగించే ప్రమాదముంది.

పుష్టినిచ్చే ఆహారం తప్పనిసరిగా చాలా ఖరీదైనదిగా ఉంటుందని మనలో చాలామంది అపోహ పడుతుంటారు. కానీ ఇది నిజం కాదు. మనకు అందుబాటులో ఉండే గోధుమలు, రాగులు, సజ్జలు, ఆకుకూరలు, వేరుశెనగలు తదితర ఆహారపదార్థాలు కూడా మంచిపోషక విలువలు కల్గి ఉంటాయి.

ఆరోగ్య రక్షణకు ఎటువంటి ఆహార పదార్థాలు అవసరం, చౌకగా దొరికే ఆహార పదార్థాలను వాడి పుష్టినిచ్చే ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చు అనేది చాలామందిని వేధించే ప్రశ్న. ఈ అటువంటి పోషకాహారాన్ని ఎలా తయారు చేసుకోవాలనేది వివరించటానికి ప్రయత్నిస్తున్నాము. ఈ విధానానికి ఆహారం మరియు పౌష్టికాహార బోర్డు వారు ప్రజలలో విస్తృత ప్రాచుర్యం కల్పించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామపంచాయితీలు, ఇతర ప్రజా ప్రతినిధులు కూడా ఈ దిశగా కృషి చేస్తే పోషకాహార రంగంలో పురోగతి సాధించటమే గాక గ్లోబల్ హంగర్ ఇండెక్సులో మనదేశ స్థితిగతులు బాగుపడటానికి అవకాశం ఉంటుంది.

## మాతా శిశు పోషణ – అదనపు ఆహారం

### తీపి పొంగల్

**కావలసిన పదార్థాలు**

1) బియ్యం - 400 గ్రా॥
2) బెల్లం - 400 గ్రా॥
3) నీరు - 1200 మి.లీ. (బియ్యానికి మూడు రెట్లు)
4) పెసరపప్పు - 150 గ్రా॥
5) డాల్డ - 50 గ్రా॥

**తయారుచేసే విధానం**

1) బియ్యాన్ని శుభ్రం చేసి దోరగా వేయించుకోవాలి. పెసరపప్పును 5 లేక 10 నిమిషాల వరకు వేయించాలి. వేయించిన పప్పును బియ్యంతో కలపాలి. బియ్యం, పప్పులను నీటితో శుభ్రం చేసి 5 లేక 10 నిమిషాల వరకు నాన పెట్టాలి.
2) నీటిని మరగించి బియ్యం, పప్పు మిశ్రమాన్ని నీటితో కలిపి, మెత్తపడేంత వరకు ఉడికించాలి. రుచి కొరకు ఉప్పు కలపాలి.
3) పొడిగా చేసిన బెల్లం, డాల్డా కలపాలి. బెల్లం కరిగే వరకు ఉడికించాలి. వేడిగా వడ్డించాలి.

### రాగితో చంటి పిల్లల అనుబంధ ఆహారం

**కావలసిన పదార్థాలు**

1) రాగి పిండి - 1000 గ్రా॥
2) వేయించిన శనగపప్పు - 500 గ్రా॥
3) వేరుశనగలు - 250 గ్రా॥
4) పంచదార - 750 గ్రా॥
5) మొత్తం - 2500 గ్రా॥

**తయారుచేసే విధానం**

1) వేరుశనగలను దోరగా వేయించి పై పొట్టు తీసివేయాలి.
2) వేరుశనగలను మిగిలిన వస్తువులతో కలిపి మెత్తటి పొడిగా చేసుకోవాలి.
3) శుభ్రమైన పొడి డబ్బాలతో నిల్వ చేసుకోవాలి.

### జొన్నతో చంటి పిల్లల అనుబంధ ఆహారం

**కావలసిన పదార్థాలు**

1) జొన్నలు - 1000 గ్రా॥ 2)పెసరపప్పు - 500 గ్రా॥
3) వేరుశనగలు - 250 గ్రా॥ 4) బెల్లం - 750 గ్రా॥
5) మొత్తం - 2500 గ్రా॥

**తయారుచేసే విధానం**

1) జొన్నలను, పెసరపప్పును, వేరుశనగలను శుభ్రం చేసి విడివిడిగా దోరగా వేయించాలి. వేరుశనగలకు పై పొట్టు తీసి వేయాలి.
2) పై పదార్థాలను బెల్లంతో కలిపి మెత్తని పొడిగా చేసుకోవాలి.
3) శుభ్రమైన పొడి డబ్బాలలో నిల్వ చేసుకోవాలి.

## గోధుమ పాయసం

**కావలసిన పదార్థాలు**

1) గోధుమరవ్వ - 500 గ్రా॥ 2) డాల్డా - 50 గ్రా॥
3) బెల్లం - 500 గ్రా॥ 4) పెసరపప్పు - 250 గ్రా॥
5) నీరు - 2500 మి.లీ. (రవ్వకు 5 రెట్లు)

**తయారుచేసే విధానం**

1) గోధుమ రవ్వ, పెసరపప్పును శుభ్రం చేసి కలపాలి.
2) ఈ మిశ్రమాన్ని నీటిలో కడిగి 5 లేక 10 నిమిషాలు నానపెట్టాలి.
3) నీటిని మరిగించి పెసరపప్పు వేసి ఉడికించాలి. పప్పు సగం ఉడికిన తరువాత గోధుమరవ్వ కలపాలి.
4) గోధుమరవ్వ ఉడికిన తరువాత బెల్లం, డాల్డా కలపాలి. బెల్లం కరిగేంతవరకు ఉడికించాలి. అలాగే ఇలాచి పొడి కలిపి వేడిగా వడ్డించాలి.

## కార పొంగల్

**కావలసిన పదార్థాలు**

1) బియ్యం - 400 గ్రా॥ 2) డాల్డా - 50 గ్రా॥
3) పెసరపప్పు - 200 గ్రా॥ 4) నీరు - 1200 మి.లీ. (బియ్యానికి 3 రెట్లు)

**తయారుచేసే విధానం**

1) బియ్యం, పెసరపప్పును శుభ్రం చేయాలి. పెసరపప్పును 5 లేక 10 నిమిషాల వరకు వేయించాలి. వేయించిన పప్పును బియ్యంతో కలపాలి. బియ్యం మరియు పప్పును నీటితో శుభ్రం చేసి 5 లేక 10 నిముషాల వరకు నానపెట్టాలి.
2) నీటిని మరిగించి బియ్యం, పప్పు మిశ్రమాన్ని నీటితో కలిపి మెత్తగా అయ్యేంత వరకు ఉడికించాలి. రుచి కొరకు ఉప్పును కలపాలి.

## గోధుమ రవ్వతో కిచిడి

**కావలసిన పదార్థాలు**

1) గోధుమరవ్వ - 500 గ్రా॥ 2) డాల్డా - 100 గ్రా॥
3) పెసరపప్పు - 250 గ్రా॥ ఆకుకూరలు, ఉప్పు, పచ్చిమిర్చి, పసుపు, జీలకర్ర మరియు ఆవాలు తగినంత

**తయారుచేసే విధానం**

1) డాల్డా వేడిచేసి జీలకర్ర పచ్చిమిర్చి, ఆవాలు, తాళింపు కొరకు కలపాలి. నీటిని కలిపి ఉడికించాలి.
2) కడిగిన పెసరపప్పు ఉడుకుతున్న నీటిలో వేసి ఉడికించాలి.
3) పెసరపప్పు సగము ఉడికిన తరువాత గోధుమరవ్వ కలిపి మెత్తగా అయ్యేంత వరకు ఉడికించాలి.
4) చివరిగా కడిగి, సన్నగా తరిగిన ఆకుకూరలు కలుపవలెను, తరువాత కొన్ని నిమిషాలు ఉడికించి వేడిగా వడ్డించాలి.

## గోధుమతో చంటి పిల్లల అనుబంధ ఆహారం



**కావలసిన పదార్థాలు**

1) గోధుమలు - 1000 గ్రా॥
2) వేయించిన శనగపప్పు - 500 గ్రా॥ 3) వేరుశనగలు - 250 గ్రా॥
4) పంచదార - 750 గ్రా॥
5) మొత్తం - 2500 గ్రా॥

**తయారుచేసే విధానం**

1) గోధుమలను శుభ్రం చేసి దోరగా వేయించుకోవాలి. వేయించిన శనగపప్పు శుభ్రం చేసుకోవాలి. వేరుశనగలను వేయించి పై పొట్టు తీసి వేయాలి.
2) పై వస్తువులను పంచదారలో కలిపి మెత్తని పొడి చేసుకోవాలి.
3) శుభ్రమైన పొడి డబ్బాలలో నిల్వ చేసుకోవాలి.

## గోధుమ, శనగ పిండితో లడ్డూ

**కావలసిన పదార్థాలు**

1) గోధుమలు - 500 గ్రా॥ 2) శనగపిండి - 250 గ్రా॥
3) నెయ్యి - 100 గ్రా॥ 4) బెల్లం - 500 గ్రా॥
5) మొత్తం - 1350 గ్రా॥

**తయారుచేసే విధానం**

1) గోధుమ పిండి, శనగ పిండిని దోరగా వేయించుకొని కలుపుకోవాలి.
2) కావలసినంత నీరు తీసుకొని బెల్లం పాకం తయారు చేసుకోవాలి.
3) బెల్లం పాకానికి పిండి,నెయ్యి కలిపి లడ్డూలు చేసుకోవాలి.

## రాగి లడ్డూ

**కావలసిన పదార్థాలు**

1) రాగి పిండి - 500 గ్రా॥ 2) బెల్లం - 500 గ్రా॥
3) వేరుశనగలు - 150 గ్రా॥ 4) నెయ్యి/డాల్డా - 50 గ్రా॥
5) మొత్తం - 1200 గ్రా॥

**తయారుచేసే విధానం**

1) రాగి పిండిని 20 నిమిషాలు ఆవిరి మీద ఉడికించాలి
2) వేరుశనగలను వేయించి పై పొట్టు తీసి వేయాలి. పొడి చేసుకోవాలి.
3) తగినంత నీరు తీసుకొని బెల్లాన్ని తీగ పాకంగా తయారు చేసుకోవాలి.
4) బెల్లం పాకానికి ఉడికించిన రాగిపిండి, వేరుశనగ గింజల పొడి, నెయ్యి కలపాలి.
5) అన్నింటిని బాగా కలిపి లడ్డూలు తయారు చేసుకోవాలి.

**- డా. అరుణజ్యోతి,** సి.డబ్ల్యు.సి.డి.

# 'నిత్యాన్నదాత' డొక్కా సీతమ్మ

**భారతీయులు 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అన్నారు. మనిషి మనుగడకు ఆధారం ఆహారం. ఆకలిగొన్న వారికి అన్నంపెడితే పుణ్యప్రాప్తి కలుగునన్నారు పెద్దలు. అన్నదానం చేసి చరిత్రకెక్కిన పరమ పుణ్య చరిత డొక్కా సీతమ్మ. 'అతిథి దేవోభవ' అని విశ్వసించిన దొడ్డతల్లి సీతమ్మ.**

1841 వ సంవత్సరం (19వ శతాబ్దం)లో పశ్చిమ గోదావరి జిల్లాలోని మండపేట గ్రామంలోని అనుపిండి నరసమ్మ, భవానీ శంకరం గార్లకు జన్మించింది సీతమ్మ. బాల్యంలోనే తల్లి మరణించడంతో, తండ్రి ఆ అమ్మాయిని పెంచాడు. ఇల్లు చక్కదిద్దుకొనే భారం సీతమ్మపై పడింది.

గోదావరి నదీ పాయలలోని గ్రామం లంకల గన్నవరం. ఆ గ్రామం లోని సంపన్న కుటుంబీకుడు డొక్కా జోగన్న పంతులు. ఆయన వేద పండితుడు, పెద్దరైతు.



జోగన్న పంతులు గ్రామాంతరం వెళ్తూ మండపేటలోని భవానీ శంకరం గారింటికి వెళ్ళాడు. శంకరంగారు పంతులు గారికి ఆ పూట ఆతిథ్యమిచ్చాడు. యవ్వనంలో వున్న సీతమ్మ మర్యాద, అణకువను గుర్తించి జోగన్నపంతులు ఆమెను పెళ్ళాడదలచాడు. భవానీశంకరం దంపతులు ఎంతో సంతోషించి వారి వివాహం జరిపారు.

ఆ కాలంలో, గోదావరి దాటడానికున్న ఒకే ఒక ప్రయాణ సాధనం పడవ. లంకల గన్నవరం మార్గ మధ్యంలో వున్నందున, ప్రయాణికులు అక్కడ విడిది చేసేవారు. మార్గాయాసంతోవున్న వారికి ఆదరంతో ఆతిథ్యమిచ్చేవారు జోగన్న, సీతమ్మ దంపతులు. ఏ వేళ వచ్చినా, ఎందరు వచ్చినా సంతోషంగా అన్నం పెట్టేది సీతమ్మ. ఆమె వితరణ శీలాన్ని విన్న పెద్దలు, మనుచరిత్రలోని గృహిణిని తలచుకొనేవారు. 'వందనలయదు వేవురు వచ్చిరేని, అన్నపూర్ణకు నుద్దివకానతని గృహిణి' గా సీతమ్మ పేరు గాంచింది. రాత్రి పొద్దుపోయే వరకు శ్రమించి, ఇంటి బయటికి వచ్చి ఎవరైనా ఆకలిగొన్న వారున్న వారిని పిలిచి భోజనం పెట్టిన తర్వాతనే ఆమె పడుకొనేది.

ఆమె అన్నదానాన్ని గురించి ఎన్నో కథలు చెప్పేవారు. ఆమెను 'మాతాన్నపూర్ణేశ్వరి' అంటూ ప్రశంసించేవారు. ఆమె పేరు జిల్లా కలెక్టరు చెవిన పడింది. కలెక్టర్ పిఠాపురం రాజాగారికి చెప్పగా ఆయన ఆశ్చర్య చకితుడయ్యాడు. ఎన్నో దాన ధర్మాలు, ఆలయాలు సత్రాలు కట్టించిన కీర్తి, ఒక సామాన్య స్త్రీకి లభించడం విని కొంత అసూయ కలిగింది. ఆనాడు వార్త పత్రికలంతగా లేవు. రాజు దివాన్‌తో కలసి స్వయంగా వెళ్ళాడు. ఇరుగు పొరుగు వారి ద్వారా సీతమ్మ అన్నదాన విశేషాలు విని ఆశ్చర్య చకితులయ్యారు.

రాజావారు సీతమ్మను కలుసుకొని, "అమ్మా! మీరు చేస్తున్న అన్నదానానికి అనువుగా ఒక గ్రామాన్ని దానంగా రాసిస్తాను. దయతో అందుకోండి" అన్నారు. ఆమె సున్నితంగా తిరస్కరించింది. ఆమె మరణానంతరం, ఆమె కుమారుడు సుబ్బారాయుడుకు నలభై ఎకరాల భూమి పట్టా రాయించి, తక్కువ శిస్తుకు ఎకరాకు నాలుగురూపాయలు వంతున ఇచ్చాడు. దసరా పండుగకు సుబ్బారాయుడుకు జతపంచెలు, బహుమతిగా రూ.350 పంపించేవారు.

అన్నార్తుల ఆవేదనలను విని ఆమె తపించేది. ఒక అర్ధరాత్రి వేళలో పదిమంది కూలీలు, ఆలుపిల్లలతో వచ్చారు. "అమ్మా, ఈ రోజు కూలి పని దొరకలేదు. అందరం ఆకలితో అలమటిస్తున్నాం" అన్నారు.

వారిని విశ్రమించమని చెప్పింది సీతమ్మ. గంటసేపట్లో అన్నం, పప్పు, మజ్జిగలతో ఆమే వడ్డించింది. వారు ఎంతో ఆనందంతో ఆమెకు దండాలు పెట్టి, "నీవు చల్లగా వుండాలమ్మా" అని దీవించి తృప్తితో వెళ్లిపోయారు.

సీతమ్మ కులమతాలు పాటించని చల్లనితల్లి. గోదావరి లంకలో వెంకట్రాయుడు అనే హరిజనుడు గుడిసె వేసుకొని వుండేవాడు. గోదావరికి వరద వచ్చి లంకంతా నీటితో నిండిపోయింది. చుట్టూ నీరు. వెంకట్రాయుడు "తల్లీ, నేనిక్కడ వరదలో చిక్కుకొన్నాను నిన్నటి నుండి తిండిలేక మాడిపోతున్నాను" అంటూ కేకవేశాడు.

జోగన్న పంతులు వాడి కేకలు విన్నాడు. వెంటనే సీతమ్మను లేపాడు. తపేలానిండా పెరుగన్నం, ఊరగాయ పొట్లం, ఒక అంగవస్త్రంలో కట్టి ఇచ్చింది సీతమ్మ . జోగన్న నదిని ఈదుకుంటూ, వెంకట్రాయుడి గుడిసె చేరుకొని, అన్నం మూట అందజేశాడు. వెంకట్రాయుడు ఆనందంతో "అయ్యగారు, నా చర్మం వలిచి దానితో తమకు చెప్పులు కుట్టించి ఇచ్చినా మీ రుణం తీర్చుకోలేను" అంటూ దండం పెట్టాడు.

మరొక సమయంలో సీతమ్మ పల్లకీలో అంతర్వేది క్షేత్రానికి వెడుతూ ఒక చెట్టు నీడన విశ్రాంతి తీసుకుంది. అదే వేళ అక్కడ ఒక పెళ్ళి బృందం కూడా విశ్రాంతి తీసుకుంటూ, రాత్రి భోజనానికి మనకేం భయంలేదు. దగ్గరలోనే సీతమ్మ గారున్నారు అనుకొన్నారు. ఈ మాటల విన్న సీతమ్మ వెంటనే, తన ఇంటికి వెళ్ళింది. పెళ్ళివారు వచ్చేసరికి అన్నం సిద్దంచేసి వారికి వడ్డించింది.

సీతమ్మ ఎన్నో శుభకార్యాలకు విరాళాలిచ్చేది.

ఈమె సేవలను కలెక్టరు ద్వారా 7వ ఎడ్వర్డు చక్రవర్తి విన్నాడు. చక్రవర్తి 1903 జనవరి 7న సీతమ్మకు ప్రశంసా పత్రం పంపి లండన్‌కు ఆహ్వానించాడు. ఆమె వెళ్ళలేదు. కలెక్టరు గన్నవరంలో పెద్ద సభ ఏర్పాటు చేసి ఆమెకు ప్రశంసా పత్రాన్ని, చక్రవర్తి పంపిన బంగారు పతకాన్ని సమర్పించాడు.

డొక్కా సీతమ్మ దయామయి. బొంబాయికి చెందిన ఒక ధనవంతుని కుమారుడు చెడు సహవాసం వల్ల దొంగతనాలు చేయసాగాడు. ఒకమారు సీతమ్మ పట్టుచీర దొంగలించుకు పోతుండగా ప్రజలు పట్టుకొని వానిని చితకబాదారు. సీతమ్మ వానిని కొట్టకండి అంటూ తానే అతనికి పట్టుచీర ఇచ్చానంది. దొంగ ఆమెకాళ్ళపై పడి క్షమించమని వేడుకొన్నాడు. వాడు మారిపోయాడు.

జీవితాంతం అన్నదానం, దానధర్మాలు చేసిన సీతమ్మ 1909లో కన్ను మూసింది. గన్నవరం అక్వడెక్టుకు సీతమ్మ అక్వడెక్టు అని ప్రభుత్వం పేరు పెట్టింది. సికింద్రాబాదులోని స్టేడియం నేటికీ డొక్కాస్టేడియంగా పేరు గాంచింది.

**- జానమద్ది**

# దిద్దుబాటు

గురజాడ అప్పారావు

**"తలుపు! తలుపు"!**


**తలుపు తెరవబడలేదు. ఒక నిమిషమతడూరుకొనెను.**

**గదిలోని గడియారము టింగుమని ఒంటిగంట కొట్టినది.**

**'ఎంత ఆలస్యము చేస్తిని! బుద్ధి గడ్డితిన్నది. రేపటి నుంచి జాగ్రత్తగా ఉంటాను. యాంటినాచ్‌లా పోయి సానిదాని పాట సరదాలో మనసు లగ్నమైపోయినది. ఒక్క పాట సరదాతో కుదరలేదు, మనిషి మీద కూడా సరదా పరిగెత్తుతూంది. లేకుంటే, పోకిరి మనిషివలె పాట ముగిసిన దాకా కూర్చోవడమేమిటి? ఏదో ఒక అవకాశము కలుగజేసికొని దానితో నాలుగుమాటలు ఆడడవు ఆసక్తి ఏమి? ఇదిగో లెంపలు వాయించుకుంటున్నాను. రేపటి నుంచి మరి పాటకు వెళ్లను. నిశ్చయం. నిశ్చయం. గట్టిగా పిలిచితే కమలిని లేవగలదు. మెల్లిగా తలుపు తట్టి రాముడిని లేపగల్గితినా చడి లేకుండా పక్క చేరి పెద్దమనిషి వేషము వెయ్యవచ్చును'.**

గోపాలరావు తలుపు చేతనంటగానే రెక్క విడబారెను. 'అరె యిదేమి!' అనుకొని, రెక్క మెల్లన తెరవ, నడవలో దీపము లేదు. అంగణము దాటి తన పడక గది తలుపు తీయ, నందును దీపము లేకుండెను. చడిలేక అడుగు వేయుచు మంచము దరికి పోయి కమలిని నిద్రించుచుండెనా, మేల్కొనియుండెనాయని కనుగొన యత్నించెను గాని, యేర్పరింపలేడయ్యె. అంత జేబు నుంచి అగ్గిపెట్టి తీసి పుల్ల వెలిగించెను. మంచముపైని కమలిని కానరాలేదు. నిశ్చేష్టుడై చేతి నుండి అగ్గిపుల్ల నేల రాల్చెను. గదినీ, అతని మనస్సును కూడా చీకటి క్రమ్మెను. వెఱ్ఱి సమాధానములును మనసున పుట్టుచు గిట్టుచు వ్యాకులత కలుగచేసెను. బుద్ధి తక్కువకు తనయందో, కానరామికి కమలిని యందో యేర్పరింపరాని కోపావేశమును, చికాకును గలిగెను. నట్టి వాకిటికి వచ్చి నిలువ చుక్కలకాంతిని దాసి గాని దాసుడు గాని కనపడలేదు. వారికి తగిన శిక్ష పురియేనని గోపాలరావు నిశ్చయించెను.

తిరిగి గదిలోనికి పోయి దీపము వెలిగించి గది నలుదెసల పరికించెను. కమలిని కానరాలేదు. వీధి గుమ్మము చేరి తలుపు తెరచి చూడ చుట్ట కాల్చుచు తల యెత్తి చుక్కల పరీక్షించుచున్న రాముడు వీధి నడుమ కానవచ్చెను. పట్టరాని కోపముతో వానిని జూచి గోపాలరావు "రామా! రా!" యని పిలిచెను. రాముడు గతుక్కుమని చుట్ట పారవైచి 'బాబు' అని డగ్గరెను.



"మీ అమ్మేదిరా?"

"మా యమ్మా? యింటున్నది బాబూ."

"మీ అమ్మ కాదురా! బుద్ధిహీనుడా! నా భార్య."

"అమ్మగారా? ఎక్కడుంటారు బాబూ? పడుకున్నారు?"

"యింట్లోనే లేదు."

రాముడి గుండెలో దిగులు ప్రవేశించెను. గుమ్మములో అడుగు పెట్టగానే రాముని వీపుపై వీశ గుద్దులు రెండు పడెను, 'చంపేస్తిరి బాబూ' అని రాముడు నేల కూలబడెను.

గోపాలుడు సదయ హృదయుడు. అక్రమ మాచరించితినను, జ్ఞానము వెంటనే పొడమి ఆగ్రహావేశము దిగజారి పశ్చాత్తాపము కలిగెను. రాముని చేత లేవనెత్తి, వీపు నిమిరి పశువు వలె నాచరించితినని యనుకొనుచు గదిలోనికి తీసుకొనిపోయెను.

కుర్చీపయి కూర్చుని "రామా. ఏమాయెరా?" యని దైన్యముతోననెను.

"యేటో మాయలా ఉంది బాబూ".

"పుట్టింటికి వెళ్లియుండునా?"

"అంతవారు కారనా? బాబూ, కోపగించితే చెప్పలేను గాని ఆడారు చదువు నేరిస్తే ఏటౌతది?"

"విద్య విలువ నీకేం తెలుసురా, రామా!" అని గోపాలరావు మోచేతులు బల్లపయినాని వాని నడుమ తలయుంచి యోచించుచుండ కమలిని చేవ్రాత నొక యుత్తరము కానవచ్చును. దానిని చదువసాగెను.

"అయ్యా!"

"'ప్రియ' పోయి 'అయ్యా' కాడికి వచ్చెనా?"

"పెయ్య పోయిందా బాబూ!"

"అయ్యా! పది దినములాయె. రాత్రులు నింటికి మీ రాకయే నేనెరెగను. మీటింగులకు బోవుచుంటిమంటిరి, లోకోపకారములగు నుద్యమముల నిదుర మాని చేయుచుంటిమంటిరి. మా చెలుల వలన నిజము నేరి చ్తిని. నేనింటనుండుటను గదా మీరు కల్లలు పలుకవల సివచ్చె. నేను పుట్టింటనున్న మీ స్వేచ్ఛకు నిర్భంధమును. అసత్యమునకు అవకాశము కలుగకుండును. మీచే దినదినమును అసత్యమాడించుట కన్న మీ త్రోవకు అడ్డుగ నుండకుండుటయే, పతి మేలు కోరిన సతికి కర్తవ్యము కాదా? నేనీ రేయి కన్నవారింటికి జనియెద. సంతసింపుడు. వెచ్చముగాక ఏ పాటి మిగిలియున్నను దయ నుంచుడు."

ఉత్తరము ముగించి "నేను పశువును" అని గోపాలరావు అనెను.

"అదేమిటి బాబూ అలా శలవిస్తారు?"

"శుద్ధ పశువును!"

రాముడు అతి ప్రయత్నముచే నవ్వు ఆపుకొనెను.

"గుణవతి, విద్యానిధి, వినయ సంపన్నురాలు నా చెడు బుద్ధికి తగిన శాస్తి చేసినది".

"ఏటి చేసినారు బాబూ?"

"పుట్టింటికి వెళ్లిపోయినది గాని నీకు తెలియకుండా ఎలా వెళ్లిందిరా?"

రాముడు రెండడుగులు వెనుకకు నడిచి "నాను తొంగున్నాను కావాల బాబూ. అలక చేస్తే చెప్పచాల్నుగాని బాబూ ఆడదయి చెప్పకుండా పుట్టినారింటికి ఎల్తానంటే చెంపలాయించి కూకోబెట్టాలి గాని మొగోరిలాగ రాతలూ కోతలూ మప్పితే ఉద్దోరం పుట్టదా బాబూ?"

"ఓరి మూర్ఖుడా! భగవంతుడి సృష్టిలోకెల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్య నేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగము దేహము పంచి యుచ్చాడు. ఇంగ్లీషువాడు భార్యను బెటర్ హాఫ్ అన్నాడు. అనగా పెళ్లాము మొగుని కన్న దొడ్డది అన్నమాట. బోధపడ్డదా?"

"నాకేం బోద కాదు బాబూ!" రామునికి నవ్వు ఆపుకొనుట అసాధ్యమగుచుండెను.

"నీ కూతురు బడికి వెళ్లుతున్నది గదా! విద్య విలువ నీకే బోధపడుతుంది. ఆ మాట అలా వుండనియ్యి. కాని, నువ్వో నేనో వెంటనే బయలుదేరి చంద్రవరం వెళ్లాలి. నేను నాలుగు రోజుల దాకా వూరి నుంచి కదలడముకు వీలుపడదు. నువ్వు తాతల నాటి నౌఖరువి. వెళ్లి కమలినిని తీసుకురా. కమిలినితో ఏమి జెప్పవలెనో తెలిసిందా?

"యేటా? బాబూ! బాబు, నా యీపు పగలేసినారు, రండమ్మా అంతాను?"

"దెబ్బల మాట మరిచిపో. కొట్టినందుకు రెండు రూపాయలిస్తాను. తీసుకో మరియెన్నడూ ఆ వూసెత్తకు. కమలినితో గాని తప్పి జారి అనబోయేవు సుమా."

"అనను బాబూ!"

"నువ్వు చెప్పవలసిన మాటలు చెబుతాను, బాగా విను. 'పంతులికి బుద్ధి వచ్చింది. ఇక ఎన్నడూ సానుల పాట వినరు. రాత్రులు యిల్లు కదలరు. ఇది ఖరారు. తెలిసిందా? మిమ్ములను గెడ్డము పట్టుకుని బతిమాలుకున్నానని చెప్పమన్నారు. దయదలచి ఆయన లోపములు బయలుపెట్టక, రెండు మూడు రోజులలో రమ్మన్నారు. మీరు లేని రోజో యుగముగా గడుపుతున్నారు' అని నిపుణతగా చెప్పు తెలిసిందా?"

"తెలిసింది బాబూ!"

"ఏమని చెబుతావో నాతో వొక మాటు చెప్పు".

రాముడు తల గోకుకొనుచు "యేటా - యేటా - అదంతా నాకేం తెలదు బాబూ - నానంతాను 'అమ్మా! నా మాటినుకొండి. కాలం గడిపినోణ్ని . ఆడోరు యెజిమాని చెప్పినట్టల్లా యిని వల్లకుండాలి. లేకుంటే మా పెద్ద పంతులార్లాగ అయ్యగారు కూడా సానమ్మ నుంచుగుంతారు. మీ శెవులో మాట. పట్నంలోకి బంగార బొమ్మలాంటి సానమ్మ వొచ్చింది. మరి పంతులు మనసు మనసులో లేదు. ఆ పై మీ సిత్తం! అంతాను".

"ఓరి వెధవా!" అని గోపాలరావు కోపముతో కుర్చీ నుండి లేచి నిలిచెను.

ఊసవలె రాముడు వెలికెగెసెను.

అంతట మంచము క్రింద నుండి అమృత నిష్యందిని యగు కలకల నగవును, కరకంకణముల హృద్యారావమును విననయ్యెను.

**(నవంబర్ 30న గురజాడ వర్ధంతి సందర్భంగా, సరిగా వందేళ్ల క్రితం అంటే 1910 సంవత్సరం ఫిబ్రవరి నెలలో 'ఆంధ్రభారతి' పత్రికలో ప్రచురితమైన 'దిద్దుబాటు' కథను పునర్ముద్రిస్తున్నాము - ఎడిటర్)**

# చీడపీడలకు సస్యరక్షణ చర్యలు

ఈ సంవత్సరం మనం ఆశించినట్లుగానే మంచి వర్షాలు కురిసాయి. మొత్తం మీద రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగానే నమోదయ్యింది. ఈ ఖరీఫ్ కాలంలో పంటల విస్తీర్ణం కూడా గణనీయంగా పెరిగింది.

పంటలు బాగా పెరిగి, పైర్లు పచ్చగా వున్నప్పుడు చీడపీడల ఉనికిని, ఉధృతిని నిరంతరం గమనిస్తూ వుండాలి. చీడపురుగుల సంఖ్య నష్ట పరిమితిని దాటినప్పుడు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

ఈ కాలంలో వివిధ పంటలలో సాధారణంగా ఆశించే పురుగులు, తెగుళ్ళు, సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకుందాం.

## వరి

*కాండం తొలిచే పురుగు :* వరి పంటకు నారుమడి దశనుండి ఈనిక దశ వరకు, ఏ దశలోనైనా కాండం తొలిచే పురుగు ఆశించవచ్చు. పిలక దశలో మొవ్వ చనిపోతుంది. ఈనిక దశలో తెల్ల కంకులు వస్తాయి. 5 శాతం ఎండిన మొవ్వలు కనిపించినా లేక 1 చ॥మీ కు ఒక తల్లి పురుగు కాని, ఒక గ్రుడ్ల సముదాయం గాని కనిపించినా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.




దీనినే ఆర్థిక సహన నష్ట పరిమితి అంటారు. ఈ పరిమితి కన్నా తక్కువ నష్టం వుంటే సస్యరక్షణ చర్యలు అవసరం లేదు. నష్ట పరిమితి దాటితేనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.



మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోర్ పైరిఫాస్ 2.5 మి.లీ లేదా ఫాస్ఫామిడాన్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ప్రతిసారి ఒకే మందు చల్లకుండా, మందు మార్చి మార్చి చల్లాలి.



*ఆకు ముడత :* గొంగళి పురుగులు ఆకుముడతలో వుండే పత్రహరితాన్ని గోకి తినివేయటం వలన ఆకులు తెల్లబడతాయి. పోటాకు దశలో నష్టం ఎక్కువగా వుంటుంది. దుబ్బుకి 1 లేక 2 పురుగులు సోకిన ఆకులు కనిపిస్తే పురుగుమందులు చల్లుకోవాలి. ఆకుముడతకు సస్యరక్షణ మందులు చల్లే ముందు తాడుతో చేనుకు అడ్డంగా 2-3 సార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయి. ఆ తర్వాతనే మందులు చల్లుకోవాలి. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లీటరు నీటికి 2 గ్రా. లేక మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి 1.6 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

*తాటాకు తెగులు :* హిస్పా పురుగులు ఆశించటం వలన, ఇవి ఆకులోని పత్రహరితాన్ని గోకి తిని వేయటం వలన తెల్లటిమచ్చలు, చారలు ఏర్పడతాయి. తల్లి పెంకు పురుగులు శరీరంపై ముళ్ళు కలిగి నల్లగా వుంటాయి. పిల్ల పురుగులు ఆకు కొనల పొరల్లో వుంటాయి. ఆకులపైన తెల్లటి మచ్చలు, చారలు ఏర్పడటం వలన దీనిని తాటాకు తెగులు అని పిలుస్తుంటారు. దుబ్బుకు 2 పెంకు పురుగులు వున్నా, 2 తెగులు సోకిన ఆకులు వున్నా మందులు చల్లుకోవాలి. ప్రొఫెనోఫాస్ 2 మి॥లీ లేక క్వినాల్ ఫాస్ 2 మి॥లీ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

*పొడతెగులు లేక మాగుడు తెగులు :* ఉష్ణోగ్రత 28°-32° సెల్సియస్, గాలిలో తేమ 90 శాతం, మబ్బులతో కూడిన వర్షం, నత్రజని ఎరువులు ఎక్కువగా వాడటం- ఇలాంటి పరిస్థితులలో పొడతెగులు ఎక్కువగా వుంటుంది. దుబ్బు చేసే దశ నుండి కాండం / ఆకులపై మచ్చలు పెద్దవై పాముపొడ

మచ్చలుగా ఏర్పడుతుంది. తెగులు ఉధృతి ఎక్కువైతే పైరు పూర్తిగా ఎండిపోతుంది. 10 శాతం పిలకలు నష్టపోతే మందులు చల్లుకోవాలి. గట్లపైనా, చేలోనూ, కలుపులేకుండా చూసుకోవాలి. వారిడొమైసిన్ లీటరు నీటికి 2 మి.లీ. లేక ప్రొపికొనజోల్ 1 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**వరి పైరులో పురుగులు, తెగుళ్ళను అదుపులో వుంచటానికి కొన్ని చర్యలు తీసుకోవాలి.**

ప్రతి 2 మీ.కు 20 సెం.మీ కాలిబాటలు తీసుకోవాలి. నత్రజని ఎరువులను సిఫారసుకి మించి వేయకూడదు. హాని చేసే పురుగులు -మిత్ర పురుగుల నిష్పత్తి (2:1) గమనించాలి. సిఫారసు చేసిన మందుల ను మోతాదు ప్రకారం మాత్రమే వాడాలి. ఎకరాకు 200 లీటర్ల మందునీటిని చల్లుకోవాలి.

## వేరుశనగ

*పొగాకు లద్దె పురుగు :* పిల్ల పురుగులు గుంపులుగా వుండి ఆకులపై పత్రహరితాన్ని గోకి తినివేసి, జల్లెడ ఆకుగా మార్చివేస్తాయి. బాగా ఎదిగిన పురుగులు ఆకులను తినివేస్తాయి.

**నివారణ చర్యలు :** నత్రజని ఎరువులను ఎక్కువగా వాడకూడదు. నీటితడులు ఎక్కువగా ఇవ్వకూడదు. గుడ్ల సముదాయాన్ని, పిల్ల పురుగులను ఏరి వేయాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలి. మగ రెక్కల పురుగులు ఈ బుట్టలలో పడతాయి. 5 శాతం వేప గింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. ఎకరాకు 10 చొ॥న పక్షి స్థావరాల్ని ఏర్పాటు చేయాలి. ఎదిగిన లార్వాలకు విషపు ఎరలు తయారు చేయాలి. 5 కిలోల వరితవుడు + 1/2 కిలో బెల్లం+మెనోక్రోటోఫాస్ 500 మి.లీ. కలిపి వుండలు లాగా చేసి, సాయంత్రం పూట పొలంలో చల్లుకోవాలి. ఈ విషపు ఎరలు తిని లద్దె పురుగులు చనిపోతాయి.

*తిక్కా/ఆకుమచ్చ తెగులు :* ఆకుమచ్చ తెగులు తొలిదశలో వున్న పైరుకు ఆశించినపుడు మచ్చలు కొంచెం గుండ్రంగా వుండి, ఆకు పైభాగాన ముదురు గోధుమరంగు కలిగివుంటాయి.

ఆలస్యంగా వచ్చే ఆకుమచ్చ తెగులు మచ్చలు చిన్నవిగా, గుండ్రంగా వుండి ఆకు అడుగుభాగాన నల్లటి రంగులో వుంటాయి. కాండం మీద, ఆకు కాడల మీద, ఊడల మీద కూడా మచ్చలు ఏర్పడతాయి.

తెగులు కనిపించిన వెంటనే 200 లీటర్ల నీటిలో 400 మి.లీ. మెక్సాకొనాజోల్ లేదా 400 గ్రా. మంకోజెబ్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

## పసుపు

పసుపు పంటపై వచ్చే తెగుళ్ళలో దుంపకుళ్ళు లేక మొవ్వ కుళ్ళు తెగులు చాలా తీవ్రమైంది. పొలం నీటి ముంపునకు గురైనపుడు ఈ తెగులు ఎక్కువగా కనిపిస్తుంది. ప్రారంభంలో ఈ తెగులు పైరులో కొద్దికొద్దిగా కనిపిస్తుంది. ముందుగా ముదురు ఆకులు ఎండిపోతాయి. దుంపలు, వేర్లు కుళ్ళిపోతాయి. క్రమంగా కాండం మెత్తబడి మొక్క చనిపోతుంది. పొలం నీటి ముంపునకు గురికాకుండా చూసుకోవాలి. ఎక్కువగా వున్న నీటిని వీలైనంత త్వరగా బయటకు మళ్ళించాలి. లీటరు



నీటికి ఒక గ్రాము చొప్పున మాంకోజెబ్ కలిపి, ఈ మందు ద్రావణంతో తెగులు సోకిన మొక్కల చుట్టూ గల మట్టిని తడపాలి.

## మిరప

*పైముడత :* రెక్కల పురుగులు ఆకుల అడుగున చేరి రసాన్ని పీల్చటం వలన ఆకుల అంచులు పైకి ముడుచుకొంటాయి. ఆకులు, పిందెలు రాగి రంగులోకి మారి పూత, పిందె నిలిచిపోతుంది. కార్బరిలో 50 శాతం నీటిలో కరిగే పొడి ముందు లీటరు నీటికి 3 గ్రా. లేదా ఫసలోన్ 3 మి.లీ లేదా ఎసిఫేటు 1 గ్రాము లేదా మోనోక్రొటోఫాస్ 1.5 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పైముడతతో పాటు కింది ముడత కూడా వుంటే కార్బరిలో, ఎసిఫేట్ మందులు వాడకూడదు.

*కింది ముడత :* తెల్లనల్లి పురుగులు ఆకుల రసాన్ని పీల్చటం వలన ఆకులు క్రిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. ఆకుల కాడలు సాగి ముదురు ఆకుపచ్చగా మారతాయి. మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. నీటిలో కరిగే గంధకం లీటరు నీటికి 3 గ్రా. లేదా డైకోఫాల్ 5 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.





## సస్యరక్షణ మందుల వాడకంలో జాగ్రత్తలు

వివిధ పంటల నాశించే పురుగులు, తెగుళ్ళను అదుపులో వుంచటానికి వివిధ రకాల మందులు రైతులు వాడుతుంటారు. వీటినుంచి సత్ఫలితాలు పొందాలంటే రైతులు తప్పని సరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- ★ మందులు కొనే ముందు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణాధికారుల సలహాలు తీసుకొని వారు సిఫారసు చేసిన మందులు మాత్రమే కొనుగోలు చేయాలి.
- ★ లైసెన్సు కలిగివున్న దుకాణదారుల నుండి మాత్రమే మందులు కొనాలి.
- ★ కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. రశీదులో పురుగుమందు పేరు / కంపెనీ పేరు, బ్యాచ్ నెంబరు తదితర వివరాలు పొందుపరిచేలా చూసుకోవాలి.
- ★ డబ్బా లేదా పెట్టి మీద గడువు తేదీ చూసుకోవాలి. గడువు దాటిన మందులు కొనుగోలు చేయకూడదు.
- ★ సీలు సరిగ్గా వున్నదీ, లేనిదీ చూసుకోవాలి. కారుతున్న డబ్బాలు, సీసాలు, ప్యాకెట్‌లు కొనకూడదు.




- ★ మందులు కొని ఇంటికి తెచ్చిన తర్వాత, వాటిని వాడే లోగా, పిల్లలకు, పెంపుడు జంతువులకు అందకుండా దూరంగా వుంచాలి.
- ★ పురుగు మందుల డబ్బాల మీద ముద్రించి వుండే వివరాలు, విషపు మోతాదును సూచించే గుర్తులు మొదలైనవి చదివి చూసుకోవాలి.

## పొలంలో వాడేటపుడు జాగ్రత్తలు

- ★ పురుగు మందుల డబ్బాలు, సీసాల మూతలను నోటితో తీసే ప్రయత్నం చేయకూడదు.
- ★ సిఫారసు చేసిన మందులు, సిఫారసు చేసిన పంటలకు మాత్రమే వాడాలి.
- ★ పురుగు మందులు, తెగుళ్ళ మందులను వాసన చూసే ప్రయత్నం చేయకూడదు.
- ★ పురుగు మందులు కలపటానికి డబ్బా మూతలు, అగ్గిపెట్టె మూతలు వాడకుండా సరైన కొలతలు సూచించే వాటిని ఉపయోగించాలి.
- ★ పురుగు మందులను ఆ రోజు చల్లటానికి సరిపడా మాత్రమే కలుపుకోవాలి.
- ★ పురుగు మందులు చల్లే వ్యక్తి ఆరోగ్యంగా వుంటేనే ఆ పనికి పూనుకోవాలి. అనారోగ్యంతో వున్నా, నీరసంగా వున్నా, పురుగు మందులు చల్లకూడదు.
- ★ పురుగు మందులు చల్లే వ్యక్తి నెత్తిన టోపి, కళ్ళజోడు, పాదరక్షలు ధరించాలి.
- ★ గాలికి ఎదురుగా మందులు చల్లకూడదు.
- ★ ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మందులు చల్లుకోవాలి.
- ★ పురుగుమందులు చల్లేటపుడు పొగత్రాగటం, కిళ్ళీ నమలటం, ఆహారం తినడం లాంటివి చేయకూడదు.
- ★ పురుగు మందులు చల్లేముందు నాజిల్ సరిగా వుందో లేదో చూసుకోవాలి. నాజిల్ సరిగా లేకపోతే మందు ఒకేసారి ఎక్కువగా కారిపోతుంటుంది. నాజిల్‌ను నోటితో శుభ్రం చేయకూడదు.
- ★ పురుగు / తెగుళ్ళ మందులు శరీరంపై పడకుండా చూసుకోవాలి.
- ★ పురుగు మందులు చల్లటం పూర్తి అయిన తర్వాత చల్లిన వ్యక్తి సబ్బుతో కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకోవాలి.
- ★ మిగిలిపోయిన మందును. పెంపుడు జంతువులకు అందకుండా పారవేయాలి. ఖాళీడబ్బాలు, ప్యాకెట్‌లు గొయ్యితీసి పాతిపెట్టాలి.
- ★ మందులు చల్లిన పొలంలోకి కనీసం 7-10 రోజులు పశువులు రాకుండా చూసుకోవాలి.

ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే వాటి విష ప్రభావానికి లోనుకాకుండా వుండవచ్చు.

*- జి. విజయకుమార్, ఆకాశవాణి*


# ఆ మహనీయుల త్యాగఫలమే 'ఈదుల్ అజ్హా'



**ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలం. మంచి కోసం, మార్పు కోసం, మానవ సమాజ సాఫల్యం కోసం విప్లవించే వారికి ఇక్కడ అడుగడుగునా పరీక్షలే. అయితే పరీక్షలకు బెదిరిపోకుండా, ఎన్ని కష్టాల పర్వతాలు విరుచుకుపడినా చెక్కుచెదరని మనోనిబ్బరంతో, ఇసుమంతైనా సడలని ఆత్మవిశ్వాసంతో, మొక్కవోని ధైర్య స్థైర్యాలతో ముందుకు సాగినవారే విజయకేతనాన్ని ఎగురవేయగలుగుతారు. దీనికి చరిత్రే సాక్ష్యం.**

మానవ ఇతిహాసం కనీవినీ ఎరుగని ఇలాంటి ఓ పరీక్షా సంఘటన దాదాపు ఐదువేల సంవత్సరాలకు పూర్వం ఒకటి సంభవించింది. మానవ చరిత్రలో ఏ మనిషీ ఎదుర్కోనటువంటి పరీక్షను హ॥ ఇబ్రాహీం (అ) ఎదుర్కొన్నారు. కన్నతండ్రి ఆయన్ని ఇంట్లోంచి గెంటేశాడు. ఊరివాళ్ళు ఆయన్ని తరిమేశారు. చివరికి పాలకులు కూడా ఆయనకు అగ్నిపరీక్ష పెట్టి, దేశం నుండి బహిష్కరించారు. ఇంతకూ ఆయన చేసిన నేరం ఏమిటి? ఏ తప్పు చేస్తే తండ్రి ఆయన్ని ఇంట్లోంచి గెంటేశాడు. ఏ అఘాయిత్యం చేస్తే ఊరివాళ్ళు తరిమేశారు? ఏ నేరానికి పాల్పడితే, ఏ ద్రోహానికి ఒడిగడితే పాలకులు ఆయన్ని అగ్నిపరీక్షకు గురిచేసి దేశం నుండి బహిష్కరించారు?

ఆయన చేసిన నేరం ఏమిటంటే, తాతముత్తాతల కాలం నుండి వస్తున్న దురాచారాలను, దుస్సంప్రదాయాలను, మూఢనమ్మకాలను ఎదిరించాడు. అన్యాయాన్ని, అక్రమాలను ప్రశ్నించాడు. అవినీతికీ, అధర్మానికి ఎదురు తిరిగాడు. బహుదైవారాధన, విగ్రహారాధన మహాపాపమన్నాడు. బడుగు బలహీనవర్గాలు, పీడితబాడిత పారిశ్రామికవర్గాల గుండె గొంతుకగా మారాడు. అసభ్యం, అశ్లీలత, మద్యపానం, భ్రూణ హత్యలు, అంటరానితనం సామాజిక నేరాలన్నాడు. పుట్టుకతో ఎవరూ ఉచ్చులు నీచులు కారని, మానవులంతా సమానమేనని ప్రకటించాడు. పాలకుల అవినీతిని, వక్షపాతాన్ని, అణచివేతను, అధికార దుర్వినియోగాన్ని నిర్భయంగా ప్రశ్నించాడు. కుల మతాలు, భాషాభేదాలు, ప్రాంతీయ అసమానతలు, లింగభేదాలు, రంగురూపు తదితర అన్ని వ్యత్యాసాలకు ప్రతీతంగా మానవులందరికీ సమాన న్యాయం, సమహక్కులు కావాలని నినదించాడు.



తాతముత్తాల కాలం నుండీ కొనసాగుతూ వస్తున్న దురాచారాలను, విగ్రహారాధనను వ్యతిరేకించడాన్ని తండ్రి సహించ లేకపోయాడు. సామాజిక నేరాల జాబితాను సమాజం హర్షించలేకపోయింది. అన్యాయం, అవినీతి, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించడం పాలకులకు కంటగింపైంది. దాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. ఎంతమంది ఎన్నికష్టాలు పెట్టినా దైవంపై భారం వేసి స్థిర చిత్తంతో ముందుకు సాగారాయన. ఈ పరీక్షలు, కష్టాలు ఆయన వజ్రసంకల్పం ముందు తలవంచాయి. ఏ పరీక్షా ఆయన్ని సన్మార్గం నుండి ఇసుమంతైనా కదిలించలేకపోయింది. అన్యాయాన్ని, అవినీతిని ఎదిరిస్తూ, మూఢ నమ్మకాలను, దురాచారాలను దునుమాడుతూ, బడుగు బలహీన, శ్రామిక వర్గాలకు అండగా, మానవ సమానత్వాన్ని, దేవుని ఏకత్వాన్ని ప్రచారం చేస్తూ దేశదిమ్మరిగా జీవితం గడుపుతూ, సంకల్పించిన కార్యాన్ని సాధించారాయన.

తరువాత ఆయనకి మరోపరీక్ష ఎదురైంది. ఈసారి మానవుల నుండి, మానవ సమాజం నుండి, పాలకుల నుండి కాదు. మానవుల సృష్టికర్త నుండి, పాలకులకే పాలకుడైన సర్వాధికారి నుండి, విశ్వప్రభువు నుండి. అవును దైవం కూడా ఆయన్ని పరీక్షించదలిచాడు. ఇందులో తొలివిడతగా భార్యాబిడ్డల్ని ఎలాంటి జనసంచారంలేని ఎడారి ప్రదేశంలో వదిలేసి రమ్మని దైవం ఆయన్ని ఆదేశించాడు. హ॥ ఇబ్రాహీం(అ) ఈ పరీక్షనూ ఎదుర్కొన్నారు. దైవా దేశపాలనలో ఈ ఆజ్ఞనూ శిరసావహించారు. ఎలాంటి జనసంచారంలేని ఆ ఎడారి ప్రాంతంలో, కనీసం నాలుక తడుపుకోడానికి సైతం చుక్కనీరు లేని ఆ స్థితిలో, వారి సహన స్థైర్యాలకు, దైవంపై వారి అచంచల విశ్వాసానికి ప్రసన్నుడైన దైవం ఆ తల్లీబిడ్డల ఆకలిదప్పులు తీర్చగల ఒక నీటి చలమను ప్రత్యక్ష పరిచాడు. ఈనాడు యావత్తు ప్రపంచ ముస్లింలు తీర్థజలంగా సేవిస్తున్న ఆ ఊట బావి నీటి పేరే 'జమ్‌జమ్'. దీనికి సంబంధించి మరికొంత చరిత్ర వుంది. అది ఇక్కడ పేర్కొనడం లేదు.

తరువాత దైవం హ॥ ఇబ్రాహీం(అ)కి మరో పరీక్ష పెట్టాడు. ముందే చెప్పుకున్నట్లు ఇది మానవజాతి ఇతిహాసం కనీవినీ ఎరుగని పరీక్ష. విశ్వాస పరాకాష్టకు అనుపమాన సంకేతం ఈ పరీక్ష. ఈసారి కన్నకొడుకును దైవమార్గంలో త్యాగం చెయ్యమని దైవం ఆయన్ని ఆజ్ఞాపించాడు.

హ॥ ఇబ్రాహీం(అ) ఈ ఆదేశాన్ని కూడా సంతోషంగా తలదాల్చారు. క్షణ మాత్రం కూడా ఆలస్యం చేయకుండా దైవాదేశపాలనలో తనయుని మెడపై కత్తి పెట్టేశారు ఇబ్రాహీం. దీంతో దేవుని కారుణ్య కడలి ఉప్పొంగింది. తన ప్రియదాసుడు హ॥ ఇబ్రాహీం పట్ల ఆయన ప్రసన్నత పతాక స్థాయిలో ప్రసరించింది. 'నా ప్రియ ప్రవక్తా ఇబ్రాహీం! నువ్వు స్వప్నంలో లీలా మాత్రంగా చూసిన నా సూచనను నిజంగానే చేసి చూపించావు.

నువ్వూ, నీ తనయుడూ నా ఆజ్ఞాపాలనలో మానసికంగా సిద్ధమైన క్షణంలోనే నేను మీతో ప్రసన్నుడనయ్యాను. నా ఈ పరీక్షలో మీరు ఘనమైన ఉత్తీర్ణత సాధించారు. ఇక భౌతిక కార్యంగా మిగిలిపోయిన బలి తతంగంతో నాకసలు నిమిత్తం లేదు. ఇప్పుడు మీ విశ్వాసం పరిపూర్ణతను సంతరించుకొని, నా ప్రతి ఆ దేశపాలనలో అది నిరూపితమైంది. ఈ శుభ సందర్భంలో మీ త్యాగనిరతికి గుర్తింపుగా ఒక స్వర్గ పొట్టేలును పంపుతున్నాను' అని పలికింది దైవవాణి... అప్పుడు బాబు ఇస్మాయీల్ స్థానంలో ఆ స్వర్గ పొట్టేలును జిబహ్ చేశారు హ॥ ఇబ్రాహీం(అ).

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు జరుపుకునే 'ఈదుల్ అజ్‌హా' / 'బక్రీద్' పండుగ ఆ మహనీయుల త్యాగస్మరణే. ఇస్లామీయ క్యాలండరు ప్రకారం 'జిల్‌హజ్జ్' మాసం పదవ తేదీన ఈ పండుగ జరుగుతుంది. అదేరోజు పవిత్ర మక్కా నగరంలో 'హజ్' ఆరాధన కూడా జరుగుతుంది. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లిం జీవితంలో కనీసం ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలి. ఎందుకంటే ఇస్లామీయ మౌలిక విశ్వాసాల్లో ఇది కూడా ఒకటి. ఆర్థిక స్థోమత లేక 'హజ్' యాత్ర చేయలేనివారు పండుగ నాడు తమ తమ గ్రామాల్లోనే నమాజులు చేస్తారు. ఖుర్బానీలు ఇస్తారు. అనివార్య కారణాల వల్ల హజ్ చేయలేకపోయినా, నమాజులు ఆచరించి, ఖుర్బానీలు ఇచ్చిన వారికి కూడా దైవం హజ్ నిర్వహించిన వారితో సమానంగా పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఎందుకంటే, దైవం చిత్తశుద్ధిని, సంకల్పశుద్ధిని మాత్రమే చూస్తాడు. ఎవరు ఏ సంకల్పంతో కర్మలు ఆచరిస్తారో, ఆ ప్రకారమే ఆయన వారికి ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు. ఈ త్యాగాలకు, పరీక్షలకు, సదాచరణలకు దైవప్రసన్నత, దైవ విశ్వాసమే అసలు ప్రేరణ.

అందుకని మానవులు దేవుడున్నాడని, ఆయన ఒకే ఒక్కడని నమ్మాలి. ఈ సమస్త, చరాచర సృష్టి కేవలం ఆయన కనుసన్నలలోనే నడుస్తోందని, ఏదో ఒకనాడు ఈ సృష్టి అంతమైపోతుందని, చివరికి మానవులు నశించిపోతారని, మరణానంతరం మళ్ళీ తిరిగి లేపబడతారని, అప్పుడు సమస్త కర్మలకూ దైవం ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని విశ్వసించాలి.

మంచికి సత్ఫలితం, చెడుకు దుష్ఫలితం అనుభవించవలసి ఉంటుందన్న విశ్వాసం హృదయంలో నాటుకుపోవాలి. ఇలాంటి విశ్వాసాలు, ఇలాంటి భావనలను మానవ సమాజంలో జాగృతం చేయడానికే ఈ 'త్యాగోత్సవం'. ఇలాంటి భావనలు గనక సమాజంలో వెల్లివిరిసి నట్లయితే, ప్రజల హక్కులు హరించబడవు. పరిరక్షించ బడతాయి. హత్యలు, అత్యాచారాలు, ఎన్‌కౌంటర్‌లు ఉండవు. ప్రతి ప్రాణానికి సంపూర్ణ రక్షణ చేకూరుతుంది.



అవినీతి, అన్యాయం, అక్రమాలు, అంటరానితనం, దౌర్జన్యాలు, పీడన, అణచివేత, ఉచ్ఛనీచాలు, అసమానతలు మచ్చుకైనా కనిపించవు. మహిళలు, వితంతువులు, అనాథలు, వికలాంగులు, బడుగు బలహీన వర్గాలు, కార్మిక, కర్షక శ్రామిక తదితర అన్నివర్గాలకూ సమాన హక్కులు, సంపూర్ణ న్యాయం లభిస్తాయి. లంచగొండితనం, వరకట్న దురాచారం, మత్తు పానీయాలు, మత్తుపదార్థాల సేవనం ఆగిపోతుంది. అసలు ఒక్కటనేమిటి? సమస్త దుర్మార్గాలూ, సమస్త చెడులూ సమసిపోతాయి. ప్రజల్లో, పాలకుల్లో బాధ్యతాభావం, జవాబుదారీతనం లాంటి సుగుణాలు జనిస్తాయి.


ఈ విధంగా దైవానికి జవాబు చెప్పుకోవాలనుకునేవారు తప్పకుండా ప్రజలకూ జవాబుదారీగానే ఉంటారు. ఎట్టిపరిస్థితిలోనూ వారి హక్కుల్ని కాపాడతారు. నిజంగానే ఇలాంటి భావనలు మానవులను మంచివారుగా, సౌశీల్యవంతులుగా, పరోపకారులుగా, హక్కుల పరిరక్షకులుగా, త్యాగధనులుగా తయారు చేస్తాయనడంలో ఎలాంటి సందేహంలేదు.



కనుక శుభప్రదమైన ఈ పర్వదినాన ధనప్రాణ త్యాగాలతో పాటు మనోవాంఛల్ని కూడా త్యాగం చేయాలి. స్వార్థం, అసూయా ద్వేషాల ను త్యజించాలి. దుష్టభావనలు, దురాచారాలకు తర్పణం వదలాలి. మహనీయ ఇబ్రాహీం (అ) ఏవిధంగా అన్యాయాన్ని, అవినీతిని, అధర్మాన్ని ఈ ప్రపంచం నుండి తుడిచి వెయ్యడానికి, సత్యధర్మ సంస్థాపన కోసం ఎలాంటి పరీక్షలను ఎదుర్కొన్నారో, దైవప్రసన్నత కోసం తమ సర్వస్వాన్నే దైవమార్గంలో అర్పించడానికి ఎలా సంసిద్ధులయ్యారో, దాన్నుండి మనం స్ఫూర్తిని పొందాలి. సత్యంకోసం, ధర్మం కోసం, ధర్మ సంస్థాపన కోసం, ఆ మార్గంలో ఎన్ని కష్టనష్టాలు, పరీక్షలు ఎదురైనా సహన స్థయిర్యాలతో, ఇబ్రాహీం, ఇస్మాయీల్ ఎలాంటి త్యాగాలు చేశారో, అవసరమైతే అలాంటి త్యాగాలకు తాము కూడా సిద్ధమని చాటి చెప్పడమే ఒకరకంగా ఈ పండుగ ఉద్దేశ్యం. కనుక ఇబ్రాహీం, ఇస్మాయీల్‌ల త్యాగనిరతిని, 'హజ్' ఆరాధనలోని నిగూఢార్థాన్ని అర్థం చేసుకొని 'ఈదుల్ అజ్‌హా' / బక్రీద్ పండుగ జరుపుకుంటే నిజంగానే ఈ త్యాగోత్సవానికి అర్థమూ, పరమార్థమూ చేకూరుతుంది. దైవం మనందరి కీ ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకొనే భాగ్యం కలగజేయాలని, తద్వారా మానవ సమాజంలో మహత్తర సుగుణాలు జనించాలని కోరుకుందాం.

*- యం.డి. ఉస్మాన్‌ఖాన్*






# భారతావని భవిష్యత్తు బాలలే

## - చాచా నెహ్రూ

ప్రపంచ వ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని ప్రతి ఏటా నవంబర్ 20వ తేదీన నిర్వహిస్తుంటారు. అయితే, భారతదేశం మాత్రం ప్రతి ఏటా నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. మన ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి స్మృత్యర్థం ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.




ఎందుకంటే చిన్నారి పొన్నారి బాలలన్నా, గులాబీలన్నా నెహ్రూకి ప్రాణం. తరచూ ఆయన బాలలను గులాబీలతో, గులాబీలను బాలలతో పోల్చేవారు. ఓ తోటలోని మొగ్గల వంటివారే బాలలని ఆయన అనేవారు. అందువల్లనే, బాలలను జాగ్రత్తగా, ప్రేమగా పెంచాలని అనేవారు. దేశ భవిష్యత్తు బాలలేనని, వారే రేపటి పౌరులని పేర్కొనేవారు.

అసలు దేశానికి నిజమైన బలం బాలలేనని, సమాజానికి వారే పునాది వంటి వారని నెహ్రూ చెప్పేవారు. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే - బాలురు, బాలికల మధ్య ఆయన ఎటువంటి వ్యత్యాసం చూపేవారు కాదు. బాలురకు, బాలికలకు సమాన అవకాశాలు ఇవ్వాలని గాఢంగా కోరుకునే వారు. అద్భుతమైన విషయమేమంటే, ఆయన చిన్నారి కూతురే భారతదేశానికి మూడో ప్రధానమంత్రి అయ్యారు.




బాలలంటే ఆయనకు అంత ఇష్టం కాబట్టే, బాలలకు ఆయన 'చాచానెహ్రూ' అయ్యారు. ఆయనను పిల్లలు 'చాచా' అని ప్రేమగా పిలిచేవారు. మన దేశానికి నెహ్రూ చేసిన సేవలకు నివాళిగా, పిల్లలంటే ఆయనకి ఉన్న గాఢమైన ప్రేమకి గుర్తుగా ఆయన పుట్టిన రోజుని పెద్ద ఎత్తున 'బాలల దినోత్సవంగా' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఆ రోజున పిల్లలకు ఆటలు, పాటలు, రకరకాల పోటీలను పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహిస్తుంటారు.





అయితే, ఇంత హడావిడిలోనూ మనం ఒక విషయం మరిచి పోకూడదు. బాలల విషయంలో









చాచా నెహ్రూ ఇచ్చిన నిజమైన సందేశాన్ని మనం సదా గుర్తుంచుకోవాలి.

పిల్లలు పెరగడానికి సురక్షితమైన, ప్రేమ పూర్వకమైన వాతావరణాన్ని కల్పించటం మన ప్రాథమిక ధర్మమని, వారికి సరిపడా సమాన అవకాశాలను కల్పించాలని, తద్వారా వారు ముందంజ వేసి, దేశాభివృద్ధికి పాటుపడగలరని నెహ్రూ చెప్పేవారు.

బాలల సంక్షేమానికి, అభివృద్ధికి మనం పునరంకితం కావడానికి ఈ బాలల దినోత్సవం దోహదపడుతుంది. చాచా నెహ్రూ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం వారికి జీవితాన్ని అందించడానికి ఈ సందర్భంగా మనం మరింత పట్టుదలతో కృషి చేస్తామని ప్రతిన పూనాలి.

*- వై.సరోజ*













# పంచాయితీరాజ్ సంస్థలలో స్ఫూర్తిని నింపిన గ్రామ సభల సంవత్సరం



**దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 2009-2010 సంవత్సరాన్ని గ్రామ సభల సంవత్సరంగా ప్రకటించింది. 2 అక్టోబరు, 2009 - 2 అక్టోబరు, 2010 మధ్య సంవత్సర కాలాన్ని గ్రామ సభల సంవత్సరంగా మన రాష్ట్రం కూడా పాటించి గ్రామ సభను బలోపేతం చెయ్యటానికి పలు కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.**

**బలవంతరాయ్ మెహతా కమిటీ సూచనలను అనుసరించి పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందు వరసలో నిలిచింది. గ్రామ సభను ఆనాటి ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1964 గుర్తించినప్పటికీ, వాస్తవంగా క్షేత్రస్థాయిలో గ్రామ సభను సమర్థవంతంగా నిర్వహించిన దాఖలాలు ఇంచుమించు లేవనే చెప్పవచ్చు.**

1977లో ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టానికి సవరణ తెచ్చి, సంవత్సరానికి రెండుసార్లు గ్రామ సభను తప్పనిసరిగా నిర్వహించక పోయినట్లయితే సర్పంచ్ పదవీచ్యుతుడవుతాడనే నిబంధనను చేర్చి గ్రామ సభకు కొంతమేర జవసత్వాలను చేకూర్చే ప్రయత్నం జరిగినప్పటికీ అంతంత మాత్రంగానే ఫలితాలు వచ్చాయి. గ్రామ సభను బలోపేతం చెయ్యాలని అడపాదడపా ప్రయత్నాలు చేసినప్పటికీ, అసలు పంచాయితీ రాజ్ వ్యవస్థ మూలాలే స్థిరపడనందువల్ల ఆ ప్రయత్నాలు సఫలీకృతం కాలేదని చెప్పుకోవచ్చు.

73వ రాజ్యాంగ సవరణను అనుసరించి అమలులోకి తెచ్చిన ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994లో గ్రామ సభకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. చట్టపరంగా గ్రామ సభ నిర్వహించాల్సిన అంశాలను స్పష్టీకరించారు. గ్రామ సభను ఒక రాజ్యాంగబద్ధమైన వేదికగా గుర్తించటం జరిగింది. గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితాలో నమోదైన ఓటర్లు నేరుగా పరిపాలనలో, నిర్ణయీకరణలో, పథకాల అమలులో పర్యవేక్షణలో పాలుపంచు కోటానికి ఒక చక్కటి వేదికగా గ్రామ సభ పని చేయాలనేది రాజ్యాంగ రూపకర్తల ఆశయం. కానీ క్షేత్ర స్థాయిలో గ్రామ సభ అనేది నేటికీ ఒక ఎండమావిలా ఉందనేది అంగీకరించాల్సిన విషయం.

క్షేత్ర స్థాయిలో గ్రామ సభ ఆశించిన రీతిలో పని చేయకపోవటానికి పలు కారణాలు ఉన్నాయి. వీటిలో గ్రామ సభల నిర్వహణపై స్థానిక ప్రజా ప్రతినిధులకు స్పష్టమైన అవగాహన లేకపోవటం, గ్రామ సభను నిర్వహించినా తూతూ మంత్రంగా నిర్వహించటం, గ్రామ సభ నిర్వహణా సమాచారం ప్రజలకు ముందస్తుగా అందచేయకపోవటం, గ్రామ సభకు హాజరైతే ఒనగూరే ప్రయోజనాల పట్ల ప్రజలకు స్పష్టమైన అవగాహన లేకపోవటం వంటివి ప్రధానమైన కారణాలుగా పేర్కొనవచ్చు.

అందుకే గ్రామ సభపై ప్రజలకు అవగాహన కలుగచేసి, పరిపాలనలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు, తద్వారా పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనను ప్రజలకు అందచేయాలన్న





పుస్తకంలోని అంశాలను తమ రాష్ట్రాలకనుగుణంగా మార్చుకొని ముద్రించుకొన్న సంఘటనలు కూడా ఉన్నాయి.

## స్వాతంత్ర్య దినోత్సవాలలో అపార్డు శకటం

ఆగస్టు15, 2010 నాటి స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలలో గ్రామ సభపై 'అపార్డు' రూపొందించిన ప్రత్యేక శకటం పలువురి ప్రశంసలు అందుకున్నది. గ్రామ సభను బలోపేతం చెయ్యవలసిన అవసరాన్ని పాలకుల ముందుకు తీసుకొని రావటంలో ఇది ఒక మంచి ప్రయోగం అని చెప్పవచ్చు.

## వివిధ జిల్లాలలో గ్రామ సభ చైతన్య సభలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వివిధ జిల్లాలలో గ్రామ సభను చైతన్యం చేయటానికి వివిధ సందర్భాలలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి ప్రజలలో గ్రామ సభ పట్ల అవగాహన కల్పించటానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

తలంపుతో కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు రాష్ట్రంలో 2009-2010 సంవత్సరాన్ని గ్రామ సభల సంవత్సరంగా పాటించటం జరిగింది.

ఈ సంవత్సర కాలంలో గ్రామ సభ పట్ల ప్రజాప్రతినిధులలో, ప్రజలలో అవగాహన కలిగించటం కోసం పలు చర్యలు చేపట్టింది.

## కళాజాత బృందాలతో సాంస్కృతిక ప్రదర్శనలు

అపార్డు ప్రత్యేకంగా కళాజాత బృందాలను రూపొందించి వారికి ప్రత్యేక శిక్షణ అందచేసి, 4250 గ్రామాలలో గ్రామ సభ చైతన్య సదస్సులను నిర్వహించింది. సాంస్కృతిక శాఖ సహాయంతో జిల్లాల వారీగా నిర్వహించిన ఈ కార్యక్రమాలకు విశేషమైన స్పందన లభించింది. కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సుధీర్ కృష్ణ, బి.ఆర్.జి.ఎఫ్ ఎడ్వయిజరీ కమ్ రివ్యూ కమిటీ ఛైర్మన్ శ్రీ వి. రామచంద్రన్, శ్రీ యుగంధర్, అప్పటి ఎన్.ఐ.ఆర్.డి. డైరెక్టర్ జనరల్, ప్రస్తుత కేంద్ర గ్రామీణాభివృద్ధి కార్యదర్శి శ్రీ బి.కె. సిన్హా ల చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కళాజాత అవగాహనా కార్యక్రమం దేశవ్యాప్తంగా మన్ననలను అందుకొంది.

గ్రామ సభ అంటే ఏమిటి, ఏవిధంగా నిర్వహించాలని వివరిస్తూ అపార్డు రూపొందించిన సచిత్ర పుస్తకం 'గ్రామ సభ నిర్వచనం -నిర్వహణ' కూడా బహుళ ప్రాచుర్యం పొందింది. వివిధ రాష్ట్రాలు ఈ



వీటిలో ప్రధానంగా 8 మార్చి 2010న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా స్వయం సహాయక సంఘాలలో గ్రామసభ పట్ల అవగాహన కలుగచేయటం, 24 ఏప్రిల్ 2010



గౌ॥ డాక్టర్ అంబేద్కర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక గ్రామసభను నిర్వహించటం, ఆగస్టు 15, 2010న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో గ్రామ సభలపై ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించటం, 8 సెప్టెంబరు 2010న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని వయోజన విద్యా కార్యక్రమం, సాక్షర భారత్ అమలును ఎలా విజయవంతంగా నిర్వహించాలన్న అంశంపై గ్రామసభలో చర్చను చేపట్టటం వంటి కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారు.

గ్రామ సభల సంవత్సరాన్ని విజయవంతంగా ముగిస్తూ, 2 అక్టోబరు 2010న రాష్ట్ర వ్యాప్తంగా మరొకసారి పునరంకిత గ్రామ సభ సమావేశాన్ని నిర్వహించి, భవిష్యత్తులో గ్రామ సభను పటిష్ట పరచటానికి ఏ విధంగా చర్యలు తీసుకోవాలో చర్చలు చేపట్టటం జరిగింది. చాలా జిల్లాలలో గ్రామసభ అంశంపై చర్చ జరిగింది. పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి పిల్లలకు బహుమతులు కూడా అందచేశారు.

# గ్రామ సభ
# సందేహాలు - సమాధానాలు

**☆ గ్రామపంచాయితీ వ్యవస్థలో 'గ్రామ సభ" ప్రాముఖ్యత తెలియ జేయండి?**

పంచాయితీరాజ్ చట్టంలోని 6వ సెక్షన్ గ్రామ సభ గురించి తెలియజేస్తుంది. 'గ్రామ సభ' అనేది ఒక సమావేశం కాదు, అది కూడా గ్రామపంచాయితీ, మండల ప్రజాపరిషత్‌ల వలె గ్రామపంచాయితీలోని ఓటర్లు అందరూ సభ్యులుగా ఉండే ఒక సంస్థ. చట్ట ప్రకారం గ్రామ సభకు స్పష్టమైన అధికారాలు, విధులు ఇవ్వబడినాయి. గ్రామ పంచాయితీతోపాటు 'గ్రామ సభ' ఆవిర్భావమవుతుంది.

**☆ గ్రామసభ సమావేశం సంవత్సరానికి కనీసం ఎన్నిసార్లు జరపాలి? అలా నిర్వహించకపోతే పర్యవసానం ఏమిటి?**

సందర్భానుసారంగా గ్రామ సభ సమావేశం ఎన్నిసార్లు అయినా జరపవచ్చు. అయితే నిబంధనల మేరకు సంవత్సరానికి ప్రభుత్వం నిర్ణయించిన తేదీలలో రెండు సార్లు జరపాలి. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 న, అక్టోబరు 3 న విధిగా గ్రామ సభ సమావేశం నిర్వహించాలి. ముందస్తు ప్రణాళికతో అర్థవంతంగా స్పష్టమైన ఎజెండా ప్రకారం నిర్వహించాలి.

గ్రామ సభ పై తేదీల ప్రకారం నిర్వహించకపోయినట్లయితే, తగు అవకాశం యిచ్చి సర్పంచ్‌ని పదవి నుండి తొలగించడం జరుగుతుంది.

*(సెక్ష. 20ఎ) (జి.ఓ.యం.ఎస్.నెం..367, తేది.28.08.98)*

**☆ 'గ్రామసభ' సభ్యులు ఎవరు? గ్రామసభ సమావేశానికి ఎవరు అధ్యక్షత వహిస్తారు? సమావేశానికి కోరం ఎంత?**

గ్రామ పంచాయితీ ఓటర్ల జాబితాలో ఉన్న వయోజనులందరూ గ్రామసభ సభ్యులు. గ్రామసభ సమావేశానికి సర్పంచ్ అధ్యక్షత వహిస్తారు. సర్పంచ్ అందుబాటులో లేని పక్షంలో ఉప సర్పంచ్ అధ్యక్షత వహిస్తారు. గ్రామ సభ సమావేశాలకు 'కోరం' నిర్దేశించబడలేదు.

**☆ గ్రామసభ సమావేశాల నిర్వహణకు పంచాయితీ తీసుకోవలసిన చర్యలేమిటి?**

నిర్దేశించిన తేదీలలో (ఏప్రిల్ 14, అక్టోబరు 3) గ్రామ సభ సమావేశం నిర్వహించడానికి సంబంధిత డివిజనల్ పంచాయితీ అధికారి యం.పి.డి.ఓలతో సంప్రదించి ప్రతి గ్రామ పంచాయితీకి ఒక మండల స్థాయి అధికారిని కేటాయించాలి. సమావేశం తేదీకి వారం రోజులు ముందుగా ఈ కేటాయింపు జరగాలి.

సమావేశం సూర్యోదయం ముందు, సూర్యాస్తమయం తర్వాత జరపకూడదు.

సమావేశం గురించి గ్రామ ప్రజలందరికీ విస్తృత ప్రచారం ద్వారా తెలియజేయాలి.

గ్రామ పంచాయితీలో శివారు గ్రామాలున్నట్లయితే రొటేషన్ పద్ధతిలో అన్ని గ్రామాలలోను గ్రామసభ సమావేశాలు జరపాలి.

**☆ గ్రామ సభ సమావేశాలలో గ్రామ పంచాయితీ ప్రవేశపెట్టవలసిన అంశాలేమిటి?**

*గ్రామ సభ గ్రామ శాసనసభ వంటిది. గ్రామ సభ సమావేశాలలో ప్రవేశపెట్టవలసిన అంశాలు :*

1. గ్రామపంచాయితీ సాంవత్సరిక లెక్కలు, ఆడిట్ నివేదిక
2. గత సంవత్సరపు పరిపాలనా నివేదిక
3. చేపట్టబోయే పనుల వివరాలు
4. కొత్త పన్నులు వేయడానికి లేక ప్రస్తుతమున్న పన్నులు పెంచే ప్రతిపాదనలు.
5. లబ్ధిదారుల ఎంపిక, పథకాలు, నిర్మాణాలు చేపట్టే ప్రదేశం ఎంపిక చేసే ప్రతిపాదనలు.
6. పంచాయితీ వ్యవసాయోత్పత్తుల ప్రణాళిక
7. పంచాయితీకి దాఖలు పడిన సామూహిక భూములు, పోరంబోకు భూముల వివరాలు
8. ఆడిట్ నివేదిక నకలు, బడ్జెట్ నకలు
9. పన్నుల బకాయిదారుల జాబితా

**☆ గ్రామసభ సమావేశాల తీర్మానాల అమలులో గ్రామ పంచాయితీ బాధ్యత ఏమిటి?**

చట్టంలో నిర్దేశించిన ప్రకారం గ్రామసభ సమావేశపు తీర్మానాల అమలుకు గ్రామ పంచాయితీ అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలి. గ్రామసభలో చేసిన సూచనలు పాటించడానికి చర్యలు తీసుకోవాలి.

**☆ గ్రామసభ సమావేశం ఏర్పాటు చేయడానికి స్థానిక పౌరులు చొరవ తీసుకోవచ్చా?**

గ్రామపంచాయితీ ఓటర్లు 50 మంది లేక పంచాయితీలో 10% ఓటర్లు నిర్ణీత విషయం పరిశీలన కోసం గ్రామసభ సమావేశం ఏర్పాటు చేయమని ఐదురోజులు ముందుగా తేదీ, సమయం తెలియజేస్తూ నోటీసు ఇయ్యవచ్చును. సర్పంచ్ ఆ విధంగా గ్రామ సభ సమావేశం ఏర్పాటు చేయడానికి నిరాకరించినట్లయితే, నోటీసు జారీచేసిన సభ్యులే సమావేశం నిర్వహించి తీర్మానాలు చేయవచ్చు.

*(రూల్ 5 జి.ఓ.యం.యస్.నెం.367, తేది.28.8.98)*

**☆ ఇతర శాఖల ఏ ఏ అవసరాల కోసం గ్రామసభ సమావేశం నిర్వహించ వలసి ఉంటుంది?**

పంచాయితీరాజ్ చట్టంలో నిర్దేశించిన మేరకే కాకుండా, ఇతర శాఖల నియమ నిబంధనలకి అనుగుణంగా కూడా గ్రామసభ సమావేశం నిర్వహించవలసిన అవసరం ఉంటుంది. గ్రామస్థాయిలో ఆయా శాఖలకి సంబంధించిన విషయాల మీద అభిప్రాయ సేకరణకి, ఆమోదం కోసం గ్రామసభ సమావేశం ఏర్పాటు చేయవలసి ఉంటుంది.

1. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు పరిశీలించి సవరణ చేయడానికి
2. భారీ పరిశ్రమలు కర్మాగారాలు నెలకొల్పే ముందు పబ్లిక్ హియరింగ్ కోసం
3. వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం
4. ఉపాధి హామీ పథకం క్రింద పనుల ఎంపిక, కూలీల బడ్జెట్ తయారీ తదితర నిర్ణయాల కొరకు
5. సామాజిక తనిఖీ నివేదికలు ప్రవేశపెట్టి అభిప్రాయసేకరణ కోసం

ఈ విధంగా గ్రామపంచాయితీ చట్టం క్రింద ఏర్పాటు చేయబడిన గ్రామసభ విస్తృత పరిధిలో పనిచేస్తుంది.

*- సి.వి. రావు, కన్సల్టెంట్, అపార్డ్*



ను రూపొందించి ఆయా గ్రామాలకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపును తీసుకొని వచ్చింది.

### గ్రామ సభ సంవత్సరం ముగిసింది కానీ స్ఫూర్తినిచ్చింది

ప్రజలను చైతన్యవంతులను చెయ్యటానికి అపార్డ్ ఒక స్వచ్ఛంద కార్యకర్త వలే పనిచేయాలన్న కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ హృశికేష్ పాండా సూచనను ఇప్పటికే పాటిస్తున్న అపార్డ్ ప్రజలను చైతన్యవంతులను చెయ్యటానికి లఘు ప్రకటనలను టెలివిజన్ ద్వారా జారీ చేయటం, వార్తా పత్రికలలో ప్రకటనల ద్వారా అవగాహన కలిగించటం వంటి ప్రయత్నాలు చేసింది.

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కూడా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ, అమలు తీరుని సమీక్షించటానికి సోషల్ ఆడిట్

### దూరదర్శన్ కార్యక్రమాలు

గ్రామీణ భారత్ కార్యక్రమం ద్వారా ప్రజలలో గ్రామసభ పట్ల విస్తృతమైన ప్రాచుర్యం కల్పించటానికి కేంద్ర ప్రభుత్వ పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ, దూరదర్శన్, రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, అపార్డులు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి ప్రగతిపథంలో ఉన్న గ్రామ పంచాయితీల విజయగాథలను ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.00 గం.లకు తిరిగి సోమవారం ఉదయం 9.00 గం.లకు ప్రసారం చేస్తున్నాయి. ఈ కార్యక్రమం ఇప్పటికి విజయవంతంగా నిర్వహించబడుతోంది.



### డాక్యుమెంటరీ ఫిల్ములు

గ్రామ సభను విజయవంతంగా నిర్వహిస్తూ అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ ప్రగతిప్రధాన దూసుకుపోతున్న గంగదేవి పల్లి, పాండురంగాపురం, హాజీపల్లి, రామచంద్రాపూర్ తదితర గ్రామ పంచాయితీలపై అపార్డ్ ప్రత్యేకంగా డాక్యుమెంటరీ ఫిల్ముల ప్రక్రియలో గ్రామ సభను సమావేశపర్చి, పథక నిర్వహణ అమలులో పారదర్శకత తీసుకొని రావటానికి ప్రయత్నాలు చేస్తోంది.

ప్రభుత్వపరంగా ఎన్ని చర్యలు చేపట్టనప్పటికీ, ప్రాథమికంగా గ్రామసభలో భాగస్వాములైన ఓటర్లు చైతన్యవంతులై, రాజ్యాంగం తమకు అందించిన సాధనం ద్వారా స్థానిక పాలనను ప్రజలకు జవాబుదారీతనంగా మలచటంలో కీలకపాత్ర వహించకపోతే ఎన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేసినప్పటికీ, పథకాల ఉద్దేశ్యాలు నెరవేరే అవకాశం పూర్తిగా ఉండదు. పౌర సమాజం చైతన్యవంతమైతే పాలనలో పారదర్శకత పెరిగి, ప్రభుత్వంలో జవాబుదారీతనం కూడా వృద్ధి చెందుతుంది.




అధికారికంగా ప్రకటించిన గ్రామసభల సంవత్సర కాలం 2010 అక్టోబరు 2 తో ముగిసినప్పటికీ, ఈ స్ఫూర్తి ఎప్పటికీ ప్రజలు, ప్రజాప్రతినిధుల మదిలో నిలిచి అభివృద్ధిలో భాగస్వామ్యులౌతారని, చైతన్యవంతమైన గ్రామసభలు ఆవిర్భవమవుతాయని ఆశిద్దాం.

*– డా॥ వి. శివశంకర ప్రసాద్*






*"గ్రామ పంచాయతీల ద్వారా ప్రజలకు అధికారం"*
*- రాజీవ్‌గాంధీ*

**ప్రజలు అందరు అధికారంలో పాలుపంచుకోవడాన్నే ప్రజాస్వామ్యం అంటారు. ఒకటి అభిప్రాయం ఇంకొకరు గౌరవించడం, ఒకరికోసం అందరూ, అందరికోసం గ్రామం అనే భావన ప్రజాస్వామ్యానికి మూల సూత్రం.**

దొండ్లవాగు గ్రామానికి చాలా ప్రత్యేకతలు వున్నాయి. 1934 నుండి 1979 వరకు గ్రామం అంతా ఫ్యాక్షన్‌మయం. నిత్య ఘర్షణలు, హత్యలు, బాంబుదాడులు, వేటకొడవళ్లతో సైర్వవిహారం. గ్రామంలో ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడే వారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయం భయంగా జీవనం సాగించేవారు. తరువాత పాతతరం వ్యక్తులు చనిపోవడం, విద్యావంతులందరూ ఒకటిగా వుండి వర్గ రాజకీయాలకు స్వస్తి పలికి గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని కృతనిశ్చయంతో గ్రామాభివృద్ధికి గ్రామ ప్రజల సహకారంతో బాటలు వేసుకున్నారు.

# ఒకనాడు ఫ్యాక్షన్ గ్రామం - నేడు నిర్మల్ గ్రామం

''భారతదేశంలోని ప్రతి గ్రామంలో స్వపరిపాలనా సంస్థలో ప్రజాస్వామ్యం స్వాతంత్రాలు స్థాపించబడాలి'' అని గాంధీజీ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు పల్లెసీమలు పల్లెసీమల అభ్యున్నతికి పంచాయతీ రాజ్ వ్యవస్థ పటిష్టం. ఆశయం ఎంత గొప్పదైనా దానికి ఆచరణాత్మకమైన కార్యచరణ వుండాలి. అది కరువైతే ఎంత గొప్ప ఆశయమైనా శ్వాస కోల్పోయిన శరీరం వంటిదే.

ప్రపంచీకరణ, విశృంఖలతత్వంతో గ్రామాల మనుగడ ప్రశ్నార్ధకమైన నేటి పరిస్థితులలో ఒక సమిష్టి ఆలోచనారీతిలో గ్రామాన్ని పరిశుభ్రంగా మలిచి జాతీయ స్థాయిలో 'నిర్మల్ పురస్కార్ అవార్డు' పొందింది. కడప జిల్లా, లింగాల మండలంలోని దొండ్లవాగు గ్రామ పంచాయితీ.



ప్రస్తుతం ఇక్కడ గొడవలు, కక్షలు, అసూయ, ద్వేషం అనేవి లేవు. అందరూ వివేకవంతులు, విజ్ఞానవంతులు, చైతన్యవంతులు. అన్ని విషయాలలో ఒకటిగా వుండి, తమ గ్రామాభివృద్ధిని ఆకాంక్షించేవారు. అందుకు తమ గ్రామం దేశంలోనే ఆదర్శగ్రామంగా పేరు గడించాలి అనుకొని గ్రామపంచాయతీ పాలకవర్గం అంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

1980 నుంచి ఇప్పటి వరకు సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. ప్రస్తుత సర్పంచ్ వాసుదేవరెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదల, దీక్షతో గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే తపనతో తన పదవీకాలం నిస్వార్ధంగా, నిర్విరామంగా, నిరంతరం కృషి చేసి దొండ్లవాగు గ్రామాన్ని అన్ని గ్రామాల కంటే ముందంజలో నిలిపాడు.

- దొండ్లవాగు గ్రామస్తులు గత 20 సంవత్సరాల నుండి పోలీస్‌స్టేషన్ గుమ్మం ఎక్కిన దాఖలాలు లేవు. కేసులు కూడా లేవు. గ్రామంలోని ప్రజలందరూ ప్రశాంత జీవన మత సామరస్యంతో గడుపుతున్నారు.
- దొండ్లవాగు గ్రామంలోని అన్ని వర్ణాలు, ఉన్నత విద్యావంతులు, అందరూ అక్షరాస్యులు, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగులు ఎక్కువే.
- గ్రామంలోని అన్ని రహదారులు చక్కని సిమెంటు రహదారులు. రహదారులకు ఇరువైపుల పచ్చని చెట్లు పెంచి గ్రామం అంతా ఎంతో చూడ ముచ్చటగా వుంది. ప్రతి ఇంటికి ఒక మొక్కను నాటి

పచ్చదనాన్ని పాటిస్తున్నారు.

- గ్రామంలోని ప్రతి ఒక్కరికి పరిశుభ్రత, మలమూత్ర విసర్జన గురించి పూర్తిగా వివరించి, మహిళా మండలి సహకారంతో గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకొని మరుగుదొడ్లను 100% వినియోగించుకుంటూ బహిరంగ మలవిసర్జనను నిర్మూలించి వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా గ్రామస్తులు చర్యలు తీసుకున్నారు.
- గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ భవనంలో కూడా వ్యక్తిగత మరుగుదొడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించుకున్నారు.
- గ్రామంలోని ప్రజలందరు సమిష్టి నిర్ణయాలు తీసుకొని తమ గ్రామ అభివృద్ధికి బాటలు వేసుకున్నారు.
- గ్రామంలో ఎక్కడా బహిరంగ మలవిసర్జన లేదు.
- గ్రామంలోని ఉన్నత పాఠశాల పచ్చటి చెట్ల మధ్య విద్యార్థులకు ఆహ్లాదకరమైన బోధన జరుగుతోంది.


గ్రామ సర్పంచ్ శ్రీ వాసుదేవరెడ్డి

గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో రెండు భూఉపరితల జలాశయాలను ఏర్పాటు చేశారు. గ్రామం అంతా ప్రతి ఇంటికి పైపులైను ద్వారా నిరంతరం నీటి సదుపాయం ఉంది. ఇందిరమ్మ పథకం ద్వారా గ్రామంలోని ప్రజలు ఇళ్ళు నిర్మించుకున్నారు. గ్రామం చుట్టూ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేసుకొని రవాణా సౌకర్యం మెరుగు పరుచుకున్నారు.

గ్రామంలోని ప్రతి ఇంటికి సొంతంగా ఇంటి గృహస్తులు మురుగునీరు బయటకు పోకుండా ఇంట్లోనే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని, నీరు దానిలోనికి పోయే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా గ్రామంలో ఎక్కడా కూడా మురుగునీరు కనిపించదు.

గ్రామంలో ఎక్కడా చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గ్రామంలోని ప్రతి ఇంటికి రెండు చెత్తబుట్టలను ఇవ్వడం జరిగింది.





గ్రామంలోని ప్రతి వీధికి ఇద్దరికి బాధ్యతలు అప్పగించి వీధులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడిపించాలనే సంకల్పంతో గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా గ్రామాన్ని ఎంతో పరిశుభ్రంగా మార్చుకున్నారు. గ్రామంలో కాలుష్య నివారణకు ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటడం, రోడ్లకిరువైపుల మొక్కలు నాటడం, ప్రతి ఒక్కరు తన కర్తవ్యంగా భావించి గ్రామమంతా పచ్చని చెట్లతో వుండేలా నిర్మించుకున్నారు. గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా వుండేందుకు కృషి చేయడం, నీది నాదని తేడా లేకుండా గ్రామంలోని ప్రతి ఇల్లు పరిశుభ్రంగా వుండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించుకోవడం, ఇవన్నీ గ్రామప్రజలు తూచా తప్పకుండా పాటించడం మూలానా దొండ్ల వాగు గ్రామం ఆదర్శగ్రామంగా నిలిచింది.

గ్రామ పంచాయితీకి పక్కాభవనం ఉంది. గ్రామసభ, గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం, ప్రత్యేక సమావేశాల సందర్భంగా గ్రామపంచాయతీ పాలక వర్గం, ప్రజలు అంతా పంచాయతీ కార్యాలయంలో సమావేశమై గ్రామ అభివృద్ధికి తగు సలహాలు సూచనలు ఇస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులు 'అపార్డ్' వారు నిర్వహించే ప్రతి శిక్షణా కార్యక్రమానికి మండల కార్యాలయంలో హాజరై ఎంతో పరిణతి చెంది తమ గ్రామాభివృద్ధికి బాటలు వేసుకున్నారు.

సమిష్టికృషితో సర్పంచ్, మహిళా సంఘాలు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ అధికారులు, గ్రామంలోని ప్రజలందరి సహకారంతో ఒకటిగా వుండి తమ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా భావితరాలకు అందించింది.

అందుకే ఈ గ్రామం కేంద్ర ప్రభుత్వం నుండి 2009-10 సంవత్సరాలకుగాను నిర్మల్ గ్రామ పురస్కారం సత్కారం అందుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నుండి శుభ్రం అవార్డును అందుకున్నాయి.

ఇక్కడి గ్రామ ప్రజలు సమైక్య జీవన స్రవంతికి సంకేతంగా భారతీయ సంస్కృతికి ప్రతీకగా 'గ్రామాలు దేశాలకు పట్టుగొమ్మలు' అనే నానుడికి అర్థం వచ్చేలా ఆదర్శవంతమైన జీవనం సాగిస్తున్నారు.

ఇలాంటి స్ఫూర్తినే తీసుకొని మరెన్నో వెనుకబడిన గ్రామాలు అభివృద్ధికి బాటలు వేయాలి. గ్రామప్రజల జీవనప్రమాణాన్ని మెరుగుపరచాలి. అప్పుడే గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుంది.

*- ఏ.వి.సురేష్ కుమార్*

# మనిషికీ మనిషికీ మధ్య...

ఎ.వి.ఎస్.ఆర్. మూర్తి





**బంగాళాఖాతంలో తుపాను. ఉదయంనించీ వెర్రిగాలీ... వర్షం! వీధి తలుపు చప్పడవంతో అటు తిరిగి, "ఎవరూ" అంది కాళింది.**

**"నేనమ్మా" సుబ్బయ్యతాత గొంతు జవాబిచ్చింది. కాళింది లేచి నెమ్మదిగావెళ్లి తలుపు తీసింది. అదే అదనుగా యీదురుగాలి రివ్వునవచ్చి ఆమె ముఖాన్ని తాకింది .**

**తూర్పు ఆకాశంలో ఓ మెరుపు! దూరంగా చెరువుగట్టు మీది చెట్లన్నీ వూగిపోతున్నాయి. పొద్దుగూకి గంటైనా కాలేదు.**

**"రా తాతా" వెనక్కుతగ్గి, లోపలికొచ్చింది. సుబ్బయ్యతాత పైనున్న గుడ్డతో తల తుడుచుకుని లోపలి కొచ్చి బల్లమీద కూర్చున్నాడు. కాస్సేపు నిశ్శబ్దం తాండవం చేశాక అన్నాడు.**

**"అయ్యగారి పరిస్థితేం బాగోలేదు కాళిందీ. ఇవ్వాలో రేపో అన్నట్లుంది".**

**కాళింది మనసులో ఉరుములాంటి కలవరమేదో బయల్దేరింది.**

"రెండ్రోజులై ఆహారం లోనికి వెళ్లటం లేదు. ఇప్పుడు మందులుకూడా. ఏనాటి రుణమో పూజారిగారే అంతా చూస్తున్నారు. త్రివేది బాబుకి వార్త పంపి నాల్గురోజులవుతోంది. ఆ బాబు ఎప్పుడొచ్చునో. అంతవరకూ ఆ ప్రాణి అలా కొట్టుకులాడుతూ వుండాల్సిందేనేమో".

కాళింది నోటమాట రావటం లేదు - అచేతనంగా వింటోంది.

"ఎందరి బతుకుల్నో సక్కదిద్ది మరెందరికో బతుకుదారి సూపించిన ధర్మరాజు. ఆయనకి రావల్సిన ఆపదకాదు. బిడ్డలుంటే అవసాన దశలో ఆదుకుంటారంటారు. ఒక్కగానొక్క బిడ్డ. పువ్వులా పెంచేరు" తాత గొంతు బొంగురుబోయింది.

"రెండు రోజులై మనసంతా అక్కడ్నే వుంది తాతా. రేపు తెల్లారి నీతోబాటు నేనూ వస్తా. ఆ బాబుకి నాను చేయగలిగిన సేవ ఏదన్నావుంటే..." అంటోంది కాళింది.

"నీకా ఆతురత వుంటాదని తెలిసేవొచ్చేను తల్లీ. సరిగ్గా కళ్లు కనబడక నువ్వు, శక్తిలేక నేనూ ఆ బాబుకేం సెయ్యగలం. రుణం తీరాలంటే పది జన్మలెత్తాలి".

కాళింది కాస్సేపేం మాట్లాడలేదు. సుబ్బయ్య తాతకు లోకం తెల్సు. మంచిచెడులు తెల్సు. చదువులేదుగాని జీవితాల్లోని లోటుపాట్లని విప్పి చెప్పగల వయసూ, తెలివీ వున్నాయి.

బయట వర్షం ఆగింది. సుబ్బయ్యతాత లేచేడు. అతను వెళ్లేక ఆలోచనలో పడితే జ్ఞాపకాలు ఒక్కొక్కటీ కళ్లముందు కదాలాడేయి.

పదిహేనేళ్ల క్రితం తనింటిదీపం ఆరిపోతే తన జీవితానికో దారి చూపించేరు బాబుగారు. ఆకలి బతుకులికి అన్నంపెట్టిన చెయ్యి ఆ భూషణం బాబుది.

నిండైన విగ్రహం, గుబురు మీసాల మధ్య చెరగని చిరునవ్వు. ఆ మారాజు తన కింద పనిజేసేవార్ని పని వాళ్లుగా ఎప్పుడూ చూళ్లేదు.

ఆనాడు కరువొచ్చి వ్యవసాయ పనులుకాక వరహాపురం నించి కడుపుచేత్తో పట్టుకుని వచ్చేరు తనూ, సంగమయ్యా యీ వూరు. వచ్చీ రావడంతోనే మారాజు నీడ దొరికింది. చేతికింత పని, కడుపుకింత కూడు. అంతకంటె తమలాంటి వారికి ఏం కావాలి? నమ్మితే ప్రాణమైనా యిచ్చేస్తాడు సంగమయ్య. అటువంటి స్వామిభక్తి!

గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

"నీవల్ల యీ పని అవ్వాలి సంగమయ్య" అంటే-

"చెప్పండి దొరా" అంటూ లేచేవాడు.

తనకు బాగా గుర్తు - ఆ రోజూ యిలాగే వర్షం. తెల్లారి కాస్త తెరిపిస్తే విత్తనాల కోసం పట్నం వెళ్లిన సంగమయ్య అర్ధరాత్రి దాటినా తిరిగి రాలేదు. మర్నాడు తెల్లారే సర్కి ఊరంతా గుప్పుమందా వార్తతో. సంగమయ్య బండిని లారీ గుద్దేసింది. ఎద్దుతో పాటు సంగమయ్య కూడా చచ్చిపోయాడు. మూడురోజులపాటు శరీరంలోని రక్తమంతా నీరై కళ్లవెంట కారిందా అన్నట్లు ఏడ్చింది. అంతవరకూ మౌనంగా వున్న బాబుగారు ఆ తర్వాత పెదవి విప్పేరు.

"కాళిందీ జరగకూడనిదే జరిగిపోయింది. ఒక విధంగా దానికి కారకుడిని నేను. నీ కుటుంబాన్ని అనాధను చేసిన పాపం నాదే. అందుకు నీ కొడుకు ప్రయోజకుడై సంపాదనా పరుడయ్యే వరకూ నీ కుటుంబ బాధ్యత నాది" అన్నారు.

అప్పటికి నరహరికి నిండా పదేళ్లులేవు. అక్కడజేరిన అందరూ ఆయన పెద్దమనసుకి హర్షాన్ని ప్రకటించారు. అది - కష్టంలో చెప్పి ఆ తర్వాత మర్చిపోయే కంటితుడుపు మాటకాదు. కొన్నేళ్లపాటు రెండు జీవాల్ని ఆదుకున్న నమ్మకమైన మాట అది! పొలంపనులు తనకు చేతకావని తెల్సి అమ్మగారికి సాయంగా యింటి పనిని అప్పగించారు. అందుకు నెలనెలా కొంత జీతం ముట్టజెప్పేరు.నరహరిని స్కూల్లో జేర్పించి వాడి చదువుకీ బట్టకీ అయ్యే ఖర్చును భరించారు.

ఆ యింటి యిల్లాలు లక్ష్మీదేవమ్మ. పెట్టడంలో ఎముక లేని చెయ్యి ఆమెది.

బయటవాన హెచ్చింది. 'నరహరి వస్తే బాగుణ్ణు' అనుకుంది కాళింది. తన మనసులోని బాధను పంచుకునేందుకు మరో మనిషి అవసరమనిపించిందామెకు.

మరి కాస్సేపటికీ నరహరి వచ్చేడు. మనిషి పూర్తిగా తడిసిపోయివున్నాడు. అతగాడి స్నానం, భోజనం అయ్యేక విన్న విషయాన్ని అతనితో చెప్పింది.

"ఆ బాబు ఆపదలో మనల్ని కాపాడేడు . ఇప్పుడాయనకి ఆపదొచ్చింది. మనం చేయగలిగింది చేయకపోతే మనం మనుషుల్లో లెక్కకాదు" అంది.

నరహరికి తల్లి మాటల్లో అంతర్యం బోధపడింది.

"సరే తెల్లారివెళ్తాలే" అన్నాడు.

మరికాస్సేపటికీ నరహరి నిద్రపోయేడు. గాఢ నిద్రలో మునిగిన కొడుకు ముఖంలోకి పరీక్షగా చూసింది కాళింది.

చదువబ్బే సాగని నరహరిని కొన్నాళ్లు తన వెనకే తిప్పుకుని, వయసొచ్చాక ఓ షావుకారు దుకాణంలో నెలజీతం మీద కుదిర్చేరు బాబుగారు. నరహరి చురుగ్గా పని పట్ల శ్రద్ధచూపి అల్లుకుపోయాడు. ఇప్పుడు నలుగురిపై అజమాయిషి చేసే పనిలోకి మారేడు. జీతం పెరిగింది. మనిషీ ఎదిగేడు. అయినా ఆమె కళ్ళకి బిడ్డగానే కన్పిస్తాడు. తల్లిమాట వేదవాక్కు అతడికి.

* * * * *

తెల్లవారింది. వాన తగ్గినా ఆకాశం మీద కమ్ముకున్న మబ్బుతెరలింకా పూర్తిగా తొలగిపోలేదు. గుమ్మంలో కూర్చుని వీధిలోకి చూస్తోంది కాళింది.

చీకటింట వెళ్లిన నరహరి తిరిగిరాలేదు. 'ఒకవేళ అక్కడేదైనా జరగరానిది జరిగి...' కాళింది మనసులో ఎక్కడో శంక. ఆ ఆలోచనకే మనసు బాధగా మూల్గింది.

ఎలాగైనా బాబుగార్ని వెళ్లి చూడాలనే తహతహ ఆమెలో మొదలైంది. ఈ మధ్యకాలంలో తోడులేకుండా తనెక్కడికీ వెళ్లలేకపోతుంది. చూపు పూర్తిగా మందగించింది. అలవాటైన తన యింటి పరిసరాల్లో మాత్రం మసలగలుగుతోంది. మాటల్ని బట్టి మనుషుల్ని గుర్తు పడుతోంది.

"సుబ్బయ్యతాత వచ్చినా బాగుణ్ణు" అనుకుంది. ఏవేవో ఆలోచనలు మనసును కమ్మేస్తున్నాయి.

ఏ మనిషి బతుకూ శాశ్వతంకాదు. ఎంత బతుకుబతికి ఎన్ని చేసినా చివరికి అంతా ఆ మట్టిలో కలకాల్సిందే. చేసుకున్న దాన్నిబట్టి ఆ జీవికి పాపమో పుణ్యమో దక్కుతాయంటారు. డబ్బున్న మారాజులకి దయాగుణముండడం ఒక వరం. దయవల్లే దానం, ధర్మం. కొందరి జీవితాలకైనా ఓ దారి చూపించగలుగుతారు.

భూషణంబాబులోని ఆ దయాగుణమే నలుగురూ మెచ్చేలా చేసింది. ఆ యింటి యిల్లాలు మాత్రం ఎంత దయగల తల్లి! నరహరిని సొంత కొడుకులానే చూసుకునేది. ఆమెకు ఆడపిల్లలు కలగలేదు. ఒకే ఒక మగసంతానం... త్రివేది! దూరంగా వుండడం ఆమెకు యిష్టంలేదు. పెళ్ళిచేసి, కోడల్ని తెచ్చుకోవాలనీ వాళ్లిద్దరూ తన కళ్లముందు తిరుగాడుతూంటే చూసుకోవాలనీ ఆమె ఆశపడేది!

"నాకప్పుడే యేం పెళ్లమ్మా" అన్న త్రివేది ఏడాది తిరగకుండా అక్కడే ఓ దొరల పిల్లని పెళ్లాడి తన దారి తను చూసుకున్నాడు. ఆ దెబ్బే ఆమెను కృంగదీసింది.

చివరికామెకు పోయే ముందు కొడుకునీ, కోడల్నీ చూడాలన్న చిన్న కోరికే తీరలేదు. ఆమె గతించిన నాలుగో నాడు తప్ప త్రివేది రాలేకపోయాడు.

లక్ష్మీదేవమ్మగారు మంచానపడిన తర్వాత ఆ యింటి పనంతా తనే చేసేది. ఆమె పనులు, యింటిపనులతోపాటు వంట పనీ తనే చేసేది. రెండు పూటలా భోజనమూ, అన్నివేళలా అక్కడే వుండేందుకు వీలుగా ఇంటివెనుక పాకలో నివాసమూ ఏర్పాటయింది.

అలా ఆమె పోయిన తర్వాత కూడా కొన్నేళ్లపాటు తను, నరహరి ఆ యింటి మనుషులుగానే కలిసిపోయారు. ప్రేమాభిమానాలకు విలువ తను అక్కడే గ్రహించింది. మంచితనానికీ, మనిషితనానికీ అర్థం ఆ యింటే బోధపడింది.

సుబ్బయ్యతాత రావడంతో ఆలోచనలను ఆపి, లేచింది కాళింది. అతని ముఖంలో ఆందోళన. విన్న వార్త విన్నట్టే చెప్పేడు . భూషణంబాబు పోయారని. క్షణం సేపు మనసు కలవర పాటుకు గురైంది. ఆ వెంటనే సుబ్బయ్యతాత వెంట బయల్దేరింది. దారి పొడవునా ఆలోచనలు. వాటిల్లో కొన్ని సుబ్బయ్యతాతతోనూ పంచుకుంది.

"పంపిన వార్త అందిందో లేదో తెలీదు. అసలు అతగాడు అక్కడే వున్నాడో, మరో చోటుకి వెళ్లిపోయాడో తెలీదు. విషయం చేరవెయ్యడానికి మరో మార్గం కన్పించటంలేదు. పట్నం తీసుకెళ్లి త్రివేది వచ్చేవరకూ

[redacted]

వుంచే ఏర్పాటు చేయాలన్నా ఎన్నాళ్లు ఎదురుచూడాలో తెలీదు'' పూజారి గారి మాటలు అక్కడున్న అందరూ విన్నారు.

''తెల్సినా ఈ పనులన్నీ తెలివిగా దగ్గరుండి చేయడానికి మనలో తగిన మనుషులేరీ'' అన్నారు మున్సబుగారు.

''అటువంటప్పుడు వేళ మించిపోకుండా జరపవలసిన కార్యక్రమమేదో జరిపించడమే మంచిది. మళ్లీ తుపాను విజృంభించి వాగులూ వంకలూ పొంగినా పరిస్థితి మరింత కష్టమైపోతుంది. అందుకే అవసానదశలో కొడుకులు, సొంతమనుషులు దగ్గరుండం మంచిది అంటారు. త్రివేదివస్తే మనం యిక్కడి పరిస్థితిని వివరంగా చెప్పగలంగదా'' కరణంగారూ జోక్యం చేసుకుని తన అభిప్రాయాన్ని చెప్పేరు.

వాళ్లమాటలు విన్న కాళిందికి దుఃఖం తన్నుకొచ్చింది. ఎంత దర్జాగా బతికిన బాబుగారు. సంతానముండీ చివరికీ స్థితి...!

''ఉన్నవాళ్లలో ఆయనకు ఆత్మీయులెవరో ఆ కార్యక్రమాన్ని జరిపిస్తే బావుంటుంది ఆయన ఆత్మకూ కొంత శాంతి కలుగుతుంది. తొరగా నిర్ణయిస్తే మంచిది'' అంటున్నారు తంతు జరిపే బ్రాహ్మలు.

చుట్టూ చేరిన జనంలో గుసగుసలు మొదలయ్యాయి. సుమారొక పావుగంట గడిచినా ఒక్కరూ ముందుకు రాలేదు.

''ఊరు గొడ్డుపోయిందట్రా'' అంటున్నారు కరణంగారు.

సుబ్బయ్యతాత ఒక్కక్షణం కాళింది వంక చూసేడు. క్షణకాలం నిశ్శబ్దం తర్వాత లేచి అన్నాడు.

''జరిపించండి పంతులుగారూ. ఊరు గొడ్డుపోలేదు. అవసరానికి పనికొచ్చే మనుషులున్నారిక్కడ. కార్యక్రమాన్ని నరహరితో జరిపించండి'' అన్నాడు.

అందరూ నరహరివంక చూశారు. అతడు తల్లివంక చూశాడు. ఆమె చూపులో ఏ అర్థం గోచరించిందో అతనికి. జనంలోంచి అడుగుముందుకువేసి వచ్చేడు.

''బాగా ఆలోచించే నిర్ణయించుకున్నారా'' అడిగేరు కరణంగారు.

''ఆలోచించడనికేముందయ్యా. బాబుగోరు గొప్పగా బతికేరు. కాదనలేం. మాలాంటి ఎందరికో నీడనిచ్చి బతుకు తెరువు చూపించేరు ఆ యింటి మెతుకులు తిని పెరిగిన కండలు మావి'' అంది కాళింది లేచి.

''ఆయన కులమేంటి? మనకులమేంటి? చివరకి పనోళ్లచేత...!'' ఎవరో అంటూన్న మాటలు అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

''ఆ కులం పట్టింపులన్నీ మనలాంటి వారి కేనయ్యా. గొప్ప మనసున్న ఆ బాబుకి ఆ తేడాలు వుండేవికావు. ఆ యింట జీతానికే పనిచేసే వాళ్లమే మేము. కాదనను. అమ్మగోరు మంచానపడినపుడు ఇంటి పనితోపాటు వంటపని కూడా నన్ను చూడమన్నపుడు ఆశ్చర్యపోయేను. 'మా చేతివంట తింటారాబాబూ' అన్నాను. ఆ బాబేమన్నాడో తెలుసా-

''ఇన్నాళ్లూ మీ ఆయనచేతి పంట మాకు పనికొచ్చినపుడు నీ చేతి వంట పనికిరాదా కాళిందీ' అన్నారు. అంత గొప్ప మనసు ఆరిది'' కాళింది గొంతు గద్గదమైంది. ఆమె కళ్లలో నీరు జేరింది.

సుబ్బయ్యతాత లేచి ముందు కొచ్చేడు.

''సత్తెం చెప్పాలంటే అయ్యలారా. ఎంతో గొప్పగా దర్జాగా రాజాలా బతికిన బాబుగారికిది ఆపద సమయం. కాకపోతేటి? సిట్టసివరి రోజుల్లో కనుకున్న సంతానం కాదు గదా రక్త సంబందీకులూ, బందువులూ ఎవరూ దగ్గర లేకపోడం ఎంత దురదుష్టం? ఆ పరిస్తితి పగవాడిక్కూడ రాకూడదు.

అయితే మనిసిని మరో మనిసి ఆపదలో ఆదుకోడానికి ఆళ్ల మధ్య రక్తసంబందమే ఉండక్కరలేదు. బాబుగారు అలా ఎంతోమందిని ఆదుకున్నారు. ఎంతోమంది బతుకుల్ని సక్కదిద్దేరు. ఆళ్లందరికీ బాబుగారు దేవుడు! నేను సదూకున్నోణ్ణి కాదు. బాబుల్లారా-అయితే లోకంతీరు తెన్నులూ, మనుసుల మంచి చెడ్డలూ వయసువల్ల చూసినోణ్ణి. గుళ్లో పూజారిగారు చెప్పే పురాణ కథల్లోని ఎన్నో కొన్ని మంచి యిషయాల్ని ఒంటబట్టించుకున్నోణ్ణి. రక్త సంబందం లేకపోయినా. మనిసినీ మనిసినీ ఆ మాటకొస్తే మానవులందర్నీ కలిపే బందమొకటున్నాది బాబూ. అదే మానవత్వం! అది మనందర్లోనూ ... మనుసులందర్లోనూ కొద్దోగొప్పో వుంటాది. అది మనందర్నీ కల ఎపుకుపోయే నదిలాటిదని విన్నాను. దేవుడికిలాగే నదికీ కులమతాలు అంటవుగదా! అంచేత. . . '' అంటూ ఆగేడు సుబ్బయ్యతాత.

అక్కడున్న చాలమందిని అతని మాటలు కదిలించాయి. నిజమే అనిపించాయి. కొద్ది మందికి మాత్రం రుచించక లేచి వెళ్లిపోయారు.

పూజారిగారు సుబ్బయ్యతాత నుంచి దృష్టిని నరహరి మీదికి మరల్చారు. అతని కళ్లలో కృతజ్ఞత కన్పించింది. కార్యోన్ముఖుడై ముందుకు కదిలాడతడు.

మరి కాస్సేపట్లోనే భూషణంగారి భౌతిక కాయం మరుభూమివైపుగా సాగిపోయింది.

☆

# వెల్‌డన్ ఇండియా

**'చక్‌దే ఇండియా'. న్యూఢిల్లీలో అక్టోబరు 3 నుంచి 14 వరకు జరిగిన 19వ కామన్‌వెల్త్ క్రీడోత్సవాలు 2010 సందర్భంగా సుమారు పక్షం రోజుల పాటూ దేశం నలుచెరగులా ప్రతిధ్వనించిన నినాదం అది. ఈ క్రీడోత్సవాలు భారత్‌లో కోటానుకోట్ల మంది దృష్టిని ఆకర్షిస్తున్న సమయంలో, దేశానికి అభిమాన క్రీడ ఆటవిడుపు అయినటువంటి క్రికెట్ కూడా కొంత వెనక్కు తగ్గాల్సి వచ్చింది.**




భారతదేశపు కళా సాంస్కృతిక కౌశలాలతో పాటు, సాంకేతికంగా అధిగమించిన మహోన్నత శిఖరాలను కూడా యావత్తు ప్రపంచానికి ప్రదర్శించడానికి ఈ క్రీడల ఉపకరించాయి.

ఈ క్రీడల ప్రారంభోత్సవం ఒక కమనీయ ప్రదర్శన అనుకుంటే గనుక, ముగింపు వేడుకలను పరమాద్భుతమని వర్ణించాలి. క్రీడోత్సవాలకు ఏర్పాట్లలో జరిగిన జాప్యం, అవినీతి గురించి వెల్లువెత్తిన ఆరోపణలు, నిర్వాహకులు - క్రీడాకారుల ఆశ్రిత పక్షపాతంపై విమర్శలు ఇలాంటి వాటి నేపథ్యంలో అద్భుతమనే కితాబును కచ్చితంగా గుర్తుంచుకోవాలి. నిశిత విమర్శలతో చెలరేగిన వారంతా రాత్రికి రాత్రి చాలా సానుకూలంగా మారిపోయారు. సాక్షాత్తూ కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ చీఫ్ అయినటువంటి మైక్ ఫెనెల్, 'క్రీడల నిర్వహణ నిజంగా అద్వితీయ' మని భారత్‌ను ప్రశంసించడం చూస్తే ఇది నిజమే అనిపిస్తుంది. ఈ కితాబు ఇవ్వడానికి కొన్ని రోజుల ముందే క్రీడల నిర్వహణ ఏర్పాట్లలో జరుగుతున్న ఆలస్యాన్ని గమనించి, కామన్వెల్త్ తలరాత ఎలా తయారవుతుందోనని ఫెనెల్ అనేక సందేహాలను వెలిబుచ్చారు. క్రీడోత్సవాలు ప్రారంభమై, కొనసాగుతున్న కొద్దీ మీడియా కూడా సానుకూలంగా మారిపోయింది.

మన సంస్కృతిలోని సహనం, క్షమాగుణాలు నిజమేనని నిరూపిస్తూ... అక్టోబర్ 3వ తేదీన క్రీడోత్సవాలు ప్రారంభం అయ్యే సమయానికి మనం ఇలాంటి చేదు అనుభవాలు అన్నింటినీ పూర్తిగా మరిచిపోయాం.

కేవలం క్రీడోత్సవాలను ఎలా నిర్వహించామనే తీరు మాత్రమే కాదు... అందులో మన ఆటగాళ్లు ప్రదర్శించిన ప్రతిభా సామర్థ్యాలు కూడా కలిపి మన దేశం సగర్వంగా తలెత్తుకునేలా చేశాయి. నిస్సంశయంగా క్రీడల్లో మన అత్యుత్తమ రికార్డు ఇవే. కామన్ వెల్త్‌లోని 70కి పైగా దేశాలు మరియు టెరిటరీస్‌లలో భారత్ రెండో స్థానంలో నిలిచింది. పతకాల పట్టికలో 100 మైలురాయిని కూడా అది అధిగమించింది. ఇక్కడ మరో ఆసక్తి కరమైన అంశం ఏమిటంటే.. తెలుగు బిడ్డ శరత్ కమల్, టేబుల్ టెన్నిస్ డబుల్స్ రూపంలో ఆ 100వ పతకాన్ని భారత్‌కు అందించడం. అలాగే వ్యక్తిగతంగా సాధించిన అత్యధిక పతకాల వీరులను గమనిస్తే నాలుగు స్వర్ణాలతో మరో హైదరాబాదీ గగన్ నారంగ్ కొత్త రికార్డు సృష్టించడం ఒక విశేషం. స్వర్ణమయ ముగింపు అనేది కూడా మన సైనా నెహ్వాల్ ద్వారానే సాధ్యమైంది. పతకాల పట్టికలో భారత్‌ను మూడోస్థానం నుంచి ఆమె రెండో స్థానానికి తీసుకువెళ్లారు. గతంలో మాంచెస్టర్, మెల్‌బోర్న్‌లలో జరిగిన క్రీడోత్సవాల్లో మనం నాలుగోస్థానాన్ని మాత్రమే సాధించగలిగాం. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడాల కంటే వెనుకబడి ఉన్నాం.

ఈ క్రీడోత్సవాల్లో ఆతిథ్య దేశం 38 స్వర్ణాలతో సహా, 101 పతకాలతో మొత్తం పతకాల పట్టికలోనే గణనీయమైన పురోగతిని సాధించింది. ఈ దేశం 2006లో మెల్‌బోర్న్‌లో జరిగిన క్రీడోత్సవాల్లో 22 స్వర్ణాలతో మొత్తం 50 పతకాలు, 2002లో మాంచెస్టర్ క్రీడోత్సవాల్లో 30 స్వర్ణాలతో మొత్తం 69 పతకాలను మాత్రమే సాధించింది. అయినప్పటికీ, ఈదఫా 74 స్వర్ణ పతకాలతో మొత్తం 177 పతకాలను మూటగట్టుకున్న ఆస్ట్రేలియాకంటే వెనుకబడింది.

52 ఏళ్ల క్రీడోత్సవాల చరిత్రలో అథ్లెటిక్స్‌లోని తొలి వ్యక్తిగత స్వర్ణాన్ని సాధించడాన్ని మొత్తం భారత ప్రదర్శనలో శిఖరాయమానమైన విషయంగా చెప్పుకోవాలి. డిస్కస్ త్రోలో కృష్ణ పూనియా ఈ ఘనతను

## 19వ కామన్వెల్త్ గేమ్స్ (ఢిల్లీ-2010) - తుది పతకాల పట్టిక

| ర్యాంకు | దేశం | స్వర్ణం | రజతం | కాంస్యం | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1 | ఆస్ట్రేలియా | 74 | 55 | 48 | 177 |
| 2 | భారత్ | 38 | 27 | 36 | 101 |
| 3 | ఇంగ్లాండ్ | 37 | 59 | 46 | 142 |
| 4 | కెనడా | 26 | 17 | 32 | 75 |
| 5 | దక్షిణాఫ్రికా | 12 | 11 | 10 | 33 |
| 6 | కెన్యా | 12 | 11 | 9 | 32 |
| 7 | మలేసియా | 12 | 10 | 13 | 35 |
| 8 | సింగపూర్ | 11 | 11 | 9 | 31 |
| 9 | నైజీరియా | 11 | 10 | 14 | 35 |
| 10 | స్కాట్‌లాండ్ | 9 | 10 | 7 | 26 |
| 11 | న్యూజీలాండ్ | 6 | 22 | 8 | 36 |
| 12 | సైప్రస్ | 4 | 3 | 5 | 12 |
| 13 | ఎన్. ఐర్లాండ్ | 3 | 3 | 4 | 10 |
| 14 | సమోవా | 3 | 0 | 1 | 4 |
| 15 | వేల్స్ | 2 | 7 | 10 | 10 |
| 16 | జమైకా | 2 | 4 | 1 | 7 |
| 17 | పాకిస్తాన్ | 2 | 1 | 2 | 5 |
| 18 | ఉగాండా | 2 | 0 | 0 | 2 |
| 19 | బహామాస్ | 1 | 1 | 3 | 5 |
| 20 | శ్రీలంక | 1 | 1 | 1 | 3 |
| 21 | నౌరు | 1 | 1 | 0 | 2 |
| 22 | బోట్స్‌వానా | 1 | 0 | 3 | 4 |
| 23 | సెయింట్ విన్సెంట్ & దిగ్రెనడైన్స్ | 1 | 0 | 0 | 1 |
| 24 | కేమ్యాన్ ఐలాండ్స్ | 1 | 0 | 0 | 1 |
| 25 | ట్రినిడాడ్ & టొబాగో | 0 | 4 | 2 | 6 |
| 26 | కేమెరూన్ | 0 | 2 | 4 | 6 |
| 27 | ఘనా | 0 | 1 | 3 | 4 |
| 28 | నమీబియా | 0 | 1 | 2 | 3 |
| 29 | సీషెల్స్ | 0 | 1 | 0 | 1 |
| 30 | పాపువా న్యూగినియా | 0 | 1 | 0 | 1 |
| 31 | ఐజిల్ ఆఫ్ మ్యాన్ | 0 | 0 | 2 | 2 |
| 32 | టోంగా | 0 | 0 | 2 | 2 |
| 33 | మారిషస్ | 0 | 0 | 2 | 2 |
| 34 | సెయింట్ లూసియా | 0 | 0 | 1 | 1 |
| 35 | గయానా | 0 | 0 | 1 | 1 |
| 36 | బంగ్లాదేశ్ | 0 | 0 | 1 | 1 |
| | మొత్తం | 272 | 274 | 282 | 828 |




సాధించారు. ఆమె సహచరులైన హర్వంత్ కౌర్, సీమ ఆంథిల్‌లు రజత, కాంస్య పతకాలను సాధించడం ద్వారా ఈ ఈవెంట్‌లో భారత్ తరపున క్లీన్‌స్వీప్ చేసేశారు. ఎనిమిదేళ్ల బిడ్డలకు తల్లి అయిన 28 ఏళ్ల హర్యాన్వి ఈ విజయం ద్వారా, బెల్జియంలో టెన్నిస్ మైదానంలో 'మామ్' కిమ్ క్లియస్టర్స్ సాధించిన ఘనతను గుర్తుకు తెచ్చారు.4 × 400 మీటర్ల రిలే పోటీలలో కూడా మన్‌జీత్ కౌర్, సినిజోస్, అశ్వినీ, మన్‌మీత్ కౌర్‌లతో కూడిన మన భారత బృందం స్వర్ణాన్ని సాధించింది. తనను అర్జున అవార్డుకు ఎంపిక చేయలేదని క్రీడల శాఖ అధికారుల మీద కినుక వహించి ఉన్న సత్తి గీత కూడా... జ్యోతి హిరియూర్, పికె ప్రియ, నందా శ్రావణిలతో కలసి 4 × 400 మీటర్ల రిలేలో రజతాన్ని సొంతం చేసుకోవడం ద్వారా తన సత్తా నిరూపించుకున్నారు.

రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, షూటింగ్ విభాగాలలో మనకు గంపగుత్తగా బోలెడు పతకాలు లభించాయి. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించడంతో పాటు, ఇటీవలే మాస్కోలో జరిగిన ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల విజేతగా ఆవిర్భవించిన సుశీల్‌కుమార్ మన రెజ్లింగ్ బృందానికి సారథ్యం వహించాడు. మన మొత్తం పతకాల్లో దాదాపు అయిదో వంతుగా, ఆ బృందం మొత్తం 19 పతకాలను సాధించిపెట్టింది. మహిళా రెజర్లు కూడా మంచి ప్రతిభనే కనబరిచారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వల్లూరి శ్రీనివాసరావు 56 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్యాన్ని సొంతం చేసుకున్నారు.

షూటర్లు భారత్‌ను సగర్వగా తీర్చిదిద్దారు. హైదరాబాదుకే చెందిన గగన్ నారంగ్ పర్ఫెక్ట్ 600, రికార్డులు బద్దలుకొట్టే స్థాయిలో 703.6 పాయింట్ల సగటుతో పాటు ఏకంగా నాలుగు వ్యక్తిగత స్వర్ణ పతకాలను సాధించడం విశేషం. ఇది ఒక ప్రపంచరికార్డు. బీజింగ్ ఒలింపిక్ హీరో అభినవ్ బింద్రా, ఢిల్లీలో గగన్ ప్రాభవంలో మరుగున పడిపోయాడు. అతను 2006 క్రీడోత్సవాల్లో కూడా నాలుగు స్వర్ణపతకాలను సాధించాడు. హైదరాబాదుకు చెందిన యువ ఆశాకిరణం యాషెర్ నోరియా ట్రాప్ షూటింగ్ ఈవెంట్‌లో రజత పతకాన్ని సాధించాడు.

టెన్నిస్‌లో బరిలో భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తుందని అంతా అనుకున్నప్పటికీ అలా జరగలేదు. సోమదేవ్ వర్మన్ పురుషుల సింగిల్స్‌లో స్వర్ణం సాధించాడు. అయితే సానియా మీర్జా రజతంతోనే సంతృప్తి పడాల్సి వచ్చింది. సానియా, రష్మి చక్రవర్తిల జోడీ మహిళల డబుల్స్‌లో రజత పతకాన్ని గెలుచుకున్నారు. డబుల్స్‌లో సుప్రసిద్ధ జోడీ అయిన లియాండర్ పేస్, మహేష్ భూపతి ఆదిలోనే వెనుదిరగగా, పేస్ - సానియాల మిక్స్‌డ్ డబుల్స్ జంట కూడా ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది.

టేబుల్ టెన్నిస్‌లో మొత్తం మనకు అయిదు పతకాలు లభించాయి. ప్రపంచ టాప్ 40లో ఒకడైన శరత్ కమల్ కేవలం కాంస్యం మాత్రమే సాధించడం ద్వారా స్వదేశీ అభిమానులను నిరాశపరిచాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన కామన్వెల్త్‌లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సాధించిన శరత్ అప్పట్లో చరిత్ర సృష్టించాడు. అయితే శరత్, శుభజిత్ సాహాల జోడీ పురుషుల డబుల్స్‌లో మాత్రం స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. పౌలోమి ఘటక్, మౌమా దాస్‌ల జోడీ మహిళల డబుల్స్‌లో కాంస్యం సాధించారు.

పురుషుల హాకీ జట్టు ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను నిలువరించలేకపోవడంతో కేవలం రజతానికే పరిమితం కావాల్సి వచ్చింది. ఒకప్పట్లో ఈ క్రీడల్లో ప్రపంచాన్ని తన పాదాక్రాంతం చేసుకున్న దేశం ఈ మ్యాచ్‌లో 8-0 తేడాతో వాష్ అవుట్ అయిపోయింది. మరో సంగతి ఏమిటంటే... కామన్వెల్త్ క్రీడల విషయంలో ఇదే భారత్ అత్యుత్తమ ప్రదర్శన.

మనం ఇందులో ప్రస్తావించుకోవల్సిన మరో అంశం ఏమిటంటే... బ్యాడ్‌మింటన్ విషయంలో ఆంధ్రప్రదేశే భారత్!... భారతదేశమే ఆంధ్రప్రదేశ్. ఢిల్లీ క్రీడోత్సవాల్లో ఆ విషయం మరోమారు నిరూపణ అయింది. మలేషియాకు చెందిన వాంగ్ మ్యూ చూ చేతిలో దాదాపుగా భంగపాటు తప్పదని అనుకుంటున్న తరుణంలో సైనా నెహ్వాల్ చివరి స్వర్ణాన్ని చేజిక్కించుకున్నారు. ఓటమి అంచు వరకు వెళ్లినప్పటికీ కూడా సైనా తన ఉన్నతమైన ఆటతీరు, అనుభవంతో పుంజుకుని విజయాన్ని అందుకున్నారు. మహిళల డబుల్స్‌లో గుత్తా జ్వాల, అశ్విని పొన్నప్పల జంట కూడా స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. మరో ఆశ్చర్యకరమైన సంగతేంటంటే... పురుషుల సింగిల్స్‌లో పి. కాశ్యప్ కాంస్యాన్ని గెలుచుకోవడం. బరిలో ఉన్న టాప్ ఆటగాళ్లలో ఒకడు అయినప్పటికీ చేతన్ ఆనంద్ ఇటీవలి కాలంలో వరుసగా చాలా పేలవమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడు. ఈ విజయాలతో.... ఒకప్పటి ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాడు, జాతీయ కోచ్ అయిన పుల్లెల గోపీచంద్ కంటె ఎక్కువగా ఆనందించే వ్యక్తి మరొకరు ఉండకపోవచ్చు.

ఈ క్రీడోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ సృష్టించిన రికార్డులు ఇలా ఉన్నాయి. 6 స్వర్ణాలు (గగన్ నారంగ్ - 4, సైనా నెహ్వాల్ 1, గుత్తా జ్వాల - అశ్విని పొన్నప్ప 1), 3 రజతాలు (అషెర్ నోరియా, సానియా మీర్జా, సీ హెచ్ జిజ్ఞాస్, తృపుల్ ఛటర్జీ), 4 కాంస్యాలు (సత్తి గీత, అబ్దుల్ నజీబ్ ఖురేషి, పి. కాశ్యప్ వి. శ్రీనివాసరావు).

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా మంచి నగదు బహుమతులతో ఈ విజేతలను సముచితంగానే సత్కరించింది. స్వర్ణం విజేతలకు రూ. పదిలక్షలు, రజతపతకం విజేతలకు రూ. 7.5 లక్షలు, కాంస్య పతకం విజేతలకు రూ. 5 లక్షలు వంతున బహూకరించారు.

**- దాసు కేశవరావు** *(అనువాదం: కె.ఎస్.రెడ్డి)*

**శ్రీ** యన గౌరినా బరగు చెల్వకు చిత్తము పల్లవింభ
ద్రాయత మూర్తియై హరిహరంబను రూపము దాల్చి విష్ణు రూ
పాయ నమశ్శివాయయని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయత కిచ్చ మెచ్చు పరతత్త్వము గొల్చెదనిష్ట సిద్ధికిన్

అని తిక్కన మహాకవి ఆంధ్రమహాభారతం విరాట పర్వ ప్రారంభంలో హరిహర అద్వైత తత్త్వాన్ని ప్రకటించాడు. దీనికి కారణం సమాజ శ్రేయస్సును ఆకాంక్షించడం. శైవ వైష్ణవ వైషమ్యాలు జాతి జీవనాన్ని అతలాకుతలం చేస్తున్న సమయంలో ఆ మహాకవి చూపిన దార్శనికత ఇది. ఇదే పద్ధతిలో సర్వజనులనూ అలరించే మాసం పావన కార్తీకం. ఈ మాసం అన్ని మాసాలలోనూ ఎంతో విశిష్టమైనది. శివుణ్ణి ఆరాధించే వారికీ, విష్ణువును ఆరాధించే వారికీ ఈ మాసం పరమ పవిత్రమైనది.



# పరమ పావనం కార్తీకమాసం



మన పండుగలన్నీ సూర్య భ్రమణాన్ని బట్టి ఏర్పడుతూ ఉంటాయి. సూర్యుడు వివిధ రాశులలో ప్రవేశించినపుడూ అనేక పర్వదినాలు ఏర్పడతాయి. కానీ ఈ కార్తీక మాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంలో ఉంటాడు. అందుకే ఈ మాసం చంద్ర ప్రాధాన్యం ఉన్న మాసం అయ్యింది. కార్తీక పౌర్ణమి పరమోత్కృష్టమైనదని అటు సంప్రదాయమూ, శాస్త్రమూ ముక్త కంఠంలో ప్రకటిస్తున్నాయి.

ఈ మాసం శరదృతువు ఉత్తర భాగంలో వస్తుంది. శరత్తు మంచి వెన్నెలకు నెలవు. ప్రశాంతమైన చిత్తంలో ఈ నెలరోజులూ కార్తీక పురాణాన్ని పఠిస్తే అభీష్టాలు నెరవేరుతాయి. 'చంద్రమా మన సోజాతః' అని వేదోక్తి. మనస్పందాన కారకుడైన చంద్రుణ్ణి ఆరాధించటం ద్వారా ఇంద్రియ నిగ్రహాన్ని పొంది మోక్షార్హతను పొందవచ్చుననేది ఆధ్యాత్మిక భావన.

### విష్ణుపారమ్యం

ఈ మాసానికి అధిపతి దామోదరుడు. ఆషాఢశుద్ధ దశమినాడు శ్రీలక్ష్మీ సమేతంగా క్షీరసాగరం మీద నిద్రకు ఉపక్రమించిన అవతార విభవ స్వరూపుడైన శ్రీమన్నారాయణుడు ఈ మాసంలోనే శుద్ధ ద్వాదశినాడు మేల్కొంటాడు. ఈ సమయం నాలుగు నెలలు. ఈ నాలుగు నెలలు ముముక్షువులు దీక్ష తీసుకుంటారు. దీనినే 'చాతుర్మాస దీక్ష' అంటారు. ఈ సమయంలో దీక్ష తీసుకున్న వారు విష్ణుసాయుజ్యాన్ని పొందుతారనీ, ఏకాదశినాడు ఉపవాస దీక్షను స్వీకరించి ద్వాదశి నాడు పారణ చేసి అతిథి అభ్యాగతులకు ప్రీతి కలిగించినా ఈ ఫలితం కలుగు తుందనీ పురాణాలు పేర్కొంటున్నాయి. సామాన్య జనులు కేదారేశ్వర గౌరీ వ్రతాన్ని చేసి ఇదే ఫలితం పొందుతారు.

### శివపారమ్యం

*'శరచ్చంద్ర ప్రకాశేన వపుషా శీతల ద్యుతిమ్*
*ధ్యాయేత్ సింహాసనాసీనం ఉమాసహితం శివం గురం'*

శివుడి దేహం శరత్కాల చంద్రకిరణాల కాంతిలా ప్రకాశిస్తూ ఉంటుంది. చల్లని కాంతిని భక్తులపై కురిపిస్తూ ఉంటుంది. అటువంటి ఉమాసహితుడైన పరమేశ్వరుడికి ఈ కార్తీక మాసం పరమ ప్రీతికరమైనది. కార్తీకపౌర్ణమి శుభదినాన శివస్వరూపం అఖండ



వైభవంగా ప్రకాశిస్తుంది. అందువల్ల నమక చమకస్తోత్ర పఠనాలతో ఆ నీలకంఠుణ్ణి అర్చిస్తే సకలాభీష్టాలూ నెరవేరుతాయి. త్రిపురాసురుణ్ణి శివుడు సంహరించిన రోజు ఇదే. అందుకే ఈ కార్తిక పౌర్ణమి నాడు రాత్రంతా జాగరణ చేసి మనలో ఉండే తమోగుణాన్ని పొగొట్టుకోవాలని పెద్దల ఉవాచ.



### జానపద కార్తీకం

జానపదులకు ఈ మాసం ఎంతో ముఖ్యమైనది. ప్రకృతిని ఆరాధించే విధానంలో భాగంగానే వివిధ కాలాలలో వచ్చే ప్రాకృతిక లక్షణాలను అనుసరించి వివిధ సంప్రదాయాలు ఏర్పడ్డాయి.

కార్తీక మాసం నెలంతా ఎంతో నియమనిష్ఠలతో శివకేశవుల్ని ఆరాధిస్తారు. కార్తీక పౌర్ణమి నాడు చేసే స్నానాలు, దానాలూ జపతపాలూ ఎంతో ఫలితాన్ని ఇస్తాయి. పౌర్ణమి నాటి 'జ్వాలాతోరణోత్సవం' చూస్తే జీవితం ధన్యం. దీపం వెలిగించిన వారికి అష్టైశ్వర్యాలు లభిస్తాయని నమ్మకం. కార్తీక మాసంలోని సోమవారాలూ ఉపవసించి, హరిహరుల్ని ధ్యానించాలి. అలాగే 'ద్వాదశి' రోజున వ్రతం ఆచరించాలి. అలా ఆచరించిన అంబరీషుడు మోక్షాన్ని పొందాడు.

*'స్వప్తద్వీప విశాల భూభారము దోస్తంభంబునం బూని సం*
*ప్రాప్తశ్రీయుతుడై యశోవిభవ సంపచ్చాతురింగల్గి దు*
*ర్వ్యాప్తింబొందక వైష్ణవార్చనల మేరంగాలముం బుచ్చుచున్*
*సుప్తిం బొందక యొప్పె సుద్గుణ గరిష్ఠుండం బరీషుండిలన్'*

ఇంతటి చక్రవర్తీ ఈ ద్వాదశి వ్రతం చేసి మోక్షాన్ని పొందాడు. శ్రీహరి అంబరీష వరుదుడిగా పేరు పొందాడు.

శివకేశవులకే కాదు... శక్తిని ఆరాధించడమూ కార్తీకమాసంలో కన్పిస్తుంది. ఈ కార్తీకం వచ్చే 'శరదృతువు' ఆదిపరాశక్తి నవరాత్రులతో ప్రారంభమవుతుంది. శాక్తేయుల మతంలో 'అమ్మ' అందరికీ మూలం. త్రిమూర్తులను సృష్టించిందీ, ఆయా విధులలో నియోగించిందీ అమ్మే. అటువంటి 'అమ్మ'ను ముందు ఉపాసించి అదే శరత్తులో హరిహరుల నిద్దరినీ కార్తీకమాసంలో పూజించటం, హరిహరశక్తులకు అద్వైతభావన కలిగించటంతో పాటూ అమ్మవారి శ్రీత్వాన్ని ప్రకటించినట్లు అయ్యింది.

భౌగోళికంగానూ, ఖగోళశాస్త్ర పరంగానూ ఈ మాసానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఈ మాసంలో సూర్యుడు 'తులారాశి' లో ఉంటాడు. అప్పుడు గంగాదేవి ద్రవరూపంలో అంతటా నిండి ఉంటుంది. విష్ణుమూర్తి కూడా 'గోపాదం' మునిగేటంతటి నీటిలో సైతమూ వేంచేసి ఉంటాడని ప్రతీతి. అందువల్ల వేకువనే నిద్రలేచి నదీస్నానం ఆచరించి నిశ్చలమైన మనస్సుతో ఆరాధ్యదైవాలను ధ్యానించాలి. అందరికీ అనుకూలమైన మాసం కార్తీకం కావటం వల్లనే ఎన్నెన్నో అద్భుతాలు ఈ మాసంలోనే, ముఖ్యంగా పౌర్ణమినాడే సంభవించాయి.



త్రిపురాసుర సంహారం జరిగిందీ పౌర్ణమి రోజునే. ఈనాడే సిక్కుమత ప్రవక్త గురునానక్ జన్మదినం. సిక్కులకెంతో పవిత్ర దినం. ప్రపంచంలో ఉన్న ఒకే ఒక్క బ్రహ్మదేవాలయం 'పుష్కర్'లో ఉంది. అక్కడ ఈ కార్తీక పౌర్ణమి వేడుకల్ని అత్యంతవైభవంగా నిర్వహిస్తారు. ఒరిస్సా ప్రజలు పౌర్ణమి రోజున 'బలియాత్ర' చేస్తారు.

వెన్నెల ఆహ్లాదంతో పాటు చల్లదనాన్నీ, చల్లదనంతో పాటూ వెలుగునీ కలిగిస్తుంది. అందుకే తెలుగునాటి ఆబాల గోపాలానికీ పౌర్ణమితో కూడిన కార్తీకం ఇహ పరాలను సాధింపజేసే మాసమయ్యింది. మాసంలోని తిమిరాలను హరించి వేసే పరమజ్యోతిలా ప్రకాశిస్తోంది.

- డా॥ అద్దంకి శ్రీనివాస్



# మానవ హక్కుల రక్షణ దిశగా గ్రామాల్లో న్యాయ పంచాయితీలు

**"ప్రజాస్వామ్యంలో ప్రజలదే అత్యున్నత స్థానం, వారికి సత్వర న్యాయం అందించటమే ఆధునిక ప్రజా ప్రభుత్వాల కర్తవ్యం". భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను భారతీయుల మాగ్నా కార్టాగా అభివర్ణించవచ్చు. సామాజిక, ఆర్థిక అసమానతల నిర్మూలన, గౌరవప్రదమైన, ప్రామాణికమైన జీవనంతో పాటు సామాజిక న్యాయం, సత్వర న్యాయం ప్రజలకు అందించటం ఆధునిక సంక్షేమ రాజ్యాల విధి.**

కానీ, ఆచరణలో అది కనుచూపుమేరలో లేదు. న్యాయం మెజారిటీ గ్రామీణులైన బడుగు ప్రజలకు, బలహీనులకు, నిరక్ష రాస్యులకు అందనంత ఎత్తులో ఉంది. ధనహరణం, కాలహరణం న్యాయ వ్యవస్థను కమ్మివేశాయి. పరిపాలనాపరమైన అవరోధాలు, నిబంధనలు, పరాయి భాషలో కోర్టు వ్యాజ్యాలు, గ్రామీణ భారతీయుల ను ఆయోమయానికి గురిచేశాయి. భార్యాభర్తల తగాదాలు, చిన్న చిన్న వ్యాజ్యాలలో సైతం న్యాయం కోసం ఏళ్ళ తరబడి ఎదురు చూడాల్సి వస్తున్నది.

1989లో 11 రూపాయల కోసం దొంగతనం నేరంపై అరెస్టయిన వ్యక్తి దాదాపు సంవత్సరం పాటు విచారణ సైతం లేకుండా జైల్లో మగ్గిపోయిన కేసు సంచలనం కలిగించింది. ఈ విధంగా చూస్తే దేశంలోని 1500 జైళ్ళలో 2.5 లక్షల ఖైదీలకు మాత్రమే సదుపాయం ఉండగా, ప్రస్తుతం 3.5 లక్షల మంది ఖైదీలను ఉంచారు. వీరిలో 70 శాతం మంది విచారణ ఖైదీలు.

జనాభా ప్రాతిపదికన న్యాయమూర్తుల నియామకం అనేది అభివృద్ధి చెందిన దేశాలలో జరుగుతుంది. లక్షమంది జనాభాకు అమెరికాలో 11 మంది న్యాయమూర్తులు, బ్రిటన్‌లో 7 గురు, ఆస్ట్రేలియాలో 6 గురు ఉండగా, భారతదేశంలో కేవలం ఒక్క న్యాయమూర్తి మాత్రమే ఉన్నారు. సుప్రీం కోర్టు నుండి దిగువ కోర్టు వరకు దాదాపు 16,000 న్యాయ మూర్తుల పోస్టుల ఖాళీలు కాలహరణానికి మరింత కారణమయ్యాయి. సుప్రీం కోర్టులో 52,000, వివిధ హైకోర్టులలో 40 లక్షలు, క్రింది కోర్టులలో 2 కోట్ల 70 లక్షలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 10 లక్షల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఈ పరిస్థితి భారత రాజ్యాంగం వాగ్దానం చేసిన 'అందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, సమాన హోదా, సమాన అవకాశాలు మొదలైన మానవ హక్కులు' దేశంలో అత్యధిక జనాభా అయిన గ్రామీణులకు అందలేదన్న వాస్తవాన్ని తెలుపుతున్నది.

### ఈ పరిస్థితి మారాలంటే ఏం కావాలి?

న్యాయం సత్వరం ప్రజలకు అందుబాటులోకి రావాలంటే న్యాయ వ్యవస్థ ప్రజలకు చేరువ కావాలి. అందుకు అవసరమైన పరి పాలనా, చట్టపరమైన చర్యలు చేపట్టాలి. 1947 తరువాత భారత ప్రజలకు మెరుగైన పాలన, సత్వర న్యాయం అందించే క్రమంలో ప్రభుత్వం ఎన్నో కమిటీలను నియమించింది. 1957 లో బల్వంత రాయ్ మెహతా కమిటీ మొదలు, 1977 నాటి అశోక్ మెహతా కమిటీ మొదలైనవి గ్రామీణ న్యాయాలయాల స్థాపనను ప్రతిపాదించాయి. స్థానికంగా తలెత్తే చిన్న చిన్న తగాదాలను విచారించి పరిష్కరించటానికి అమెరికాలో రూపొందించబడిన 'పీపుల్సు కోర్టులు' సంవత్సరంలో 10 కోట్ల వివాదాలను పరిష్కరిస్తున్న తీరును గమనించిన ప్రభుత్వం గ్రామ న్యాయాలయాల స్థాపనావశ్యకతను గుర్తించింది.



2001 డిశంబరు నాటి పార్లమెంటు సమావేశాలలో గ్రామ న్యాయాలయాల స్థాపన చట్టాన్ని ఆమోదించింది. ఇటీవల ఒక న్యాయ మూర్తుల సదస్సులో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి ప్రసంగిస్తూ, ప్రజలకు మెరుగైన, సత్వర న్యాయం అందించటంలో గల సాధ్యాసాధ్యాలను వివరించారు. పనిదినాలను ఏడాదికి 210 నుండి 220కి పెంచటం, రోజుకు అరగంట చొప్పున పని గంటలను పెంచటం, విస్తృత

స్థాయిలో కంప్యూటరీకరించటం ద్వారా కోర్టులను అనుసంధానించటం మొదలైన చర్యలు చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. వాటితో పాటు గ్రామ న్యాయాలయాల స్థాపన దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వివాదాల పరిష్కారంలో ఈ గ్రామ న్యాయాలయాలు ముందుండి పైకోర్టులలో పని భారాన్ని తగ్గించగలవు.

## గ్రామ న్యాయాలయాల స్వరూపం ఏమిటి?

ప్రస్తుతం మండల కేంద్రాన్ని 20 నుండి 50 వేల జనాభా ప్రాతిపదికన విభజించారు. అలాగే ప్రతి 25 వేల జనాభా గల గ్రామ పంచాయితీ లేదా గ్రామ పంచాయతీల సముదాయానికీ ఒక గ్రామ న్యాయాలయాన్ని ఏర్పాటు చేస్తారు. అలాగే 50 వేల జనాభా గల పట్టణ ప్రాంతాలలో నగర న్యాయాలయాన్ని ఏర్పాటు చేస్తారు. ఒక కోర్టు నుండి మరో కోర్టుకు భౌగోళిక పరిధి 10 కిలోమీటర్లు మాత్రమే ఉండాలి. అవసరాన్ని బట్టి ఈ న్యాయాలయాలు, సంచార న్యాయాలయాలుగా కూడా పనిచేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌కు 5,000 గ్రామ న్యాయాలయాలు మంజూరు చేస్తున్నట్లు కేంద్ర న్యాయ శాఖా మంత్రి ప్రకటించారు.



## న్యాయమూర్తిగా ఎవరు ఉంటారు ?

ఈ గ్రామ న్యాయాలయాలలో న్యాయ మూర్తులను క్రింది వర్గాల నుండి జిల్లా న్యాయమూర్తి నియమిస్తారు.


* మాజీ న్యాయ మూర్తులు * మాజీ ఉన్నతాధికారులు
* న్యాయ పట్టభద్రులు * ప్రముఖ సంఘసేవకులు

## వయో పరిమితి ఎంత ఉండాలి ?

గ్రామ న్యాయాలయాలలో న్యాయమూర్తులుగా నియామకం కాబోయే వ్యక్తులకు 45 సంవత్సరాలపైబడి ఉండాలి.

## ఇతర అర్హతలు ఏమిటి ?

* ఏ రాజకీయ పార్టీలోనూ సభ్యత్వం ఉండకూడదు.
* కుల, మత సంస్థలు, సంఘాలలో క్రియాశీల పాత్ర పోషించరాదు.
* మానసికంగా ఆరోగ్యవంతులై ఉండాలి.
* ఎటువంటి గత నేర చరిత్ర ఉండరాదు.



## న్యాయమూర్తి కాలపరిమితి ఎంత ?

గ్రామ న్యాయాలయాలలో పనిచేసే న్యాయమూర్తి కాల పరిమితి 3 సంవత్సరాలు

## గ్రామ న్యాయాలయాల న్యాయమూర్తుల అధికారాలేమిటి?

తాలూకా కోర్టులలోని న్యాయమూర్తులకు ఉండే అధికారాలన్నీ గ్రామ న్యాయాలయాల న్యాయ మూర్తులకు ఉంటాయి. తమ పరిధిలోని రెవెన్యూ, పోలీసు శాఖలు ఈ కోర్టులకు సహకారాలందించాల్సి ఉంటుంది.

## వివాదాల పరిష్కారాల కాల పరిమితి ఎంత?

కేసు స్వరూపాన్ని బట్టి, స్వభావాన్ని బట్టి, న్యాయమూర్తి తన వద్దకు వచ్చిన వివాదాన్ని పరిష్కరిస్తారు. న్యాయమూర్తి ఫిర్యాదు అందినరోజే తీర్పు వెలువరించవచ్చును. అయితే గరిష్టంగా (90) రోజులలో అట్టి వివాదం పరిష్కరించబడాలి.

## కేసుల పరిధి ఎలా ఉంటుంది?

గామ న్యాయాలయాలలో సివిల్, క్రిమినల్ కేసులు విచారణకు స్వీకరించబడతాయి. లక్షరూపాయల విలువకు మించని సివిల్ తగాదాలు, ఏడాదికి మించని జైలు శిక్షను విధించే క్రిమినల్ కేసుల విచారణను ఈ గ్రామ న్యాయాలయాలలో స్వీకరించవచ్చును. కేసుల పరిధి క్రింది విధంగా ఉంది.

## సివిల్ కేసుల పరిధి

* లక్ష రూపాయలలోపు నగదు వివాదాలు.
* కూలీల కనీస వేతనాలు, అంటరానితనం, వెట్టి చాకిరీలకు సంబంధించి ఫిర్యాదులు.
* యజమాని, కౌలుదారు వివాదాలు
* క్రయ విక్రయ దావాలు
* పంట కాలువలు, నీటి నిల్వలు, బోర్లు, రహదారుల, సరిహద్దుల వివరాలు
* రెవెన్యూ పత్రాలు, ఆస్తి వివాదాలు.
* భార్యా, పిల్లలు, తల్లి దండ్రులకు చెల్లించాల్సిన భరణం, గృహ హింసపై ఫిర్యాదులు.
* పశుయాజమానుల నిర్లక్ష్య, అటవీ ఉత్పత్తుల దుర్వినియోగం

## క్రిమినల్ కేసుల పరిధి

*గ్రామ న్యాయాలయాల చట్టం సెక్షన్ 25 ప్రకారం . . .*

* ప్రభుత్వ అధికారులను అడ్డుకోవటం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించటం.
* 25వేల రూపాయలకు మించని దొంగతనాలు.
* 10 నుండి 50 రూపాయల విలువ చేసే జంతువులను హింసించటం, చంపటం.
* 50 రూపాయల వరకూ నష్టం కల్గించటం.
* వ్యవసాయ భూములకు నష్టం కల్గించడం, నీటిని దారి మళ్లించటం.
* రోడ్లు, వంతెనలను ధ్వంసం చేయటం, నష్టం కలిగించటం.
* పౌర పారిశుద్ధ్యం, డ్రైనేజీలను ఆటంకపరచటం.
* భార్యా పిల్లలు, తల్లిదండ్రుల పోషణను నిరాకరించటం.
* పశువుల అపహరణ, పోషణలో నిర్లక్ష్యం.
* భారత శిక్షాస్మృతి సెక్షన్ 323, 324, 332, 353, 379, 427, 428, 429, 430, 431, 432, 504 ప్రకారం శిక్షార్హమైన నేరాలు, సి.పి. సి. సెక్షన్ 125 సంబంధించిన భరణం.

## ఫిర్యాదు ఎలా చేయాలి ?

బాధితులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగానూ, రాతరానివారు మౌఖికంగానూ కూడా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చును. ఈ ఫిర్యాదు నమోదుకై 10 రూపాయల రుసుం చెల్లించాల్సి ఉంటుంది. న్యాయవాదిని నియమించుకోవాల్సిన నిబంధన లేదు.

## వాదోపవాదాలు ఏ భాషలో ఉంటాయి?

గ్రామ న్యాయాలయాలలో వాదోపవాదాలు, కోర్టు వ్యవహారాలు అన్నీ స్థానిక భాషలోనే జరగాలి. ఇది ఈ చట్టంలోని ప్రధాన నియమం గానూ, భారత న్యాయ చరిత్రలో నూతన మైలు రాయిగానూ పరిగణించ వచ్చును.

*గ్రామ న్యాయాలయాలలోని తీర్పునే తుదిగా పరిగణించాలా?*



కాదు. గ్రామ న్యాయాలయాల ఏర్పాటు అనేది పౌరులకు మెరుగైన, సత్వరమైన న్యాయం అందించే ఒక ప్రగతిశీల ఏర్పాటు. భారత రాజ్యాంగం వాగ్దానం చేసిన మెరుగైన పరిపాలన, సుఖశాంతుల సమాజం, అందరికీ సమాన అవకాశాలు, హక్కుల రక్షణ దిశగా ఇది ఒక బృహత్తర ప్రయత్నం.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగపు 11వ షెడ్యూలులో పొందుపరిచిన, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994 లోని సెక్షన్ 45, 46 ప్రకారం పంచాయితీలు నిర్వహించాల్సిన పౌర సదుపాయాల, సంక్షేమ విధులు మొదలైన వాటితో పాటు కాలానుగుణంగా భారత ప్రభుత్వం మానవ హక్కుల రక్షణ దిశగా రూపొందిన అభివృద్ధి పథకాలు, చట్టాలు గ్రామీణ జనానికి చేరువ కాలేక పోవటానికి గల వైఫల్యాలను సరిదిద్దే ప్రయత్నంలో భాగంగానే ఈ ఏర్పాటును చూడాలి.

గ్రామ న్యాయాలయాలలో తమకు న్యాయం జరగలేదని భావించిన వారు జిల్లా కోర్టులో పై అప్పీలు చేసుకోవాలి.

## ముగింపు

73వ రాజ్యాంగ సవరణకు ముందు పంచాయితీ రాజ్ సంస్థలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అభీష్టం మేరకు వ్యవహరించాయి. 73వ రాజ్యాంగ సవరణ ఈ స్థానిక ప్రభుత్వాల రూపురేఖల్ని మార్చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాదిరిగానే స్థానిక ప్రభుత్వాలు కూడా రాజ్యాంగ బద్ధతను సంతరించుకున్నాయి. రాజ్యాంగంలో వాగ్దానం చేసిన ప్రాథమిక హక్కుల్ని, ఆదేశిక సూత్రాల్ని మానవ హక్కుల రక్షణకై చేయబడిన ఏర్పాటుగా భావించారు. అయితే వాటి అమలుకై చేసిన చట్టాలు, వాటిని ఆచరించాల్సిన వ్యవస్థలు సామాన్యుల పట్ల సానుకూలంగా వ్యవహరించినప్పుడు, ఆదుకోవాల్సిన న్యాయ వ్యవస్థ కూడా సామాన్యులకు అందనంతగా భారమైపోయింది.

న్యాయ వ్యవస్థలో కింది స్థాయిలో నిర్మాణం లేకపోవటం, దూరాభారాలు, ఆంగ్లంలో లావాదేవీలు, జాప్యం మొదలైన కారణాల వల్ల రాజ్యాంగం వాగ్దానం చేసిన సమాన అభివృద్ధి, సమాన అవకాశాలు అందరికీ కాక, కొందరికే అనే చందంగా వ్యవస్థ తయారైంది. సమాజంలోని ప్రతీ పౌరుడు రాజ్యాంగం ద్వారా దఖలు పరచబడిన రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం, సమాన హోదా అందరికీ చేరకపోవటం మానవ హక్కుల ఉల్లంఘన గానే వై.వి. శర్మ ( హ్యూమన్ రైట్స్ ఇన్ ఇండియా 1995) చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994 సెక్షన్ 45, 46లలో చెప్పబడిన బాధ్యతలుగానీ, 80 నుండి 140 వరకూ ప్రజా సంక్షేమం, ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలుగానీ సెక్షన్ 161 నుండి 168, 184, 192, 199 వరకూ 268 నుండి 271 మరియు 11వ షెడ్యూలులోని 29 అంశాలు మొదలైనవి మానవ హక్కుల రక్షణకై ఏర్పాటు చేయబడినవే. వాటి అమలులోని జాప్యాన్ని నివారించే క్రమాన్ని అమలు వేగవంతం చేసే దిశగా చేసిన ప్రయత్నంగా ఈ గ్రామ న్యాయాలయాల స్థాపనను చెప్పుకోవచ్చు.

*- ఎ. గవర్రాజు, ఫ్యాకల్టీ*
*ఇ.టి.సి. - రాజేంద్రనగర్*

# వచ్చే శతాబ్దపు తెలుగు కవితా రీతులు

**సాహితీ జోస్యం**

***భవిష్యత్ జీవితాన్ని గురించి చెప్పవచ్చిన జ్యోతిష్యుడు భూతకాల సంఘటనలను కొన్నింటిని చెప్పి మన మానసాలను ఆకట్టుకోవడం జరుగుతుంది. అలాగే సాహిత్యపరంగా ఆ గతాన్ని వూహించడానికి ముందు గతాన్ని అవలోకనం చేయడం అవసరం. భాష సజీవమైంది. సమాజంలాగే సాహిత్యం పరిణామశీలి. వేయి సంవత్సరాల సాహిత్య పరిణామ క్రమాన్ని బట్టి రాబోయే శతాబ్దిలో దాని నడక ఎలా వుంటుందో వూహించాలని ప్రయత్నం.***

## పురాణయుగం

నన్నయ్యకు పూర్వమే తెలుగులో పల్లెపాటలు, శాసనాలు వున్నట్లు దాఖలాలు వున్నాయి. శాసనభాష కన్నడానికి చేరువలో వున్న ప్రాకృతభాష అని పరిశోధకులు తేల్చారు. సంస్కృత వాక్యాలతో నిండిన తెలుగు రచనలు 'మణి ప్రవాళములు' వెలిసినాయి.

[redacted] 11వ శతాబ్దిలో మహాభారతం ద్వారా తెలుగు భాషను నన్నయ ఆవిష్కరించారు. అప్పటికి [redacted] ప్రామాణిక గ్రంథాలు [redacted] కావ్యరచనకు కావల్సిన విపుల [redacted] సామాగ్రిని తానే నిర్మించుకుని [redacted] నన్నయ్య రచనలో [redacted] వంతులు సంస్కృత ప్రాబల్యం [redacted], ఒక వంతు మాత్రమే తెలుగు. [redacted] ద్వితీయుడు. అద్వితీయుడైన తిక్కనలో ఈ నిష్పత్తి తారుమారైంది. నన్నయ్య గారి పద్మవ్యూహాన్ని తిక్కనగారు 'తమ్మిమొగ్గరం' చేశారు. వీరిద్దరి రీతుల్నీ అనుసంధిస్తూ అక్షర సేతువుని నిర్మించాడు ఎర్రాప్రగడ. నన్నయ్య గారి కవితార్థశక్తి, తిక్కన గారి నాటకీయత, ఎర్రన గారి అనుసంధానయుక్తి ఇవన్నీ ఏకమై మహాభారతం ఆవిర్భవించింది.

తర్వాత శ్రీనాధయుగం ఆరంభమైంది. కవిత్వంలో ప్రౌఢత్వాన్ని చొప్పించాడు. బమ్మెరవారి భక్తిప్రధాన రచన భాగవతం పుట్టింది. చాటువులు, అశుకవిత్వం చోటుచేసుకున్నాయి ఈ యుగంలో.

## ప్రబంధయుగం

**16వ శతాబ్దం- కృష్ణదేవరాయల యుగం. ఇదే ప్రబంధయుగం. పూర్వయుగానికి, ప్రబంధయుగానికి కొన్ని స్పష్టమైన భేధాలు కన్పిస్తాయి. అనువాద మార్గాలు పోయి కల్పిత కథా వృత్తాంతాలు గల స్వతంత్ర కావ్యాలు ఆవిర్భవించినాయి.**

ఉదాత్త ప్రకృతిగల నాయకులు, సీత ద్రౌపది లాంటి పతివ్రతా శిరోమణుల కన్పించరు. ఈ యుగంలో ప్రబంధనాయకులు రసజ్ఞులు. నాయికలు ప్రేమైక జీవులు. వీరిలో కుల స్త్రీలేగాక వరూధిని వంటి గంధర్వ కామినులు, కలభాషిణి వంటి వారకాంతలు చిత్రింపబడినారు. పురాణాలలో వీర, శాంత రసాలకు ప్రాధాన్యత యివ్వగా, ప్రబంధాలలో శృంగారం వర్ధిల్లింది. నాడు కథపై శ్రద్ధ చూపుతూ వర్ణనలను మితంగా చేశారు. ఈ యుగంలో వర్ణనలకు ప్రాధాన్యత నిచ్చి తమ ప్రౌఢశైలిని కూడా ప్రదర్శించారు. ప్రాచీనులు ధర్మప్రతిపాదన, నీతిబోధ చేయగా ప్రబంధకవులు లౌకిక కావ్యదృష్టిని ప్రదర్శించి కావ్యానికి ఆనందమే ప్రధానమని భావించారు.

17, 18 శతాబ్దాల అనంతరం ప్రబంధయుగంగా పరిగణించబడింది. 17వ శతాబ్దిలో సంస్కృతంలో నున్న వ్యాకరణ గ్రంథం ఆంధ్ర శబ్ద చింతామణికి ఎలకూచి బాలసరస్వతి తెలుగు వివరణ యిచ్చారు. ఈ యుగంలో తెలుగు కవిత్వం మార్పులు లేక పాతపంధాలోనే నడిచింది. అయితే కావ్యాలు కోకొల్లలుగా వచ్చినై. ఈ కాలంలో ముద్దుపళని రచించిన రాధికా స్వాంతనం లోకోక్తులతో నిండి రచనలో కొంత వైవిధ్యాన్ని నింపుకున్నది. యక్షగానాలు తండోప తండాలుగా వచ్చినాయి. ప్రబంధకవులు గేయ సాహిత్యాన్ని 'ముదివిటులు, విధవ లంజెలు-పద కవితలు' అంటూ నిరసించడం వల్ల నలిగిపోయిన గేయ వాఙ్మయం తిరిగి ఈ యుగంలో వికసించసాగింది.

## భాషా పరిణామ క్రమం

**క్రీస్తు శకం అయిదు నుండి 11వ శతాబ్దం దాకా పండిత సదస్సులకే పరిమితమైన కావ్యభాష వొకవైపు, సామాన్య ప్రజల వాడుకభాష మరొకవైపు వర్ధిల్లినాయి. వాడుక భాషలో వచ్చిన మార్పులు కావ్యాల్లోకి ఎక్కలేదు గాని, శాసనాల్లో గోచరిస్తుంది మార్పు.**




అంతకు ముందున్న శ, ఐ, లు, ల, న, లుగా మారాయి. వర్గ హల్లుల ముందు వచ్చే ఙ,ఞ,ణ,న,మ లను సున్నా వ్రాసే అలవాటు వచ్చింది. బహువచన ప్రత్యయం ముందుండే 'ఖ' అలా 'ట' అయింది. 13వ శతాబ్దంలో కేతన కావ్యభాష దూరంగా వుండాలని సూచించాడు. కావ్యభాష మార్పులు చెంది వాడుక భాషకు మరింత దూరమైంది. 14వ శతాబ్దం నాటికి శరణములు- శరణాలుగా, కుంచములు కుంచాలుగా మార్పు చెందాయి. 16వ

శతాబ్దపు శాసనాలలో వస్తారు. పొందుతారు, చూస్తాడు, వస్తాడు లాంటి ప్రయోగాలను మనం చూడవచ్చు.

వ్యవహారభాష జానపదాలకు, శాసనాలకు పరిమితమైంది. కావ్యసాహిత్యానికి కవిత్రయం వారి శైలి వొరవడిగా నిలిచింది. శతకాలు, కీర్తనలు, యక్షగానాలు మొదలైన వాటిలో వాడుకభాష చోటుచేసుకున్నది.

1855లో చిన్నయసూరి బాలవ్యాకరణం వారి ఇతర వచన రచనలు వచ్చినాయి. వచనరచనలు క్లిష్ట వ్యవహారికంలోనే సాగినాయి. తర్వాత గ్రాంధిక వ్యవహారికోద్యమాలు సాగటంతో తెలుగు వచన రచనలు కుంటుపడ్డాయి. 1930 తర్వాత గిగుగు పిడుగు వ్యావహారిక భాషోద్యమాన్ని తీవ్రతరం చేయడంతో మనం తిరిగి వచన సాహిత్యంవైపు నడక సాగించాము. తాపీ ధర్మారావుగారు వ్యవహారిక భాషను పత్రిక (జనవాణి) కెక్కించిన ఘనత దక్కించుకున్నారు. వీరేశలింగం పంతులుగారు తెలుగు భాషలో వివిధ ప్రక్రియలను ఆవిష్కరించారు.

## కాల్పనిక వాదం

**తెలుగు సాహిత్యంలో నవ్యత వీరేశలింగం. గురజాడలలో ప్రారంభమై, కాల్పనిక వాదం రాయప్రోలు వారి ద్వారా వెలుగులోకి వచ్చింది. తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన పాశ్చాత్య కాల్పనిక వాదులు వర్డ్సువర్తు, కీట్స్, షెల్లీ, స్విన్‌బర్న్, ఎడ్గార్ అలెన్‌పో, కీట్స్, కాళిదాసులచే ప్రభావితుడైన రవీంద్రుని ఛాయలు, బంకింబాబు బెంగాలీ రచనల ప్రభావం కూడా తెలుగు కవిత్వంపై పడింది.**

స్వాతంత్రోద్యమం ఆరంభమైంది. తెలుగుకవులు తెలుగుజాతిని కీర్తిస్తూ కవితలల్లారు. ఈ రచనలు ఉద్యమకాలానికే పరిమితమైనాయి. సామాజికంగా, రాజకీయంగా ఎన్నో మార్పులు వచ్చి కాల్పనికవాదం ఎబ్బెట్టుగా తోచసాగింది. ఊహాలోకంలో విహరింపచేస్తూ పలాయన వాదానికి ఇవి ప్రతీకలనే భావం కలగసాగింది. జీర్ణం చేసుకోలేకపోవడంతో వాస్తవ వాదాన్ని కూడా తిరస్కరించారు.

## కొత్తజాడలో గురజాడ

**1920లో గురజాడ ప్రచురించిన 'ముత్యాల సరాలు' తెలుగు సాహిత్యంలో వచ్చిన కొత్త పంథా. అబ్బూరి ఊహాగానంలో సాధు గీతికలు విన్పడ్డవి. 1920 ప్రాంతంలో నండూరివారి ఎంకి పుట్టింది.**

***"యెలుతు రంతా మేసి***
***యేరు నెమరేసింది"***

అంటూ సర్రియలిజాన్ని ఛాయామాత్రంగా తెలుగు వారికి పరిచయం చేశారు. ఎంకి తెలుగువారి ఆడపడుచుగా సముచిత స్థానం సంపాదించుకున్నది.

వాస్తవవాదం తర్వాత అభ్యుదయవాదం అంకురించింది. శిష్ట్లా ప్రయోగాలు ఈ ఉద్యమపు ప్రారంభ సంకేతాలు. శ్రీశ్రీ, నారాయణబాబు, జరుక్‌శాస్త్రి, పఠాభి మూల స్థంభాలు ఈ ఉద్యమానికి. ముద్దుకృష్ణ 'జ్వాల' కొంత వూపునిచ్చింది. పఠాభి పద్యాల నడుములు విరగగొట్టడమే కాదు. ఆంగ్ల పదాలను తెలుగైజ్ చేశాడు. నగర వర్ణనంలో దిగంబర కవిత్వాన్ని ఆనాడే పఠాభి ఆవిష్కరించాడు. శ్రీశ్రీ వచనకవిత కొడవటిగంటి వచనరచన మార్క్సిజం వైపుకు నడిచాయి. ఆరుద్ర హంగామా చేసినా రంగుటద్దాలేవీ తగిలించుకోలేదు. "సాహిత్యం నియమ రహితమని అనన్య పరతంత్రమని" శాస్త్రకారుడు చెప్పిన అభిప్రాయం రుజువైంది. సైన్సులోలాగే నిత్య నూతన ప్రయోగాలు తెలుగు సాహిత్యంలో సాగినాయి.

తెలుగు కావ్యభాష వేయేళ్ళ తర్వాత సంపూర్ణంగా పరివర్తన చెంది ప్రజలభాష కావ్యంలోకి వచ్చింది. మిగతా వందల యేళ్ళలో రాని మార్పులు ఈ యాభై యేళ్ళలో వచ్చి కవి అభివ్యక్తి పరిధులను వూహించిన దానికంటే విస్తృతం చేసినాయి. కావ్య వస్తువు అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. పద్య రచనలో ఛందస్సు కవులకు సాయపడుతుంది. కాని, వచనకవితలో వ్యర్థపదాలకు తావు లేదు.

1955 తర్వాత శ్రామికుల కన్నా మధ్యతరగతి జనం ఎక్కువగా కన్పిస్తారు. సాహిత్యంలో ఎన్జీవోలు, నిరుద్యోగులు కావ్య నాయకులయ్యారు. సమాజ స్థితిగతులు కవితల్లో ప్రతిబింబించడం సహజం కదా! ఒక రకమైన రివిజనిజం ధోరణి కూడా వచ్చింది. తిలక్ 'పులి చంపిన లేడి నెత్తుర్ని పులుముకుంటె' ఆరుద్ర 'గంట స్తంభం చూపెట్టే కాలం తప్ప'న్నాడు. నారాయణబాబు ఫ్రాయిడ్‌ని మార్క్సుని కలబోసి చదవడం ప్రారంభించాడు. శ్రీశ్రీకి సర్రియలిజం సోకింది.

సరావతారం రామమోహనరావుగారు వొకచోట సాహిత్య సమీక్ష చేస్తూ - 'అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టుపెట్టిన అందం నీది' అని చెరబండరాజు మాతృదేశాన్ని స్తుతినింద చేశారు. తెలుగు కవిత ఒక 50 ఏళ్ళలో 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా' అన్న గీతం నుంచి దిగంబర కవితలో దాని యాంటీ థీసిస్ వరకు పయనించింది' అన్నారు. ఇది చాలా సునిశితమైన సమీక్ష. అర్థ శతాబ్ది ఆంధ్రసాహిత్య పరిణామక్రమాన్ని ఒక వాక్యంలో చెప్పడం జరిగింది.

కవుల భాషా ప్రయోగం మీద నేటి జీవిత విధానం తెస్తున్న మార్పులకు కొన్ని ఉదాహరణలు ఇచ్చాడు శ్రీశ్రీ. టెలిగ్రామ్, వాణిజ్య ప్రకటన, వార్తాశీర్షిక వీటికి వ్యాకరణం ప్రధానం కాదు. క్లుప్తత, ఆప్తత, గుప్తత వీటికి ముఖ్యం. ఈ శైలి ఆధునిక కవితలలో కొన్ని చోట్ల కనిపిస్తుంది.

'గోదా శబరినది' అనే మాట గోదాబరి అయి, గోదావరి అయి కాలక్రమంలో 'గోదారి' అయింది. అంతే క్లుప్తతను నేటి ఆధునికుడు సమాదరిస్తున్నాడన్న మాట. తెలుగు కవితల్లో ఆంగ్లపదాలు విరివిగా వాడబడుతున్నాయి. ఆంగ్ల పదాలే కాదు, ఏ భాషా పదమైనా తేలిగ్గా అర్థమయ్యేది ప్రజల వాడుకలోది అయివుంటే చాలు. అంటే ఆనాటి 'మణి ప్రవాళాలు' మళ్ళీ వచ్చాయన్నమాట. కావ్యవస్తువు అంతర్జాతీయ పరిధికి ఎదిగింది. ప్రత్యేక వాదం విస్తృతమైంది. వ్యాకరణం పూర్తిగా దూరమైంది. సంధిని పాటించకుండా ప్రపంచ తెలుగు మహాసభలను జరుపుకుని తెలుగువాళ్ళు వ్యాకరణాన్ని సమాధి చేశారు.

# భవిష్యత్తులో తెలుగు కవిత

**మార్క్స్ తన తర్కభాషలో థీసిస్ + యాంటీ థీసిస్ = సింథిసిస్ అన్నాడు. ఆధునిక తెలుగు కవిత థీసిస్ నుంచి యాంటీ థీసిస్ దాకా ప్రస్థావించింది. కనుక మళ్ళీ ఎనాలిసిస్ ప్రారంభం కావాల్సిన అవసరం ఉన్నదేమోననుకుంటాను.**

రాబోయే శతాబ్దంలో యాంత్రికయుగం సంపూర్ణత్వాన్ని చేకొని కాలపువేగం హెచ్చడం జరుగుతుంది. కనుక సుదీర్ఘ కవితలు చదివే ఓపిక, తీరిక గల పాఠకులు దొరకడం అసాధ్యమౌతుంది. నూతన శతాబ్దంలో దేశాల మధ్య గల దూరాలు ఇంకా తగ్గుతవి. అన్ని దేశాల సాహిత్యాలకు అంతర్జాతీయ స్థాయిలో పాఠకులు లభిస్తారు. అయితే అంతర్జాతీయ అవగాహనకు ఒక ప్రపంచ భాష తప్పనిసరి అవుతుంది.

1900 ప్రాంతంలో రష్యాలో డాక్టర్ జాయెన్‌హాన్ కనుగొన్న ఎస్పరాంటో ప్రపంచభాషగా విస్తరించలేదు. ఇంగ్లీషు మాతృభాషగా గల దేశవాసులు దీనిని అణగద్రొక్కారు. మొత్తం మీద ఇది విఫలమైంది.

ఏ రష్యా భాషలో కవితనో మనం సరాసరి అర్థం చేసుకోవాలి. ఈ అనువాదాలలో మూలంలోని విశేషాలు యథాతథంగా రాకపోవచ్చు. అందుకే నేనంటాను - అద్యతన భవిష్యత్తులో కవుల కోసం ప్రత్యేకమైన భాష ఆవిర్భవిస్తుందని. ఆ భాష సంకేత పదజాలంతో వుంటుంది. అనుభవాలకు, అనుభూతులకు కొన్ని సంకేతాలు వస్తాయి. అంటే ఆవేదన, ఆకలి, ఆనందం, భయం, ఉద్రేకం, ఉత్సాహం ఇలాంటి మానసికావస్థలను ఒక కోడ్ ద్వారా అభివ్యక్తపరచటానికి వీలుంటుంది. అన్ని దేశాలవారు కోడ్‌ని అనుసరిస్తారు. ఒక భారతీయుడు ఈ కోడ్ భాషలో కవితను వ్రాసి ఒక జర్మన్ పత్రికకు పంపడానికి వీలుంటుంది. ఆ పత్రికవారు ఆ కోడ్‌ను తమ భాషలోకి విశ్లేషించి గాని లేదా కోడ్ (బహుళ ప్రచారం పొందితే)ని యథాతథంగా గాని ప్రచురిస్తాయి. అలాగే ఏ దేశపు ఏ భాషా పత్రికైనా పరిధి అంతర్జాతీయమైంది. కనుక కవితల్లో విశ్వమానవ స్పృహ వుండి తీరుతుంది.

పుస్తకాలలో, పత్రికలలో భావాన్ని అనుసరించి రంగులు మార్చి అక్షరాలను లేదా పంక్తులను ప్రచురించే ఆచారం రావచ్చు. వేదన అయితే నలుపులో, విప్లవమైతే ఎరుపులో, స్నేహమైతే తెలుపులో ఇలాగే.

ఆధునిక చిత్రకళలో చిత్రాలకు పేర్లు పెట్టడం మానుకున్నారు. కవితలకు శీర్షికలు వుండకపోవచ్చు. గుర్తింపు కోసం కవిపేరు, కవిత నెంబరు వుంటుంది.

అధివాస్తవికత పరాకాష్ఠకు వెళ్ళి అంబరం నుంచి (భాషా విషయకంగా) దిగంబరానికి దిగివచ్చిన తెలుగుకవిత తిరిగి భావనాపరంగా అంబరానికి యెగిరిపోయే ప్రమాదం లేకపోలేదు.


కవిత్వం వ్రాయడంకన్నా చదివి అర్థం చేసుకోవడం ఒక పెద్ద కళగా పరిణమించే సూచనలున్నవి. మినీ కవితలు మినహా సుదీర్ఘ కవితలు రాకపోవచ్చు. ఇక నాయికా నాయకుల ప్రసక్తే లేదు. అప్పటికి సెక్స్ పట్ల వెగటు తోచి కవితల్లో అశ్లీలానికి ఆస్కారం వుండకపోవచ్చు.

యాంత్రిక జీవితంలో విసుగెత్తిన ప్రజానీకం పలాయనవాదాన్ని వరించి తిరిగి భజన కీర్తనలను, ఆధ్యాత్మిక రచనలను ఆహ్వానించవచ్చు. (హరేకృష్ణ సమాజాలు ఇలాంటివే దాదాపుగా)

# కంప్యూటర్ కవితలు

**కంప్యూటర్లు ఆధునిక చిత్రాలను రచిస్తున్నట్లు వింటున్నాం. కంప్యూటర్ల చేత కవిత లల్లించడం అసాధ్యమేమీ కాబోదు. ప్రాచీన కాలంలోవలె వ్రాత గాళ్ళతో పనిలేకుండా డిక్టా ఫోనులు ఇప్పటికే వచ్చేసినాయి.**

కవి మేధస్సులోని భావాలను భవిష్యత్తులో కంప్యూటర్ సంకేతాల ద్వారా ప్రదర్శిస్తుంది. అనుభూతి, ఆలోచన, ఆవేశం గల కవి మెదడు దగ్గరగా కంప్యూటర్ యంత్రపరికరాన్ని అమరుస్తారు. కంప్యూటర్ పనిచేయడం ప్రారంభిస్తుంది. కవి పొందే అనుభూతిని బట్టి వెలువడే కవిత బాగోగులు ఆధారపడి వుంటుంది. దీనివల్ల కవి నిజాయితీ కూడా బయటపడుతుంది. ఇప్పటివలె ఎరువు తెచ్చుకున్న నినాదాలు, శుష్క ప్రియాలు కవి తన కవితలో చొప్పించడానికి వీలుపడదు. భావం మనస్ఫూర్తిగా మెదడు లోతుల్లోంచి వస్తేనేగాని అది రికార్డు చెయ్యదు. 21వ శతాబ్దంలో ఇలాంటి పరికరం రావడానికి అవకాశం వుంది.




# కవిగా కొద్ది క్షణాలు

**మనిషి కొన్ని ప్రత్యేక సందర్భాలలో మామూలప్పుడు చేయలేని గొప్పపనులను చేయగలుగుతారు. ఇటీవల ఒక మహిళ కారు క్రిందపడిన తన పసిపిల్లను రక్షించాలనే ఆత్రుతతో ఆ కారును అమాంతం ఎత్తిందట.**

మామూలుగా ఇది ఆమెకు అసాధ్యమైన పని. కొన్ని పరిస్థితులలో ఇలాంటి బృహత్‌శక్తి ఆవిర్భవిస్తుందని శాస్త్రజులు తేల్చారు. దీని ఆధారంగా ఒక 'పిల్'ని తయారు చేస్తున్నారు కూడా! ఆ 'పిల్ ని వేసుకున్నప్పుడు బృహత్‌శక్తి కలుగుతుందట కొద్దిసేపు.

అలాగే కవితను కవికానివాడు వ్రాయాలనుకున్నప్పుడు ఒక పిల్‌ని సేవించడం ద్వారా అది సాధ్యపడే అవకాశం రావచ్చు.



హిప్నాటిజం ద్వారా వీణ అంటే తెలియని మామూలు ప్రేక్షకుని చేత కొద్దిసేపు మధురంగా వీణానాదం చేయించడం మనం చూస్తూనే వున్నాం. అలాగే ప్రత్యేక గుళిక ద్వారా ఒక మనిషిని కొద్దిసేపు కవిగా జీవింప చేయడం సాధ్యపడవచ్చు. ఆ కొంచెం సేపు ఆ మనిషి రచయితగా ఉత్తమ రచనను చేయగలుగుతాడు. సాహిత్యరంగంలో కావలసిన ప్రక్రియను బట్టి పిల్స్ మింగాల్సి వుంటుంది. కవిత, కథానిక వాటికి ఇలా వేర్వేరు ప్రక్రియలకు గుళికలు! అచ్చం శ్రీశ్రీలాగే వ్రాయాల నుకుంటే ఆ బ్రాండ్ మాత్ర మింగాల్సి ఉంటుంది.

## నవలా సాహిత్యం

**తెలుగు సాహిత్యంలోకి నూరు సంవత్సరాల క్రితం నవల ప్రవేశించింది. విరివిగా నవలలు వస్తున్నప్పటికీ, వర్తమానంలో చాలా మందికి పెద్దకథకూ, నవలకూ తేడా తెలియదనడం నిర్వివాదంశం.**

వచ్చే శతాబ్దంలో ప్లాట్ రైటరు ప్రత్యేకించి తయారౌతారు. అంటే వందల పేజీలు వ్రాసే బాధ్యత వారు పెట్టుకోరు. కథాసారాన్ని కొద్ది వాక్యాలలో వ్రాస్తారు. కావల్సినవారు దానిని తీసుకొని భాష, శిల్పం మేళవించి సమగ్ర నవలగా రూపొందించాల్సి వుంటుంది. తీరిక వున్నవారు నవలను, తీరిక లేనివాళ్ళు ప్లాట్‌ను చదువుకుని ఆనందిస్తారు. 'ప్లాట్' ప్రచురించబడగానే పాఠకుల అభిప్రాయాలు వెల్లడి అవుతాయి కదా! దానిని బట్టి నవలాకారుడు ప్లాట్స్‌ని ఎంపిక చేసుకుంటాడు. ఇప్పుడు నవలలపై గల అభిప్రాయాన్ని బట్టి సినిమా నిర్మాతలు ముందుకు వచ్చినట్లు.

లైట్ రీడింగ్ పట్ల ఆసక్తి పెరిగి జానపద కథలకు గిరాకీ పెరగడానికి అవకాశాలున్నాయి.

జపాన్‌లో ఇప్పటికే పాకెట్‌డైరీ సైజులో మినీ పత్రికలు అమలులో వున్నాయి. అమెరికాలో అక్షరాలు అదృశ్యమయ్యే పత్రికలు ప్రయోగదశలో వున్నాయి. కొద్ది గంటలు అనంతరం వార్తాప్రతికల పై గల అక్షరాలు వాటంతటవే చెరిగిపోతాయి. తిరిగి ఆ కాగితాన్ని వుపయోగించవచ్చు. వచ్చే శతాబ్ది నాటికి సాంకేతికంగా రాగల పరిణామాలు అనూహ్యామైనవి.

పత్రికలు కేవలం వార్తా ప్రసారం సాహిత్య సేవలకే పరిమితం కాకుండా చందాదారుల దైనందిన జీవితంలో భాగస్వామి కాగలవు.

నిత్యకృత్యంలో చందాదారునికి ఎన్నో రకాలుగా తోడ్పడే స్థితికి వస్తాయి. ఇప్పుడే కొన్ని వాణిజ్య ప్రకటనల ద్వారా కొన్ని నిత్యావసర వస్తువులకు పత్రికలు దళారులుగా వ్యవహరిస్తున్నాయి. (ఫలానా పత్రికలో ప్రచురించిన కూపను కత్తిరించి పంపడం ద్వారా కొన్ని వస్తువులకు రిబేటు లభించడం లేదా ఉచితంగా లభించడం వంటివి చూస్తున్నాం) ఈ ధోరణి పెచ్చు పెరిగి ఏ వస్తువు కావాలన్నా పత్రిక ద్వారా పొందడానికి ముఖ్యంగా నగరవాసులకు సౌకర్యం ఏర్పడుతుంది. పత్రికా సంస్థలు చందాదారునికి గార్డియన్‌గా వ్యవహరించగల అవకాశం వుంది.

టెలివిజన్స్ విస్తృతమౌతాయి కనుక ముఖ్య సంఘటనలకు సంబంధించిన ఫొటోలను ప్రచురించే అవసరం తగ్గిపోతుంది. కొన్ని పత్రికలు త్రీ డి ఫొటోలను ప్రవేశపెడతాయి.

పత్రికల్లో వార్తల కంటే వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. పత్రికా స్వాతంత్ర్యం పెరిగే అవకాశాలున్నాయి. ప్రభుత్వం గాని, ప్రైవేట్ సంస్థలు గాని ఏవైనా అన్యాయాలను, అక్రమాలను చేస్తే వాటిని బయటకు తీసే ప్రయత్నాలు పత్రికాపక్షంగా అధికం కాగలవు. ఒక రహస్య సమాచార శాఖలాగా పత్రికలు పనిచేయడం ప్రారంభిస్తాయి. అలాంటి వైఖరి ప్రదర్శించే పత్రికలకు మాత్రమే ప్రజాదరణ లభిస్తుంది.

ప్రస్తుతం మహిళలకు, పిల్లలకు, యువకులకు ప్రత్యేక పత్రికలున్నాయి. ఈ వర్గీకరణ విస్తరించి వయసులవారీగా వేర్వేరు పత్రికలు వస్తాయి. మధ్య వయస్కులకు, వృద్ధులకు, పిల్లలులేని వాళ్ళకు, అధికంగా పిల్లలున్నవాళ్ళకు, అవివాహితలకు ఇలా వేర్వేరుగా నిర్వహించబడవచ్చు. మైక్రో ఫిలిమ్ పేపరు రాగల సూచనలున్నాయి.

☆

## నవీనంలో నాటిక

**నిడివైన డైలాగులస్థానే కట్ డైలాగులు వినిపిస్తాయి. బరువైన సంఘటనలతో కూడిన నాటికలపట్ల విముఖత ఏర్పడవచ్చు. మానవ మనస్తత్వంపై విశ్లేషణాత్మకంగా రచించబడే నాటికలు అధికంగా వస్తాయి.**

రంగస్థలాలు సాంకేతికంగా అభివృద్ధి చెందుతాయి. నేడు క్షీణదశలో వున్న పౌరాణిక, చారిత్రక నాటకాల వల్ల ఎంతో మోజు పెరుగుతుంది.

సంభాషణలు ఎంత క్లుప్తంగా వ్రాస్తే ఆ రచయితకు అంత గొప్ప పేరు వస్తుంది. ప్రేక్షకులస్థాయి పెరిగి అనవసరపు సంభాషణలను నిరాదరిస్తారు. సర్వే సర్వత్రా హాస్యరసం పట్ల విముఖత పెరిగి మానవ సమాజం ఒక విధమైన సీరియస్‌నెస్‌ని ఆరాధించే స్థితికి వెడుతుంది. అదొక ఫ్యాషన్‌గా పరిణమించే అవకాశం వుంది.

ఏ సాహిత్యం ఎన్నాళ్ళు మనగలుగుతుందో, ఏ రచన యెన్నాళ్ళు జీవిస్తుందో అనేది ప్రజాభిరుచులే నిర్ణయిస్తాయి. ఏది ఏమైనా అర్నాల్డ్ అన్నట్లు "నిత్య పల్లవ శీలమైన సాహిత్యం ఎన్నటికీ మోడు వారదు".

☆

# కలపేతర అటవీ సంపద ద్వారా గిరిజనుల జీవనోపాధులు

**సహజ వనరులు అయిన అడవులు మానవులతో పాటు, ప్రతిప్రాణికి స్వచ్ఛమైన గాలిని, పర్యావరణాన్ని ప్రసాదిస్తూ వాతావరణం కలుషితం కాకుండా చూడటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అలాగే మనకు అవసరమైన ముడి సరుకును అందిస్తూ అనేక రకాలుగా ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి.**

**అడవులు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను అనేక మందికి జీవనోపాధులు కల్పిస్తున్నాయి. 2009లో అటవీశాఖ నివేదిక ప్రకారం భారతదేశంలో 690899 $Km^2$ అటవీ విస్తీర్ణం ఉంది. ఇది దేశ భూభాగంలో 21.05 శాతమన్నమాట. దేశంలోని మధ్యప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలలో అటవీ విస్తీర్ణం ఎక్కువగా వుంది.**

జీవనం సాగిస్తున్నారు. వీరు ఎక్కువమంది అటవీ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. వీరి జీవన విధానమంతా అడవితో ముడిపడి వుంటుంది. ఎక్కువ మంది గిరిజనులు ఇప్పటికీ కూడా కలపేతర అటవీ సంపద పైనే ఆధార పడుతున్నారు. గిరిజనులకు వారి సాంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతిపై మమకారం, నమ్మకం ఎక్కువ కాబట్టి వారు మారుమూల ప్రాంతాల్లో జనసంచారానికి దూరంగా ఉండటానికే ఇష్టపడతారు. సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా బాగా వెనుకబడి వున్నారని చెప్పవచ్చును.

అటవీ ఉత్పత్తులను రెండు రకాలుగా చెప్పవచ్చును. **1. మేజర్ అటవీ ఉత్పత్తులు 2. మైనర్ అటవీ ఉత్పత్తులు.**





దేశంలోని ఆరు లక్షల యాభైవేల గ్రామాలలో దాదాపు రెండు లక్షల గ్రామాలు అటవీ ప్రాంతం,అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్నాయి. దాదాపు 350 మిలియన్ ప్రజలు వారి జీవనోపాధి కొరకు అడవుల పై ఆధారపడ్డారు. వీరిలో ఎక్కువగా గిరిజనులే వుంటారు. వందల సంవత్సరాలు నుండి అడవులకు, గిరిజనులకు మధ్య అవినాభావ సంబంధాలు వున్నాయి.

2001 జనాభా లెక్కల ప్రకారం దేశంలో దాదాపు 533 గిరిజన గ్రూపులో 84.33 మిలియన్ మంది గిరిజనులున్నారు. ఇది దేశ జనాభాలో 8.2 శాతం వుంది. అలాగే మన ఆంధ్రప్రదేశ్‌లో 5.24 మిలియన్ మంది గిరిజనులు వున్నారు. ఇది రాష్ట్ర జనాభాలో 6.6 శాతంగా చెప్పవచ్చు. మన రాష్ట్రంలో ముఖ్యంగా 9 జిల్లాల (ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి)లో గిరిజనులు ఎక్కువగా వున్నారు.

ఈ జిల్లాల్లోని గిరిజనులు ఎక్కువగా అటవీసంపదపై ఆధారపడి

కలప ఉత్పత్తులన్నింటినీ కలిపి మేజర్ అటవీ ఉత్పత్తులంటారు. కలపేతర ఉత్పత్తులు అంటే ఆకులు, పండ్లు, తేనే, బంక, కూరగాయాలు, పూలు, విత్తనాలు, బీడీ ఆకులు, గడ్డి, వేర్లు, వెదురు మొదలైన ఉత్పత్తులన్నింటిని కలిపి కలపేతర అటవీ ఉత్పత్తులంటారు. వేసవికాలంలో ముఖ్యంగా ఏప్రిల్ నుండి జూన్ వరకు గిరిజనులు ఈ కలపేతర ఉత్పత్తులను సేకరించి అమ్మడం వలన వచ్చే ఆదాయం పైన ఆధార పడి వారి జీవనోపాధి సాగిస్తున్నారు. మొదట గిరిజనులు కలపేతర అటవీ ఉత్పత్తులను వారి ఇంటి అవసరాలకు అంటే తినడానికి మాత్రమే వినియోగించేవారు. క్రమంగా వాటి ఆర్థిక విలువ తెలుసుకొని వాటిని అమ్మి ఆదాయం పొందడం ప్రారంభించారు.

ప్రభుత్వ నివేదికల ప్రకారం దాదాపు 70 శాతం కలపేతర ఉత్పత్తులు ఈ క్రింది 5 రాష్ట్రాలలో సేకరించడం జరుగుతుంది. 1. ఆంధ్రప్రదేశ్ 2. మధ్యప్రదేశ్ 3. మహారాష్ట్ర 4. బీహార్, ఒరిస్సా ప్రస్తుతం కలపేతర అటవీ ఉత్పత్తులు గిరిజనులు అధిక మొత్తంలో సేకరించి కొంత వారి ఇంటి అవసరాలకు వినియోగిస్తూ, మిగతా వాటిని అమ్మడం జరుగుతోంది.

ఈ కలపేతర అటవీ ఉత్పత్తులు అనేక పరిశ్రమలకు ముడి సరుకుగా ఉపయోగపడుతున్నాయి. జాతీయ ఆదాయం పెంపొందించడానికి కూడా దోహదపడుతున్నాయి.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అడవి మీద ఆధారపడిన గిరిజన కుటుంబాలకు జీవనోపాధి కల్పించడానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ అటవీ ఆధార కుటుంబాలు అటవీ ఉత్పత్తులు సేకరించడంలోను, అమ్మడంలోను అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరిజనుల నిరక్షరాస్యత, అమాయకత్వం వలన అటవీ ఉత్పత్తుల కొనుగోలులో ప్రైవేటు వర్తకులు గిరిజనులను మోసం చేయడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా కలపేతర అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ వారికి అవసరమైన నిత్యావసర వస్తువులను సరఫరా చేయడం జరుగుతోంది.

అయితే దీని కొనుగోలు కేంద్రాలు మారుమూల గిరిజన ఆవాసాలలో లేనందున వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలు మరిన్ని మారుమూల గ్రామాలలో ఏర్పాటు చేస్తే గిరిజనులు వారి ఉత్పత్తులను అక్కడ అమ్మి కనీసమద్ధతు ధర పొందడానికి అవకాశం వుంటుంది. ముఖ్యంగా గిరిజనుల జీవనోపాధులు అడవి మీద ఆధారపడివున్నాయి. కాబట్టి కలపేతర అటవీ ఉత్పత్తులను పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలి.

ప్రస్తుతం అనేక కార్యక్రమాల ద్వారా అటవీ ఉత్పత్తులు గణనీయంగా తరిగి పోవడం జరగుచున్నది. ఈ విధంగా ఉంటే భవిష్యత్తులో వారి జీవనోపాధులకు అవరోధాలు ఏర్పడతాయి.

ఇప్పటికే గిరిజనులు అటవీ ఉత్పత్తుల సేకరణ కొరకు అనేక దూర ప్రాంతాలకు వెళ్ళి అడవి జంతువులనుంచి ప్రమాదాలకు, వేసవి కాలంలో ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురి అవుతున్నారు. అదేవిధంగా ఉత్పాదకత తగ్గిపోవడం వలన వారిలోనే వారికి సేకరణలో తీవ్ర పోటీ ఏర్పడుతోంది. వారికి సరిపడా ఆదాయం పొందలేక పోతున్నారు. ఈ క్రింది కార్యక్రమాల ద్వారా అటవీ ప్రాంతాలలో నివసించే గిరి జనులు జీవనోపాధులను పెంపొందించడానికి అవకాశం వుందని చెప్పవచ్చు.

[redacted]

❖ కలపేతర అటవీ ఉత్పత్తుల ఉత్పాదకతను పెంపొందించడానికి కొత్త చెట్లను, ఉన్న వాటిని సక్రమంగా వినియోగించే విధంగా మంచి సేకరణ పద్ధతులపై శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం.

❖ సేకరించిన ఉత్పత్తులను సులభంగా, లాభదాయకంగా అమ్ముకోడానికి రవాణా సౌకర్యాలు, భద్రపరిచే సౌకర్యాలు, మంచి మార్కెటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం.

❖ సేకరించిన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేయడం వలన వారు అధికధరలు పొందడానికి అవకాశం వుంటుంది. కాబట్టి ప్రాసెసింగ్ చేయడానికి అవకాశం వున్న ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

❖ మార్కెటింగ్ సమాచారం అందుబాటులో ఉంచి ప్రతి గిరిజన ఆవాసంలో మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు కనీస మద్ధతు ధర కల్పించడం

❖ 'పెసా' చట్టంపై ప్రజాప్రతి నిధులకు, అటవీ శాఖ అధికారులకు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు అవగాహన కల్పించి అందులోని అంశాలు అమలు చేసే విధంగా చూడటం.

❖ ప్రజల భాగస్వామ్యంతో అటవీ సంరక్షణ కార్యక్రమాలు అమలు చేస్తూ, కలపేతర అటవీ ఉత్పత్తులను పెంపొందించడం.

❖ గిరిజనులకు కావలసిన ఋణ సౌకర్యాలు, వ్యవసాయానికి అవసరమైన మంచి విత్తనాలు, మందులు వారికి సబ్సిడీపై సరఫరా చేయడం.

❖ కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణలో ఎక్కువగా మహిళలు, పిల్లలు ఎక్కువగా పాల్గొంటున్నారు. కావున వారికి అటవీ ఉత్పత్తుల ద్వారా జీవనోపాధి కల్పించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడం.

పైన చెప్పిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పకడ్బందీగా అమలు చేయగలిగితే, అటవీ సంపదపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజన కుటుంబాల యొక్క ఆర్థిక సామాజిక, పరిస్థితుల ను మెరుగుపరచడానికి కృషి చేసిన వారమవుతామని చెప్పవచ్చు.

*- డా॥ యం. ముత్యాలు,*
*సి.డబ్ల్యు.ఎన్., అపార్డ్*

# పరిష్కారం

**భళ్ళున తెల్లారేసరికి అప్పిశెట్టి మూపుపై బట్టల మూట మోస్తూ రేవుకు బయలుదేరాడు. ఇరవై రోజులుగా బల్లపండుగ ధర్మమా అని అతనికి విశ్రాంతి దొరికింది. మళ్ళీ కష్టబడాలంటే అతని శరీరం సహకరించడంలేదు. రేవు చేరుకుని మూట అక్కడ పడేసాడు. మనుషుల అలికిడికి రేవులో కొంగలు రెక్కలు టప టప కొట్టుకుంటూ చింత తోపు వైపు ఎగిరిపోయాయి, అప్పుడు అప్పిశెట్టి ముక్కుకు పాలుసు వాసనసోకింది. రేవులోని నీటిని పరిశీలనగా చూశాడు. రేవులో నీటి మట్టం బాగా తగ్గిపోయి ఉంది. నీరు కూడా కాస్త బురద రంగులో ఉంది.**

“ఏట్రా బావా! రేవులో నీరంతా ఏటైపోనాదంటావు?” అని పక్కనే ఉన్న బైరాగితో అన్నాడు.

“మనము బల్లపండుగ సందడిలోన ఉండిపోనాము. అప్పుడు పెసిరెంటు కొడుకు గవర్మెంటు లోను తోటి ఇక్కడ యిటికిల బట్టీ ఎట్టినాడు. ఇదా ఈ సెరువు దిగావన పెద్ద పెద్ద మన్ను కుప్పలు కనిపిస్తన్నాయి కదా. సెరువుల నీరంత దనికోసమే వోడేస్తన్నారట” అన్నాడు బైరాగి.

“అలగైతే బట్టలు యిప్పుడెలగ గుంజాల నోసోసన కొట్టీవా?” అడిగాడు అప్పిశెట్టి.

“అయితేటి మను మాటెవలింతారు సెప్పు. ఆర్నెల్ల కాడ్నించి డబ్బులు పెంచమని అడిగినా మన మాట ఎవులు పట్టించుకుంతన్నారు? ఉత్తి పున్నేనికి జీతాలు కొలుస్తన్నట్లు మాటాడతన్నారు. మన కట్టం ఎవుడు సూత్తన్నాడు సెప్పు. కసింత కారం ఎక్కువేసి ఉడకబేడితే ఏ వోసనా ఉండదు” అని సలహా పారేసాడు బైరాగి

ఆ నీట్లోనే బట్టలు ఉతికి ఆరేసి సాయంత్రానికి పొడి బట్టలతో ఇల్లు చేరాడు అప్పిశెట్టి.

* * * * *

రాత్రి ఎనిమిది గంటలకి కల్లుపాకలో ఉన్న అప్పిశెట్టి దగ్గరికి రాముడు పరుగెత్తుకుంటూ వచ్చాడు “మామా! బావని పెసిరెంటు కొడుకు సావగొట్టేస్తున్నడు రా” అంటూ ఆదుర్దాగా చెప్పాడు.

తాగిందంతా దిగిపోగా సర్పంచ్ యింటివైపు పరిగెత్తాడు. అప్పటికి సర్పంచ్ యింటి ముందు జనం మూగి ఉన్నారు.. “ఏటయిందిరా సిమా సెలమా”! అంటూ కొడుకు దగ్గరికి పరిగెత్తాడు.

“సూడురయ్యా! పెసిరెంటు బావు కొడుకెలాగ బాదీసి నాడో” అంటూ తన శరీరాన్ని తండ్రికి చూపించాడు. సింహాచలం ఒంటిమీద, చేతుల మీద ఎర్రని తట్లు కనిపిస్తున్నాయి.


“ఏల ఎందుకు కొట్టినాడు” అన్నాడు అప్పిశెట్టి.

“మనము గుంజిన బట్టలు నీసోసన కొడతన్నాయట. అందుకని యిస్టానుసారం తిడతన్నాడు. తిడితె మంచిగుండదు. రేవల నీరు లేకపోతే మామేటిసేత్తాము. నీరంత నీ యిటికిల కోసమే ఓడిసినావు” అన్నాను.

‘రేవు మీ యమ్మ మొగుడు సొమ్మేట్రా’ అంటూ అమ్మానా బూతులు తిడతన్నాడు. నాను తిడితే ఒప్పుకోను అని మీద కెల్లినాను. దంతోటి పక్కనున్న కొరడాకర్రతో నన్ను ఇష్టానుసారం బాదేసినాడు” అన్నాడు సింహాచలం.

“కొట్టనేటి మరి. నా పీక నొక్కేత్తుంటే ఏటిసెయ్యాల. నాను కొట్టి ఒగ్గీసి నాను మా అయ్య ఉంతె నిన్ను సంపీసుణ్ణు” అన్నాడు ప్రెసిడెంటు కొడుకు

“ఏది మల్ల ఆడి ఒంటి మీద సెయ్యియెయ్యి మీ రగతం పారాల” అన్నాడు మల్లేసు ముందుకు దూకుతూ మల్లేసు అప్పిశెట్టి తమ్ముడు కొడుకు.



గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

ప్రెసిడెంటు కొడుక్కూడా యుద్ధానికి సిద్ధపడి పోయాడు.

ఈ లోగా ఊరి పెద్దలు కల్పించుకున్నారు.

"ఆగండ్రా. ఏటి ఇది ఊరా? అడివా ఇది. ఎవులి మట్టుకు ఆలు కొట్టుకుంటె మరి పెద్ద మనసు లెందుకు? పంచాయితీ లెందుకు. మీ యిద్దరిదీ తప్పే. అప్పిశెట్టి నువ్వు నీ కొడుకుని తీసికెల్లు. ఓరానందూ? నువ్వు లోపలికెల్లు" అని ఊరి పెద్ద పోలినాయుడు సరి చెప్పాడు. ఆనందు లోపలి కెళ్ళి తలుపేసుకున్నాడు.

"పెసిరెంటు బావు రానీ ఆయన కాడే ఈ యిసయం తేలుసు కుందుము" అని అప్పిశెట్టి తన కొడుకును తన వాళ్ళను తీసుకొని యింటికెళ్ళాడు. తగువు తాత్కాలికంగా చల్లారింది.

* * * * *

**ఇం**టికి వచ్చిన ప్రెసిడెంట్‌తో జరిగిన తగువంతా భార్య చెప్పింది. సర్పంచ్‌కి కొడుకు తొందరపాటు చర్యకు చిరాకనిపించింది. కొడుకు ఊళ్ళోజులాయి తిరుగుళ్ళు తిరగడం చిన్నా చితకా తగువులు ఇంటి మీదికి తెస్తుండడం అతనికి కొత్తకాదు. కొడుకు ఆనంద్‌ని పిలిచి కేకలేద్దామనుకున్నాడు. అది గ్రహించిన భార్య "నువ్వు సీటికీ మాటికీ సిరాకుపడితె అందరికాడా ఆడు సులకనైపోతాడు. అసలే ఆడికి పవురుసం ఎక్కువ. ఆణ్ణేటీ అనకు" అంటు హెచ్చరించడంతో విధిలేక తగ్గాడు సర్పంచ్. వెంటనే ఎవరికీ తెలియకుండా కొడుకుని తన అత్త వారింటికి పంపేశాడు.

ఆ సాయంత్రమే అప్పిశెట్టి తన వాళ్ళతో వచ్చి సర్పంచ్‌ని కలిసాడు. జరిగిందతా విన్న మీదట సర్పంచ్ "నానూ ఆడిని తిట్టినాను లెండి. పవరుసంతో ఎన్నో అనుకుంతారు. ఆడుకుంతారు. అవి అలగే ఒగ్గీయాలగానీ పట్టించుకొంటే ఎలగా" అన్నాడు.

"అలక్కాదు బావూ. తప్పు మీ బావు నేసినాడు గాబట్టి మీ బావు సేత సిమాసెలానికి సెమాపన సెప్పించీయండి" అన్నాడొకడు అప్పిశెట్టి తరుపున.

"బావు ఊరిల నేడు. మీరొచ్చీముందే ఆల తాత గారింటికి పనిమీదెల్లిలాడు" అన్నాడు సర్పంచ్.

"మనము రాడానికి ముందే పంపిచ్చేత్తే ఏ తగవూ వుండదని పంపేసినట్టున్నారు" అన్నాడొకడు అప్పిశెట్టి వర్గీయుడు.

"మాటలు తిన్నగ రానీ. అయినా అడగడానికి మజ్జిన నువ్వెవుడివిరా మోర మీద పొడిసీగట్న" అన్నాడు బోడినాయుడు. అతడు ప్రెసిడెంటు తమ్ముడు.

"ఏదీ పొడు సూత్తము" రెచ్చగొట్టాడు సింహాచలం.

"ఉండెండెహె మీరు తగువు తీర్సుకోవడానికి వచ్చినారా? పెంచడానికా?" అన్నాడు సర్పంచ్.

"మీ బావు సెమాపన సెప్పాల. సమచ్చరం సివరన ఇస్తున్న జీతాల కసింతయినా పెంచాల. సెరువుల నీరు ఇటికిలు సెయ్యిడానికి ఓడకూడదు" అన్నాడొక యువకుడు.

"అందరి తోటి మాటాడి ఏయిసయం సెపుతాను" అన్నాడు సర్పంచ్.

"మీ యిష్టం బావూ ఈ యిసయం తేలిన వొరకు మాము బట్టలు గుంజము" అంటూ లేచి పోయారు అప్పిశెట్టి మొదలైన వాళ్ళు.

* * * * *

**"బ**ట్టలు గుంజకపోతే ఆలు జీతాలియ్యరు గద అప్పుడు మన మెలాగ బతకాల" అన్నాడొక ముసలాయన.

"మనము తెరీక బట్టలు గుంజకుండ ఉండిపోతామేటి. ఒక వారం రోజులు ఆల్లకి బట్టలు గుంజుకోవడము ఎంతకష్టమో తెలుస్తాది. అదీకాక కతాకార్యాలకి కవుర్లు సెప్పాలంటీ మనమే సెప్పాల. మైల బట్టలూ, సమర్త బట్టలూ ఆలు ఎలగ తడుపుతారు. మీరు కసింత ఓపిక పట్టుదురా ఆలూ ఆల తల్లోని జేజేమ్మ దిగొస్తాది" అంటూ అందర్ని ఒప్పించాడు మల్లేసు.

"ఆలు మరొక ఊర్నుంచి ఎవుల్నైనా బట్టలు గుంజడానికి తెస్తేనో?" అనుమానంగా ప్రశ్నించాడు అప్పిశెట్టి.

"ఎవులూ అలగరారు ఒచ్చినా మనము ఆల్ని అడ్డెత్తామన్నమాట" అన్నాడు మల్లేసు.

ముసలి వాళ్ళు మాత్రం అర్ధాంగీకారాన్నే తెలిపారు. సమావేశం ముగిసింది. అప్పిశెట్టి వర్గం వాళ్ళిచ్చిన వార్నింగుకి ప్రెసిడెంటు బంధువులు కుతకుతలాడిపోయారు.

"ఆలు మన బట్టలు గుంజడానికి రాకపోడమేటి? మనమే ఆలకి బట్టలెయ్యద్దు. జీతాలియ్యొద్దు" అన్నారు.

"అయితే మన బట్టలో" అడిగాడొక గ్రామ పెద్ద వీరాస్వామి

"మనమే గుంజుకుందము. టవునోల్లందరూ ఏటి సేత్తన్నారో మనమూ అలాగే సేద్దుము" చెప్పాడు శివున్నాయుడు.

"మరి మైల బట్టల సంగతేటి?" ప్రశ్నించాడు వీరాస్వామి.

"పసుపు నీళ్లు జల్లేత్తే సరి" చెప్పాడు సర్పంచ్ సాలోచనగా.

"మరి కవుర్లు సెప్పాలంటేనో" మరొకరి సందేహం.

"సెలు ఫోన్లున్నాయిగద. కొన్నాల్లు ఇలాగంతె ఆలే దారికొస్తారు. . . . మాడితే గుర్రము ఒరిగడ్డి మెయ్యదేటి?" అన్నాడు బోడినాయుడు.

అవే సమిష్టి తీర్మానాలుగా సమావేశం ముగిసింది.


వయసు మళ్ళిన వాళ్ళు మాత్రం వెనక్కు లాగుతూనే ఉన్నారు.

* * * * *

**ఊ**ళ్ళో ఇరవై రోజులుగా ఈ ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతూనే ఉంది. వ్యవసాయ కూలీ చేసుకుంటున్న ఆడవాళ్ళకు బట్టలు ఉతకడం మరో అదనపు పని కావడంతో మగాళ్ళ మీద విసుక్కోవడం ప్రారంభించారు. కులవృత్తులు మానుకోలేని వయసు మళ్ళిన అప్పిశెట్టి వర్గీయులు కుర్రకారు మీద చిర చిర లాడడం మొదలెట్టారు. అయినా ఊరు మాత్రం పొగమంచుకమ్ముకున్న ఉదయంలా గుంభనంగా ఉంది.

* * * * *

**ఆ** రోజు ఆ ఊరిని విషాదం పల్చని తెరలా అలముకుంది. ఉదయం బారెడు పొద్దెక్కుతున్నా ఎవరూ పనుల్లోకి వెళ్ళడం లేదు. ఏ యింటిలోనూ పొయ్యివెలగించ లేదు. సాలల్లో పశువులు తీరిగ్గా నెమరు వేస్తూ వచ్చీపోయే వారిని చూస్తున్నాయి. ఎప్పుడో సూర్యోదయానికి ముందే తెరవబడే రామమందిరమూ తెరవబడలేదు. సర్పంచ్ తల్లి




రాములమ్మ తెల్లవారు జామునే చనిపోయింది. ఆమె ధర్మమూర్తి. అజాత శత్రువు. ఆమె సాయం పొందని వాళ్ళు ఆ ఊళ్ళో లేరంటే అతిశయోక్తి కాదేమో! అందుకే ఊరు ఊరంతా శోక సముద్రమైపోయింది.

అక్కడున్న వాళ్ళంతా లోగొంతుల్లోనే మాట్లాడుతున్నారు. ఆటోల్లో దిగిన ఆడవాళ్ళు చీరల కొంగులు నోట్లో కుక్కుకుంటూ శవం దగ్గరికి చేరుకుంటున్నారు. కూతుళ్ళు శవం మీద పడి వర్ణ వర్ణాలుగా రోదిస్తున్నారు. కొంతమంది మగాళ్ళు అంతిమ సంస్కారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవేవీ పట్టకుండా రాములమ్మ తల దగ్గరున్న దీపం మాత్రం నిశ్చలంగా నిర్వికారంగా వెలుగుతూ ఉంది. సర్పంచ్ అరుగు మీద దూరంగా వాలు కుర్చీలో చేరబడిఉన్నాడు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అప్పలనాయుడు సర్పంచ్ మామగారు. అతను మాజీ మండల ప్రెసిడెంటు. మకుటం లేని మహారాజు. మామగారంటే సర్పంచ్‌కు వల్లమాలిన గౌరవం.

"నాయనా రావలసినోల్లంతా వొచ్చేసినారు కర్రలు బెత్తాయించి సొశానముల సితి పేర్పించాల నెగు" అన్నాడు అప్పలనాయుడు.

యిబ్బందిగా చూస్తూ వాలు కుర్చీలోంచి లేచాడు సర్పంచ్. ఇంతవరకు గ్రామంలో జరుగుతున్న సంఘటనలేదీ మామగారికి చెప్పలేదు. చెప్పితే చిన్నతనం అనుకున్నాడు. ఇక చెప్పక తప్పేలా లేదనుకొని "యిలగ ఒకసారి రమ్మీ" అంటూ లోపలి గదిలోకి నడిచాడు. అప్పలనాయుడు. అతనిని అనుసరించాడు. లోగొంతుతో జరిగిన సంఘటనలన్నీ మామగారికి వివరించాడు. సర్పంచ్ చివరిగా "అసలు తప్పంతా నీ మనవడిదే. ఆడిని నీ కూతురు ఎనకేసుకొస్తాది. ఈలిద్దరూ నా కాలికి బందకాలు. సుట్టాలు బందుగులూ గూడ తందాన తాన అన్నారు. ఇప్పుడు అంతాసెయ్యి దాటిపోయింది. ఏటి సెయ్యాలో ఏటీ తోసకుంటున్నాది. పోనీ ఆలు చెప్పిని వాటికి ఒప్పేసుకుందామంటే సులకనైపోతామేటో అనిపిస్తుంది. మనోల్లందరూ ఏటంతారో అని బెంగనాగుంది" అన్నాడు.

అంతా విని అప్పలనాయుడు దీర్ఘంగా నిట్టూర్చాడు.

"సూడు నాయినా ఇప్పుడు ఇన్ని ఆలోసించడానికి నేదు. మనముందు ఒక పెద్ద కారెము ఉన్నది. అది నువ్వుగానీ మన బందువులు గానీ ఎవలూసెయ్యలేము. ఆ అప్పిశెట్టోలే సెయ్యాల. అందుకే అంతారు సెరమం ఒలిసిసెప్పులు కుట్టిచినా సాకలి రుణం తీరదంతారు. ఆలకట్టానికి మనమిచ్చిన జీతమేటీ కాదు. టౌను తోటి యిలేజిని జత కట్టలేము గద. ఈ యింటిల ఎవులున్నారో ఆయింటిల ఉన్నోడికి తెల్దు. ఆలయితె మిసన్లోన బట్టలు ఉతికేత్తారు. మనికి అలగకాదుగద. టవున్లంట కరంటు సోశేనాలుంటాయి. శవాన్ని బండి మీదెట్టి మీట మెయ్యగానె సిటంల బుగ్గయిపోతాది. యిలేజిలంట సాకలుండాలి. మంగలుండాలి. సావుమేలముండాలి. యిది మన సంపరదాయం.

ఆలకి తప్ప సితి పేరసం గూడ ఎవులికీ రాదు. శవం కాలుస్తుంటే నెగిసి పోతుంటాది. కాలిపోతుంటే శవం కాలూసేతులు యిరిగి పోయి పక్కన పడి పోతుంటాయి. ఆటిని మల్ల సితి మీదెట్టి కాలసడానికి ఎన్ని కవుకులంటావు. యియన్నీ మనికి సేత గాని పనులు. పోనీ ఆలకి ఒంగడమేల అని మీయమ్మని కాలసకుండా, సమాది సేసీ గలవా సెప్పు? నీకు సెప్పీపాటోడిని కాదు గానీ నానూ సరపంచిగ సేసినాను. ఆ యనుబవము తోటి సెపుతున్నాను. పల్లిల్లోన అన్నివుర్తులూ సమానమే. పల్లి శ్శరీరమయితే అన్ని వుర్తులు సేసినోల్లు కల్లు, కాల్లు, సేతులు, ముక్కు సెవుల్లాటి వోల్లు. అన్నీ సక్కరమంగ వుంతేనే ఆరోగ్గెము.

నువ్వు ఆల సెరువుల నీరు వోడేత్తే ఆలు ఏటిసెయ్యాల సెప్పు? నీ లాబం కోసం ఆలనెందుకు ఇబ్బందెడతావు? నీ కాడ సొమ్ము నేదా? సోదా? ఒక మంచి బోరింగు తీయించుకో. యిటికిలపనికి వోడుకో. నీ కొడుకుని గదిమి సెమాపన సెప్పించు. ఇప్పుడాడిని ఒంచనేకపోతే బౌసెత్తులోన ఆణ్ణి వొంచలేవు గాక వొంచలేవు. ఆలకి నువ్వు పెంచిన కూలి మీరు కరుసు పెట్టిన దానిల పైసా వాటా కూడా ఉండదు. ఎలగో ఒకలాగ ఒప్పించి కారెం జరిగేలాగ సూడు" అన్నాడు అప్పల్నాయుడు.

సర్పంచ్ బయటకొచ్చి చెప్పులేసుకున్నాడు. అతను మెట్లు దిగుతుంటే, జనాలు దారి యిచ్చారు. వాళ్ళ మధ్యనుండి నడుస్తూన్న సర్పంచ్ ఒక దగ్గర ఆగిపోయాడు. కారణం ఆ గుంపులో అప్పిశెట్టి తన వర్గం వాళ్ళతో వచ్చి ఉన్నాడు. అందరి కళ్ళూ ఏడ్చి ఏడ్చి ఎర్రగా ఉన్నాయి. సర్పంచ్‌ని చూసి అప్పశెట్టి, సింహాచలం అతని దగ్గరకొచ్చి "బావూ అమ్మగారన్నేయం సేసినారు" అన్నారు. బావురుమంటూ విలపించాడు అప్పిశెట్టి. సర్పంచ్ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

"అప్పిశెట్టి మీరన్నట్టే సేద్దాముణా. అమ్మని బుగ్గిసేసీడానికి రావా?" అన్నాడు అభ్యర్థిస్తున్నట్లు.

అతని గొంతులో దుఃఖం సుళ్ళు తిరుగుతూ ఉంది. "అమ్మసావు తోటే అయన్నీ మరిసి పోనాము బావూ. మీరు పిలిసినా పిలక పోయినా అమ్మ కారెం ఆపుతామా బావూ" అన్నాడు అప్పిశెట్టి గద్గద సర్వంతో.

అరగంట తర్వాత అంతిమ యాత్ర మొదలైంది. ఊరంతా ఒకటిగా పోటెత్తిన సముద్రంలా స్మశానం వైపు సాగిపోయింది. ☆



# అమెరికా పేదలకు ఆసరాగా 'గ్రామీన్ అమెరికా'

**ఆర్థిక స్తోమత ఉన్నదా? లేదా? అన్నది చూడకుండా వెంటపడిమరీ ఎడాపెడా అప్పులిచ్చిన అమెరికన్ బ్యాంకులు దివాళా తీయడం (సబ్‌ప్రైమ్ సంక్షోభం), ఆ తరువాత వచ్చిన ఆర్థిక మాంద్యం పెట్టుబడిదారీ వ్యవస్థకు పెద్దన్నలాంటి అమెరికాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న తరుణంలో అమెరికా ఆర్థిక వ్యవస్థను శాసించే పెద్ద పెద్ద బ్యాంకులు హెడ్ క్వార్టర్స్‌కు (న్యూయార్క్‌లో) కూతపెట్టు దూరంలో నిరుపేదలూ, వలస కార్మికులు నివాసముండే బస్తీలలో ఓ కొత్త 'బ్యాంక్' ప్రకంపనలు సృష్టిస్తోందిప్పుడు. తల పండిన ఆర్థిక వేత్తలను సైతం అది ఆశ్చర్య చకితులను చేస్తోంది. అదే. 'గ్రామీన్ అమెరికా' పేరుతో వెలసిన మైక్రోఫైనాన్స్ సంస్థ. బంగ్లాదేశ్‌లో కోట్లాది నిరుపేదల జీవితాలకు వెలుగును ప్రసాదించిన 'గ్రామీణ బంగ్లాదేశ్' అనే మైక్రోఫైనాన్స్ సంస్థకు అమెరికన్ వెర్షనే 'గ్రామీన్ అమెరికా'.**

'గ్రామీణబంగ్లాదేశ్' సృష్టికర్త, నోబుల్ బహుమతి గ్రహీత మొహమ్మద్ యూనస్ చేతుల మిదుగా దాదాపు రెండేళ్ల కిందట 'గ్రామిన్ అమెరికా' ప్రారంభింపబడింది.

న్యూయార్క్ సిటీలోని 'క్వీన్స్ నైబర్‌హుడ్' లో 600 మంది సభ్యులతో ప్రారంభమైన ఈ సంస్థ అమెరికన్ పేదల మనస్సులను అతితక్కువ కాలంలో ఆకట్టుకొంది. శరవేగంతో నెబ్రాస్కా, ఫ్లోరిడా, నార్త్ కరోలినా, అర్కాన్సాస్, లూసియానా, వాషింగ్టన్ డి.సి. కాలిఫోర్నియా ప్రాంతాలలో కొత్త శాఖలను ఏర్పాటుచేసుకొని పేదల పాలిట పెన్నిధి అన్న పేరు తెచ్చుకొంటోంది.

పెద్ద పెద్ద బ్యాంకులు తమ కష్టమర్ల నుంచి బాకీలను వసూలు చేసుకోటానికి నానా తంటాలు పడుతుంటే గ్రామిన్ అమెరికా కష్టమర్లు 99.5 శాతం మంది తాము తీసుకొన్న రుణాలను వ్యవధికంటె ముందుగానే చెల్లించి బ్యాంకర్లందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నారు. సిటీబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ అమెరికా లాంటి పేరుమోసిన బ్యాంకులు ఒకవైపు కుప్పకూలి పోతుంటే 'గ్రామీన్ అమెరికా' నిశ్చలంగా 'స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ' మాదిరిగా మహోన్నతంగా కొనసాగుతోంది. ఆర్థిక మాంద్యపు దెబ్బ తమ సంస్థ నిర్వహించే మైక్రోఫైనాన్స్ బిజినెస్ మీద ఏ మాత్రం లేదని యూనస్ ధృడంగా చెబుతున్నారు.

'గ్రామీన్ అమెరికా' మొదటి సారిగా న్యూయార్క్ సిటీలోని క్వీన్స్ ప్రాంతంలో రెండేళ్ల కిందట ఒక పైలట్ ప్రోగ్రాంను నిర్వహించారు. దానికి వచ్చిన స్పందన చూసిన తరువాత నిర్వాహకులు మరిన్ని ప్రాంతాలకు విస్తరింపజేయాలని నిర్ణయించారు.

బంగ్లాదేశ్‌లో ఈ సంస్థ సభ్యుల్లో 97శాతం మహిళలు కావడం విశేషం. అమెరికాలో కూడా ఈ సంస్థ మహిళాసభ్యులను చేర్చుకోటానికే అధిక ప్రాముఖ్యాన్నిస్తోంది. ఎందుకంటే, మహిళలు సాటి మహిళలతో గ్రూపులా ఏర్పడటానికి ఇష్టపడటం ఒకకారణం కాగా, కుటుంబానికి కావాల్సిన మంచి దుస్తులు, ఇల్లు, పోషకాహారం, ఆరోగ్యపరిరక్షణ, విద్య వంటి విషయాలపై వారికే అధిక శ్రద్ధ ఉంటుందనేది మరో కారణం. పురుషులకంటే మహిళల్లో ఎక్కువ శాతం మంది రుణాలను తిరిగి చెల్లిస్తున్నట్లు చరిత్రలో అనేకమార్లు రుజువు అయినట్లు నిర్వాహకులు భావిస్తున్నారు.

'గ్రామీన్ అమెరికా' ఉపాధ్యక్షురాలు లెస్లీకానే, తమసంస్థ ఏర్పాటు ఉద్దేశాలను వివరిస్తూ, మైక్రో ఫైనాన్స్ ద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చనేది వెనుకబడిన దేశాలల్లో మాత్రమేకాదు, అమెరికాలో కూడా చేయవచ్చునంటారు. చాలామంది అమెరికన్లు, తమ దేశంలో పేదరికం లేదని భావిస్తుంటారు. కానీ అది నిజంకాదు. "ఇక్కడా అన్నిదేశాల్లో మాదిరిగా పేదరికం ఉంది. ఈ పేదలకు మైక్రోక్రెడిట్ ద్వారా అసరా ఇవ్వడం మాకర్తవ్యం" అని లెస్లీ అంటారు.

## అమెరికాలోనూ మైక్రో ఫైనాన్స్ అవసరం

ప్రపంచంలోనే అతిపెద్ద ధనిక దేశం అమెరికా అని ప్రపంచమంతా చెప్పుకొన్నా, 2005 జనాభా లెక్కల ప్రకారం అమెరికాలో 3.6 కోట్లమంది పేదరికంలో మగ్గుతున్నట్లు తేలింది. వీరిలో 87 లక్షల మంది పొట్టచేతపట్టుకొని విదేశాల నుంచి వలస వచ్చినవారే. పేదవారిలో అధిక భాగం అంటే రెండు కోట్లమంది స్త్రీలు ఉండగా వారిలో కోటీ ముప్పై లక్షల మంది దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నట్లు జనాభాలెక్కలు చెబుతున్నాయి. దుర్భర దారిద్ర్యంలో



**మైక్రోఫైనాన్స్ రంగంలో కొత్త పోకడ**



ఉన్న మహిళల్లో 98 లక్షల మంది 'సింగిల్ మదర్స్' (భర్తలు లేనివారు). వీరిలో 38 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నవారున్నారు. కాగా, అమెరికా జనాభా మొత్తంలో 11శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అమెరికన్ పేదల్లో 3 కోట్ల మంది బ్యాంకులతో ఎటువంటి లావాదేవీలు జరుపని వారున్నారు. వీరుకాక, మరో నాలుగున్నర కోట్లమంది ఆర్థిక సంస్థలతో పాక్షికంగా మాత్రమే లావాదేవీలు జరిపే వారున్నారు. బ్యాంకులు తదితర ఆర్థిక సంస్థలతో సంబంధాలు లేనివారిని పౌరులుగా గుర్తించని దుష్ట సాంప్రదాయం ఒకటి అమెరికాలో ఉంది. యు.ఎస్. క్రెడిట్ రేటింగ్ సిస్టం అనే ఒక వ్యవస్థ ఉంది. అది బ్యాకింగ్ హిస్టరీ, రిఫరెన్సెస్, ఎడ్యుకేషన్, కొల్లేటరల్ సందర్భాలలో పేరులు నమోదు కాక పోతే, వారిని పౌరులుగానే గుర్తించరు.

అటువంటి నిర్భాగ్యులందరికీ 'గ్రామీన్ అమెరికా' ఆసరానిచ్చి, మీ వెనుక మేమున్నామనే ఆత్మ విశ్వాసాన్ని కలుగజేస్తోంది. వారు స్వయం ఉపాధి కోసం చిన్నచిన్న వ్యాపారాలు పెట్టుకోవటానికి, వృత్తినైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవటానికి, అంతకు ముందు చేస్తున్న చిన్న వ్యాపారాన్ని వృద్ధి చేసుకోటానికి 'గ్రామీన్ అమెరికా' రుణాలు ఇస్తుంది. కొలంబియా దేశం నుంచి వలసవచ్చిన యోలి కాస్టిల్లో అనే మహిళ, గత ఏడాది 'గ్రామీన్ అమెరికా' నుంచి వెయ్యి డాలర్లు అప్పుగా తీసుకొని రెడీమేడ్ దుస్తుల షాప్‌ను ప్రారంభించింది. రోజంతా షాపలో అమ్మకాలు చూసుకొని, రాత్రి వేళలో మెడికల్ బిల్లింగ్ పార్ట్‌టైం జాబ్ చేస్తుంది. అప్పుతీర్చటానికి వారానికి 22 డాలర్ల వెనకేయగలుగుతోందిప్పుడు. ''నా జీవితంలో ఇలాంటి ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ఎప్పుడూ ఊహించలేకపోయా నాకిప్పుడు ఎంతో ఆత్మవిశ్వాసం వచ్చింద''ని కాస్టిల్లో అంటుంది.

## నమ్మకమే ప్రాతిపదిక

గ్రామీన్ అమెరికా ఇచ్చే అప్పులకు మనషుల మధ్య ఉండే పరస్పర నమ్మకమే పునాది. ఈ సంస్థలో చేరడం చాలా సులభం. అయిదుగురు సభ్యులతో ఒక బృందాన్ని (గ్రూపు) ఏర్పాటు చేస్తారు. ఈ గ్రూపు సభ్యులంతా పొరుగింటి వాళ్లైనా కావచ్చు, ఒకే సంస్థలో పనిచేసేవాళ్లైనా కావచ్చు, ఒకే బంధుత్వం ఉన్నవారైనా కావచ్చు, ఒక వారంలో ఒక సభ్యుడు/సభ్యురాలు కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా చెల్లించకపోతే, మిగతా నలుగురు సభ్యులకు కూడా రుణం ఇవ్వరు. అందుచేత వారు ఆ సభ్యునితో మాట్లాడి, డబ్బు సర్దుబాటు చేయడంగానీ, వాయిదా గడువు పెంచమని కోరడంగానీ చేయవచ్చు. క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించిన వారికి, రెండో దఫా ఇచ్చే అప్పు మొత్తాన్ని పెంచుతారు కూడా.

ఈ పద్ధతి చాలా దేశాల్లో విజయవంతమవుతోందని ఈ సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. దీనికి కారణం, సాధారణ బ్యాంకులు అప్పులిచ్చేటప్పుడు 'కొల్లేటరల్ సెక్యురిటీ' పేర జరిగే అగ్రిమెంట్స్‌కు వందలపేజీల డాక్యుమెంట్లను పూరించాల్సి ఉంటుంది. దాదాపు నాలుగైదు సార్లైనా బ్యాంకుల చుట్టు తిరగాల్సి ఉంటుంది. కానీ గ్రామీన్ అమెరికా సభ్యులు ఒక అకౌంట్‌ను ప్రారంభించినప్పుడు వారి ఆర్థిక స్థితిగతులను తెలిపే టాక్స్‌రిటర్న్స్ చూపిస్తే చాలు. ఇతరత్రా ఫామ్స్ నింపడం డాక్యుమెంట్ల మీద సంతకాలు చేయడం వంటి జంఝాటాలేవీ ఉండవు. ప్రతి సభ్యుడు వారానికి రెండు డాలర్లు పొదుపు ఖాతాలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. దానివల్ల పొదుపు చేయడం ప్రతిఒక్కరికీ అబ్బుతుందని నిర్వాహకులు చెబుతారు. పొదుపు చేయడం అనేది నిబంధనల ప్రకారం తప్పనిసరి. అలా చేసిన వారికే రుణాలు మంజూరు అవుతాయి.

## రుణాల నిబంధనలు

గ్రామీన్ అమెరికా ఇచ్చే రుణాలు తినుబండారాలు కొనుక్కొనేందుకు కాదని, సభ్యులందరికీ ముందుగానే స్పష్టం చేస్తారు. ఈ రుణాల ద్వారా ఆదాయాన్ని పెంచుకొనేందుకు చిన్న వ్యాపారాలు ప్రారంభించడంగానీ, కుట్టు మిషన్లు, ఫుడ్ కార్ట్‌లాంటివి కొనుక్కోవటానికి, క్లీనింగ్ సర్వీస్‌కు కావలసిన యంత్రాలను కొనడానికి, డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేసేవారు పిల్లలకు కావాల్సిన సామాగ్రి కొనుక్కోడానికి ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ అంశంపై యూనస్ మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో తమ బ్యాంక్ ఇచ్చిన ప్రతి రుణం వెనుక ఒక గొర్రెగానీ ఒక బర్రెగానీ, కోళ్లు, ఆవులుగానీ ఉంటాయని చెబుతారు. ఆర్థిక మాంద్యం అనో, లే ఆఫ్ లనో ఎందరో ఉద్యోగాలు కోల్పోతుంటారు. వారిలో దాగిఉన్న 'ఎంటర్ ప్రెన్యూరల్' స్కిల్స్‌ను వినియోగించుకొని ఆదాయవనరులను తమంత తాము సృష్టించుకొనేందుకే తాము రుణాలు మంజూరు చేస్తామని యూనస్ వివరిస్తారు.

ఒక్కో సభ్యునికి 500 నుంచి 3 వేల డాలర్ల వరకు రుణం మంజూరు చేస్తారు. ఆ రుణం తీర్చాటానికి సాధారణంగా ఆరునెలలు లేదా ఏడాది గడువు ఉంటుంది. రుణ మొత్తంపై 15శాతం వడ్డీ (డిమినిషింగ్ ప్రాతిపదికన) వసూలు చేస్తారు. చెక్కులను నగదుగా మార్చటానికి నామమాత్రపు చార్జి ఉంటుంది. మిగతా ప్రాసెసింగ్ ఫీజులు లాంటివి ఏమి ఉండవు. రుణాలు తిరిగి చెల్లింపువాయిదాలు వారంవారం ఉంటాయి. ఈ వాయిదా చెల్లింపులతో పాటు ప్రతిసభ్యుడూ రెండేసి డాలర్లు పొదుపు అకౌంట్‌లో జమచేయాల్సి ఉంటుంది.

## నిధులెలా సమకూరుతాయి?

శైశవదశలో ఉన్న గ్రామీన్ అమెరికా నిధులకోసం గ్రాంటులు, ప్రైవేటు విరాళాలు, రుణాలు, ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ తదితర

వనరులపై ఆధారపడుతోంది. కానీ, ఇలా ఇతరులపై ఆధారపడటం మా అభిమతం కాదు. సంస్థకు స్వయంసమృద్ధి వైపు పరుగులు తీయిస్తున్నాం అంటారు ఆ సంస్థ అధ్యక్షుడు విడార్ జోర్గెన్‌సెన్. దీని ప్రధాన ఆదాయవనరు సభ్యులు చెల్లించే వడ్డీ. వడ్డీమీద వచ్చే ఆదాయం అదనపు రుణాలకు పెట్టుబడిగానూ, మేనేజ్‌మెంట్ ఖర్చులకు వినియోగిస్తారు.

ప్రస్తుత దశలో 'గ్రామీన్ అమెరికా' విరాళాల సేకరణద్వారా, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలిచ్చే గ్రాంట్‌ల ద్వారా అప్పులివ్వడానికి కావలసిన నిధులను సమకూర్చుకొంటున్నది. "మైక్రోక్రెడిట్ అనే బిజినెస్ విరాళాలపై నడవదని మాకు తెలుసు. ఇది ఓ బిజినెస్ కాబట్టి, దీన్ని బిజినెస్ లాగానే నడపాలని మేము భావిస్తున్నా"ని యూనస్ వివరిస్తారు.

ప్రపంచ వ్యాప్తంగా మైక్రోఫైనాన్స్ సంస్థలు నిధుల కొరతతో సతమతమవుతోంటే, బంగ్లాదేశ్ లో తాము నిర్వహించే గ్రామీణబ్యాంక్ తన ఖాతాదారులు చెల్లించే వాయిదాలు వడ్డీలనే, తిరిగి రుణాలుగా ఇస్తున్నామని దానివల్ల నిధుల సేకరణ అవసరం ఉండటంలేదని యూనస్ అంటున్నారు.

### 10 కోట్ల డాలర్ల ప్రభుత్వ ఫండ్

అమెరికా అంతా ఆర్థిక మాంద్యపు కోరల్లో చిక్కుకొని అతలాకుతలమవుతోంటే, 'గ్రామీన్ అమెరికా' సాధిస్తున్న విజయాలను చూచి ఆశ్చర్యపడిన అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా పదికోట్ల డాలర్ల 'మైక్రో ఫైనాన్స్ గ్రోత్ ఫండ్' ను ప్రకటించారు. అయితే, ఈ 10 కోట్ల డాలర్లు చాలా తక్కువ మొత్తమని యూనస్ పెదవి విరిచారు. "బంగ్లాదేశ్‌లో తమ సంస్థ ఒక్కనెలలో 10 కోట్ల డాలర్లను రుణాలుగా అందజేస్తోందని" అన్నారు. ఏమైనా ఇదో తొలి అడుగుగా భావించ వచ్చని యూనస్ వ్యాఖ్యానించారు. గ్రామీన్ అమెరికా సభ్యులు 600 మంది తమ తొలి ఏడాది లక్ష డాలర్లు పొదుపు చేసినట్లు ఆడిట్ రిపోర్టులు చెబుతున్నాయి.

### నిరంతర పర్యవేక్షణ

రుణాలు తీసుకొన్న సభ్యులు ఆ మొత్తాలను సక్రమంగా వినియోగిస్తున్నదీ లేనిదీ చూసేందుకు సెంటర్ మేనేజర్లు ప్రతిసభ్యుడి వద్దకు వెళ్లి, రుణంగా తీసుకొన్న డబ్బుతో ఏమేం వస్తువులు కొన్నది, వాటి రసీదులను తనిఖీచేస్తారు. బిజినెస్ ప్లాన్ ప్రకారం కొనుగోళ్లు జరిగాయా లేదా అన్నదికూడా పరిశీలిస్తారు. తలపెట్టిన బిజినెస్ సక్రమంగా నడుస్తున్నదా లేదా అన్న విషయాన్ని కూడా సెంటర్ మేనేజర్లు తనిఖీ చేస్తుంటారు.

ఇంతటి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటుచేయడానికి గత 20 ఏళ్లుగా తమసంస్థ చేస్తున్న కృషి, అనుభవాలు ఎంతగానో ఉపకరించాయని యూనస్ అంటారు.

### పెట్టుబడిదారీ బ్యాంకింగ్ వ్యవస్థకు చెంపపెట్టు

మనిషిని మనిషే దోచుకొనే సంప్రదాయాన్ని సృష్టించి, దాన్ని పెంచిపోషిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు 'గ్రామీన్ అమెరికా' ఓ చెంపపెట్టులాంటిది. నమ్మకమనే పునాదిమీద పుట్టి పెరుగుతున్న ఈ సంస్థ మరింతగా ఎదిగి మనుషుల మధ్య ఆర్థిక అసమానతలను పెంచి పోషించే పెట్టుబడి దారీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని ఆశిద్దాం.




అమెరికాలో పేదరికమే లేదని చంకలు గుద్దుకొనే వారికి దినదిన ప్రవర్ధమానమవుతున్న ఈ సంస్థ విజయమే కళ్లు తెరిపిస్తోందనడంలో సందేహం లేదు.

### బంగ్లాదేశ్ లో 'గ్రామీణ బ్యాంక్'

బంగ్లాదేశ్‌లో గ్రామీణ బ్యాంక్' ను మొహమ్మద్ యూనస్ 1970 లోనే స్థాపించారు. గత నాలుగు దశాబ్దాలలో ఈ బ్యాంక్ 800 కోట్ల డాలర్లు (40 వేల కోట్ల రూపాలయాలు)ను 75 లక్షలమందికి రుణాలుగా ఇచ్చింది. ఈ బ్యాంక్‌కు బంగ్లాదేశ్‌లో 2,259 బ్రాంచ్‌లు ఉన్నాయి. 72,833 గ్రామాల్లో అంటే బంగ్లాదేశ్‌లోని 86 శాతం గ్రామాలకు ఈ బ్యాంక్ సేవలను అందిస్తోంది. రుణగ్రహీతలలో 97 శాతం మంది మహిళలే కావడం విశేషం. ప్రపంచబ్యాంక్, ప్రపంచ ఆర్థికాభివృద్ధి సంస్థలు తమదేశం పట్ల చిన్న చూపు చూస్తుండటం, వాణిజ్యబ్యాంకులు పేదవారిని పట్టించుకోకపోవడంతో యూనస్‌కి పేదలకోసం, పేదవారితోనే ఒక బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ఆలోచన వచ్చింది. మూడు దశాబ్దాల తరువాత ఆ చిన్న బ్యాంకే పదికోట్ల డాలర్ల రుణాల పంపిణీ చేసే సామర్థ్యాన్ని పొందడం ప్రశంసనీయం. అందుకే 2006లో యూనస్‌కు, గ్రామీణ బ్యాంక్‌కు సంయుక్తంగా నోబెల్ బహుమతి లభించింది.

గ్రామీణ బ్యాంక్ బంగ్లాదేశ్‌లో కాకుండా కొసావో, టర్కీ, జాంబియా, కోస్టారికా, గ్వాటిమాలా, ఇండో నేషియాలోనూ, కొత్తగా అమెరికాలోనూ తన సేవలనందిస్తోంది. అమెరికాలో ఈ సంస్థ 25 వేల శాఖలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది.

### గ్రామీన్ ట్రస్ట్

గ్రామీణ బ్యాంక్ అనుసంధానంగా ప్రపంచ దేశాలలో మైక్రో ఫైనాన్స్ సేవలందించేందుకు యూనస్ 1989లో 'గ్రామీన్ ట్రస్ట్' ను ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్‌కు 38 దేశాల్లోని 141 సంస్థలతో కలిసి పనిచేస్తోంది. అవిగాక, మరో 8 దేశాలలో ప్రత్యక్షంగా మైక్రోఫైనాన్స్ కార్యక్రమాలను రూపొందించి, నిర్వహిస్తోంది. అమెరికాలోని 'గ్రామీన్ అమెరికా'ను కూడా ఈ ట్రస్టే నిర్వహిస్తోంది.

- కె.ఎస్.ఆర్

# మెరుగైన నగరం - మెరుగైన జీవనం

## ప్రపంచ ఆవాస దినోత్సవం 2010

ఐక్యరాజ్యసమితి ప్రధాన అనుబంధ సంస్థల్లో ఒకటైన "యూఎన్ హాబిటాట్" ఏటా అక్టోబర్ నెల మొదటి సోమవారాన్ని "ప్రపంచ ఆవాస దినం"గా పాటిస్తోంది. ఈ ఏడాది ఈ దినం అక్టోబర్ 4న జరిగింది. "మెరుగైన నగరం - మెరుగైన జీవనం" అన్న నినాదంతో ఈ ఉత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకున్నారు. మనందరినీ కలవరపరిచే పట్టణ ప్రాంత సమస్యల పరిష్కారాలపై క్షుణ్ణంగా చర్చించేందుకు 1986 నుండి ప్రతీ ఏడాది ఒక్కో నినాదంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

### 'ప్రపంచ ఆవాస దినం' సందర్భంగా ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి సందేశం

ప్రపంచంలో దాదాపు 100 కోట్ల మంది మురికివాడల్లో కనీస నిలువ నీడ లేని పరిస్థితుల్లో జీవిస్తున్నారు. వారి జీవితాలను బాగు చేయడానికి అవసరమైన విధానాలను ఈ సందర్భంగా రూపొందించుకోగలుగుతున్నాం.



కొన్ని వెనుకబడిన దేశాల్లో 25 ఏళ్లు నిండినా పౌరులకు ఓటింగ్ హక్కులు లేవు. కనీస ప్రాథమిక హక్కులు గానీ, విద్య గానీ లేవు, అక్కడ చేయడానికి గౌరవ ప్రదమైన పని దొరకదు. కనీస తాగునీటి సౌకర్యం, విద్యుత్, పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్య రక్షణ బొత్తిగా ఉండవు. అటువంటి దారుణ పరిస్థితులు సాంఘిక అశాంతికి కారణమవుతున్నాయి. అవే దోపిడీకి అవినీతికి కారణమవుతున్నాయి. అటువంటి చోట్ల ప్రజలకు మెరుగైన నగరాలను, మెరుగైన జీవనాన్ని అందించాల్సిన అవసరం ఎంతో ఉంది.

కాలుష్యం మొదలు నేర ముఠాల సంస్కృతి వరకు పట్టణ ప్రాంతాల్లో ఎదురయ్యే సవాళ్లు పరిష్కరించలేనంతటి జటిలమైనవేమీ కావు. చాలా ప్రపంచ నగరాలు వీటికి తగిన పరిష్కారాలను కనుగొంటున్నాయి. కొన్ని నగరాలు ఉత్తమ పాలన ప్రాముఖ్యాన్ని గుర్తించి, అందరికీ ప్రాథమిక సేవలను అందిస్తున్నాయి. వీథుల్లో, బహిరంగ ప్రదేశాల్లో మహిళలూ, పిల్లలూ భయంలేకుండా వెళ్లగలిగే వాతావరణాన్ని కల్పించడంలో విజయం సాధించాయి. ఇంధనాన్ని ఆదా చేయడం, పరిసరాలను కాపాడుకోవడం ద్వారా వాతావరణ మార్పులను అదుపు చేయడం వంటి సవాళ్లను మెరుగైన నగరాలను అభివృద్ధి చేయడం ద్వారా సాధించవచ్చని అనేక ప్రభుత్వాలు గుర్తించాయి.

జాతీయ, స్థానిక ప్రభుత్వాలు, ప్రజలు, ప్రైవేటురంగ సంస్థల సంఘటిత ప్రయత్నాల వల్ల మాత్రమే మెరుగైన నగరాలకు రూపకల్పన చేయవచ్చు. ప్రపంచ ఆవాస దినోత్సవం సందర్భంగా అందరికీ మెరుగైన భవిష్యత్తు కోసం మెరుగైన నగరాలను ఏర్పాటు చేయడానికి చేతులుకలుపుతామని మనమంతా ప్రతిజ్ఞ చేద్దాం.

ప్రపంచ ఆవాస దినం 2010 సందర్భంగా మనం అయిదు వ్యూహాత్మక చర్యలను చేపట్టవలసి ఉంది.

### 1. నాణ్యమైన జీవనాన్ని పెంపొందించడం

మురికివాడలలో, దుర్భర పరిస్థితుల్లో బతికేవంద కోట్ల మందికి నాణ్యమైన జీవనం అందించాలి. సురక్షితమైన, ఆరోగ్య వంతమైన పరిసరాల్లో ఇళ్లు, ప్రాథమిక సేవలు, ఆరోగ్యం, విద్య వంటి సాంఘిక వసతులు మొదలైనవి మనిషి మెరుగైన జీవనానికి అత్యవసరం.

### 2. సంక్షేమానికి పెద్ద పీట

సామాజిక ఆర్థికాభివృద్ధికి, మానవ వనరుల అభివృద్ధికి పెద్దపీట వేయాలి. మరిన్ని నిధులను కేటాయించాలి. అలా చేయడం ద్వారా మాత్రమే స్థానికావసరాలకు అనుగుణంగా ఉండే విధానాలను రూపొందించడం సాధ్యమవుతుంది.

### 3. ఆర్థికావకాశాలను పెంచాలి

కార్మికులను ఎక్కువగా వినియోగించే ప్రాజెక్టులను చేపట్టి ఆర్థికాభివృద్ధికి ప్రేరణ కలిగించేలా నగర పాలకులు చర్యలు తీసుకుకోవాలి. ముఖ్యంగా ప్రజాపనులు, నిర్మాణ రంగ పరిశ్రమలకు చెందిన ప్రాజెక్టులను చేపట్టాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని నగరాలు పేదలు ఆర్థికాభివృద్ధిలో పాలు పంచుకొనేందుకు చట్టపరంగా రక్షణ కల్పిస్తున్నాయి.

### 4. రాజకీయాల్లోకి సామాన్యులు

ప్రభుత్వాన్ని సామాన్యుల చెంతకు తీసుకెళ్లడం ద్వారా ఒకరిపై ఒకరు ఆధారపడతారు. అంటే, ప్రజలు తమకు సంబంధించిన వ్యవహారాల్లో నిర్ణయాత్మక పాత్రను పొందడం, స్థానిక ప్రజాస్వామ్యంలో కీలకాంశం ఇదే.

### 5. సాంస్కృతిక రంగంలో....

అంతర్జాతీయ అభివృద్ధి ఎజెండాలో గతంలో ఎన్నడూ సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వలేదు. సంస్కృతిలో భాగమైన సామాజిక పెట్టుబడి, సాంప్రదాయాలు, గుర్తులు, ఊరూ, ఉనికి పట్ల గౌరవాభిమానాలు తదితర అంశాలకు స్థానిక అభివృద్ధి విధానాలలో భాగమైపోయాయి. వీటివల్ల మైనారిటీ జాతులను సమైక్యపర్చడం, ప్రాంతీయ విలువలను

పరిరక్షించడం, భిన్నభాషా, మత వైవిధ్యాన్ని సంరక్షించడం, విభేధాలను పరిష్కరించి జాతి వారసత్వసంపదలను రక్షించడానికి దోహదపడ్డాయి.

## రాష్ట్రంలో ప్రపంచ ఆవాస దినం - 2010

సెంటర్ ఫర్ అర్బన్‌స్టడీస్, ఏ ఎమ్మార్ - అపార్డ్ నిర్వహించిన కార్యక్రమాలు :

### 'అపార్డ్' లో కార్యక్రమాలు

హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ అర్బన్‌స్టడీస్, ఏఎమ్మార్ అపార్డ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆవాస దినాన్ని అక్టోబరు 4న ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ కమిషనర్ డాక్టర్ ఫణికుమార్ ఐఏఎస్, అర్బన్‌స్టడీస్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ పి. రఘునాధరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. భారతీయ విద్యాభవన్, ఎన్ఐఆర్‌డి క్యాంపస్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (జవహర్‌లాల్ నెహ్రూ అర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ) విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. దాదాపు 450 మంది విద్యారులకు పోస్టర్ డిజైన్, పెయింటింగ్ వకృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

అక్టోబరు 4న సాయంత్రం 3 గంటలకు ఏఎమ్మార్ - అపార్డ్ ఆడిటోరియంలో ప్రధాన కార్యక్రమం జరిగింది. అందులో జవహర్‌లాల్ నెహ్రూ అర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పి. పద్మావతి ప్రసంగించి, పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు బహూకరించారు. డాక్టర్ ఫణికుమార్ సభకు ఆహ్వానం పలుకుతూ ప్రపంచ ఆవాస దినాన్ని జరుపుకునేందుకు 'యూఎన్ హాబిటాట్' అపార్డుతో భాగస్వామి అయినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మానవ నివాస సంబంధ సమస్యలపై డాక్టర్ ఫణికుమార్ సుదీర్ఘంగా ప్రసంగిస్తూ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తు చేసుకోవడానికి ప్రపంచ ఆవాస దినాన్ని జరుపుకుంటున్నామని, ఈ సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వారికి 'యూఎన్ హాబిటాట్' పంపిన టీ - షర్టులను కూడా బహూకరించారు. అనంతరం వారంతా కలిసి గ్రూపు ఫోటో దిగారు.

రఘునాధరెడ్డి తన ప్రసంగంలో ఈ కార్యక్రమాన్ని ఎలా నిర్వహించిందీ వివరించి, అందులో పాల్గొన్న వారిని అభినందించారు.

సెంటర్ ఫర్ అర్బన్‌స్టడీస్, ఏఎమ్మార్ - అపార్డ్, చెన్నై కేంద్రంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థ 'ఫ్యూచర్ బ్రిడ్జి ఫౌండేషన్' సంయుక్త ఆధ్వర్యంలో మరో కార్యక్రమం జరిగింది. ఫ్యూచర్ బ్రిడ్జి ఫౌండేషన్ పట్టణ ప్రాంత నిరుపేద యువకుల కోసం వివిధ పోటీలను నిర్వహించింది. ఈ సంస్థ నిరుపేద పిల్లలూ, యువకుల కోసం అనేక కార్యక్రమాలను చేపడుతోంది. వాటిలో

1. ఇంగ్లీషేతర మాధ్యమాల్లో చదివే విద్యార్థులకు ఇంగ్లీష్‌లో శిక్షణ ఇవ్వడం.
2. లీడర్‌షిప్ క్లబ్బులను ఏర్పాటుచేసి కమ్యూనికేషన్, లీడర్‌షిప్ స్కిల్స్‌ను నేర్పడం
3. స్కూలు నుంచి ఇంటికొచ్చాక ట్యూషన్లు చెప్పడం




4. జనరల్ నాలెడ్జి కోసం ఎక్స్‌కర్షన్లు, టూర్‌లను నిర్వహించడం.
5. కెరీర్ గైడెన్స్, ఎమోషనల్ కౌన్సిలింగ్ తదితర అంశాలపై సహాయాన్ని అందిస్తోంది.

"చెన్నైని మెరుగైన నగరంగా ఎలా తీర్చిదిద్దాల"న్న థీమ్‌తో 'ఫ్యూచర్ బ్రిడ్జి ఫౌండేషన్' చెన్నైలోని సేక్రెడ్ హార్ట్ గరల్స్ హైస్కూలు విద్యార్థినుల కోసం అనేక పోటీలను నిర్వహించింది.

1. 8వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్,
2. 9వ తరగతి వారికి వ్యాసరచన
3. 10వ తరగతి విద్యార్థులకు వక్తృత పోటీలను నిర్వహించారు.

ఫౌండేషన్‌ను స్థాపించిన కోల్ ఇండియా రీజినల్ మేనేజర్ కృష్ణబత్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమం విజయవంతం కావడానికి స్కూలు ప్రిన్సిపాల్ సీనియర్ సెలీనా పూర్తి సహకారాన్ని అందజేశారు. స్కూలు సిబ్బంది, ఉపాధ్యాయులూ ఈ కార్యక్రమంలో చాలా ఉత్సాహంగా పాల్గొని, ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు ఏఎమ్మార్ - అపార్డ్‌కు, యూఎన్‌హాబిటాట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### ముగింపు

నగరాలలో ఇక్కడ పేర్కొన సమస్యలు ఉన్నట్లయితే ఆ సిటీని మెరుగైన నగరంగా పిలవలేము. ఆ సమస్య - 1. ఎక్కువ నేరాలు 2. అధిక జనాభా 3. ఎక్కువ మురికి వాడలు, నివాస సమస్యలు 4. అంతులేని ట్రాఫిక్ సమస్యలు 5. తాగునీటి ఎద్దడి 6. పారిశుధ్యలేమి 7. విద్యుత్ లేకపోవడం 8.. క్షీణించిన ప్రజారోగ్యం 9. చెత్తసమస్య 10. అంటీ అంటనట్లుండే రాజకీయ పార్టీలు 11. నిద్రావస్థలో ఉన్న ప్రైవేటు సెక్టార్ 12. అచేతన స్థితిలో ఉండే పౌరసంఘాలు 13. పౌర ఉద్యమాలు లేకపోవడం వంటివి ముఖ్యమైన వాటిల్లో కొన్ని మాత్రమే.

పట్టణ ప్రాంతాల్లో జీవనం మెరుగుపడాలంటే ప్రజలంతా తమ వంతు కర్తవ్యాలను విధిగా నిర్వహించాలి. ఈ సమస్యల పరిష్కారానికి జాతీయ, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల సహకారంతో ఐక్యరాజ్యసమితి తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తోంది. రోజురోజుకూ పెరిగిపోతున్న పట్టణ ప్రాంత సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ సెక్టార్, అంతర్జాతీయ సంస్థలు, ప్రజా సంఘాలు, విద్యా సంస్థలు, ప్రజలు అంతా సంయుక్తంగా తమ వంతు కర్తవ్యాలను నిర్వహించినప్పుడే పట్టణ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారమవుతాయి.

**- డాక్టర్ పి. రఘునాధరెడ్డి**

ప్రొఫెసర్ అండ్ హెడ్ - అర్బన్‌స్టడీస్, అపార్డ్, హైదరాబాద్.

*( - అనువాదం - బి. లలిత)*

Printed & Published by: Dr. Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Dr. Phani Kumar**



ఈద్ ముబారక్

Sthanika Palana RNI No. APTEL / 2009/27888

